శనివారం

04-05-2024

విజయవాడ ప్రచురణ

సంపుటి : 72, సంచిక : 312

పేజీలు : 8+టాబ్లాయిడ్, వెల: రూ.5.00

Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com

స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

పీవోకేలో ఘోర రోడ్డు ప్రమాదం

పెషావర్ : పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గిల్గిట్ బాల్టిస్థాన్ ఏరియాలోని దియామెర్ జిల్లాలో 41 మందితో ఇరుకైన కొండ మార్గంలో వెళ్తున్న బస్సు అదుపుతప్పి లోయలో పడింది. కారాకోరమ్ రహదారిపై యశోఖాల్ ఏరియాలో శుక్రవారం తెల్లవారుజామున 5.30 గంటలకు ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో 20 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో 21 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ టీమ్స్ హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించారు.

కేజ్రీవాల్ బెయిల్ పరిశీలిస్తాం

- 7న వాదనలకు సిద్ధంగా ఉండండి
- ఈడీకి సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ: దిల్లీ మద్యం కుంభకోణంలో అరెస్టయిన ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఊరట లభించింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై వాదనలు వినేందుకు సుప్రీం కోర్టు అంగీకరించింది. మే 7న ఈడీ తరపున వాదనలు వినిపించేందుకు సిద్ధంగా ఉండాలని అడిషినల్ సొలిసిటర్ జనరల్‌ను ఆదేశించింది. జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ ఇచ్చే అంశాన్ని పరిశీలించవచ్చని ధర్మాసనం ఈడీకి తెలిపింది. మనీలాండరింగ్ కేసులో ఈడీ తనను అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది. 'ఈడీ అరెస్టుకు వ్యతిరేకంగా కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్ విచారణకు సమయం పట్టే అవకాశం ఉంది. అందుకే ఆయన మధ్యంతర బెయిల్ పిటిషన్ విచారణను పరిశీలిస్తాం' అని సుప్రీం ధర్మాసనం వెల్లడించింది. దీనిపై

- మిగతా 2 లో

ప్రచార హోరు

- నేతల సభలు, రోడ్‌షోలు
- బిజీబిజీగా అభ్యర్థులు
- తుది వ్యూహాల్లో పార్టీలు
- 13న ఎన్నికలకు సన్నద్ధం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల ఘట్టం తుది దశకు చేరుకుంది. మరో పది రోజుల్లో పోలింగ్ జరగనుంది. పోటీలో ఉన్న అభ్యర్థులు, నేతలు చివరి అస్త్రాలు, వ్యూహాలకు సిద్ధమయ్యారు. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ స్థానాలకుగాను ఇండియా కూటమి తరపున కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వైసీపీ ఒంటరిగా పోటీ చేస్తుండగా... ఎన్డీఏ కూటమి(బీజేపీ, టీడీపీ, జనసేన) పక్షాలు సీట్ల సర్దుబాటుతో బరిలో నిలిచాయి. ఈ ఎన్నికల్ని అన్ని పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నాయి. అదే దిశగా లోక్‌సభ, అసెంబ్లీ అభ్యర్థులను ఎంపిక చేశాయి. ఇండియా కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నేతలు, ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు ముమ్మర ప్రచారంలో నిమగ్నమయ్యాయి. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల, సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, వి.శ్రీనివాసరావు సుడిగాలిలా పర్యటిస్తున్నారు. ఇండియా కూటమి నేతల విజయాన్ని కాంక్షిస్తూ విజయవాడ, గుంటూరు తదితర ప్రాంతాల్లో సీపీఐ నేత రామకృష్ణ రోడ్‌షోలు నిర్వహించారు. ఆయా అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను, బీజేపీకి మద్దతు పలుకుతున్న పార్టీలను ఎండగడుతూ ప్రచారం సాగిస్తున్నారు. కాంగ్రెస్ నేత షర్మిల బస్సు యాత్ర పూర్తి చేశారు. ఆమె అడుగడుగునా రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన బీజేపీపైన ఆ పార్టీతో పొత్తుకు దిగిన టీడీపీ, రహస్య అవగాహనతో ముందుకు సాగుతున్న వైసీపీపై ఘాటు వ్యాఖ్యలు చేస్తున్నారు. వైసీపీ, టీడీపీకి ఓట్లు వేస్తే... మతోన్మాద బీజేపీకి వేసినట్లేనంటూ ప్రజలను హెచ్చరిస్తున్నారు. కాగా ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి పక్షాల నుంచి 16 మంది తిరుగుబాటు దారులుగా పోటీలో ఉన్నారు. వారంతా పోటాపోటీగా ప్రచారంలో నిమగ్నమయ్యారు. ఈ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేశ్‌కుమార్ కమార్ మీనా చర్యలు చేపట్టారు. సమస్యాత్మక ప్రాంతాల్లో సీఆర్‌ఫీ బలగాలను మోహరించనున్నారు.

సిద్ధం నినాదంతో వైసీపీ

ఈ ఎన్నికల్లో వైసీపీ 'సిద్ధం' నినాదంతో ప్రచారం చేపట్టింది. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే..నాలుగు ప్రాంతాల్లో సిద్ధం సభలతో ఎన్నికల ప్రచారానికి జగన్ శ్రీకారం చుట్టారు. అక్కడితో ఆగకుండా మేమంతా సిద్ధం పేరుతో 22 రోజులపాటు 86 నియోజకవర్గాల్లో ప్రచారం పూర్తిచేశారు. ఆ తర్వాత రోజుకు మూడు చొప్పున మూడు ప్రాంతాల్లో జగన్ సభలు కొనసాగుతున్నాయి. వాటికితోడుగా జగన్ కోసం మేమంతా కార్యక్రమాన్ని వైసీపీ రూపొందించింది. దీని ద్వారా వైసీపీ మేనిఫెస్టోను బూత్‌లెవెల్ కార్యకర్తలు, స్టార్ క్యాంపెయినర్లు ఇంటింటా ప్రచారం చేస్తారు. మరో వైపు వైసీపీ ఎన్‌ఆర్‌ఐల సహకారంతో జగన్ కోసం సిద్ధం ప్రచారాన్ని చేపడుతున్నారు. ఎన్‌ఆర్‌ఐల సహకారంతో ఏర్పాటు చేసిన నాలుగు బస్సులు ప్రజల్లోకి వెళ్లాయి. ఇందులో ఎన్‌ఆర్‌ఐలతోపాటు స్టార్ క్యాంపెయినర్లు, వైసీపీ ముఖ్యనేతలు ఉంటారు. ఈ ఎన్నికల్లో తిరిగి ప్రభుత్వం ఏర్పాటుకు ప్రయత్నిస్తున్న అధికార వైసీపీ... విభిన్న రూపాల్లో ప్రచారం చేపడుతోంది. 2019 మేనిఫెస్టోలో

- మిగతా 2 లో

రైతు ఉద్యమ నేత అంజాన్ కన్నుమూత

సీపీఐ, ఏఐకేఎస్ సంతాపం

న్యూఢిల్లీ: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ కార్యదర్శి, అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) ప్రధాన కార్యదర్శి అతుల్ కుమార్ అంజాన్(70) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ లక్నోలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అంజాన్ శుక్రవారం తెల్లవారుజామున 3.40 గంటలకు తుదిశ్వాస విడిచారు. అంజాన్ అకాల మరణం పట్ల సీపీఐ ప్రగాఢ సంతాపం తెలిపింది. ఆయన తండ్రి డాక్టర్ ఏపీ సింగ్ ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు. హెచ్ఎస్ఆర్ఏ (హిందూస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్) ఉద్యమాలలో సింగ్ పాల్గొన్నారు. బ్రిటిష్ హయాంలో సుదీర్ఘకాలం జైలు శిక్ష అనుభవించారు. కాగా, తన 20 ఏళ్ల వయసులో అంజాన్ నేషనల్ కాలేజీ స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. విద్యార్థుల సమస్యలు వినిపించడంలో ప్రసిద్ధి చెందిన అంజాన్ వరుసగా నాలుగు పర్యాయాలు లక్నో విశ్వవిద్యాలయం విద్యార్థి సంఘం అధ్యక్ష పదవి చేపట్టారు. అర డజను భాషలలో ప్రతిభావంతులైన వక్త అయిన అంజాన్ తన యూనివర్సిటీ రోజుల్లో భారత కమ్యూనిస్టు పార్టీలో చేరారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రసిద్ధ పోలీసు–పీఏసీ తిరుగుబాటుకు చెందిన ప్రధాన నాయకులలో ఆయన ఒకరు. అంజాన్ తన రాజకీయ ప్రయాణంలో నాలుగు సంవత్సరాల తొమ్మిది నెలల పాటు జైలు జీవితం గడిపారు. ఆయన రాజకీయ, సైద్ధాంతిక విశ్వాసం, విద్యార్థుల ఉద్యమాలకు నాయకత్వం వహించే సామర్థ్యం కారణంగా 1979లో అఖిల భారత విద్యార్థి సంఘం (ఏఐఎస్ఎఫ్) లూథియానా సదస్సులో అధ్యక్షుడయ్యారు. 1985 వరకు ఆ పదవిలో కొనసాగారు. 1960 దశకం చివరలో భారత కమ్యూనిస్టు పార్టీలో చేరిన ఆయన తన చివరి

- మిగతా 2 లో

వైఎస్ వివేకా హత్య కేసులో అవినాశ్‌రెడ్డికి ఊరట

- దస్తగిరి పిటిషన్ కొట్టేసిన తెలంగాణ హైకోర్టు
- భాస్కర్‌రెడ్డికి బెయిల్ మంజూరు
- విచారణలో ఉండగా హంతకుడు అనడంపై ఏపీ హైకోర్టు అభ్యంతరం

మాజీమంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డికి ఊరట లభించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు దస్తగిరి వేసిన పిటిషన్‌ను శుక్రవారం ఉదయం తెలంగాణ హైకోర్టు కొట్టేసింది.

2లో

మతాల మధ్య మోదీ చిచ్చు

- సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా
- విజయవాడలో భారీ రోడ్‌షో
- ప్రజల మనిషి కోటేశ్వరరావును గెలిపించాలని పిలుపు

విశాలాంధ్ర–విజయవాడ: కేంద్రంలో పదేళ్లుగా అధికారంలో ఉండి అభివృద్ధి గురించి చెప్పటానికి ఏమి లేక మతాల మధ్య చిచ్చుపెడుతున్న ప్రధాని మోదీకి ప్రజలు బుద్ధి చెప్పాలని సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ అజీజ్ పాషా అన్నారు. ఇండియా కూటమి బలపర్చిన విజయవాడ పశ్చిమ నియోజకవర్గ సీపీఐ అభ్యర్థి జి.కోటేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం విజయవాడ వన్‌టౌన్ ప్రాంతంలో నిర్వహించిన భారీ రోడ్ షోలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అజీజ్ పాషా మాట్లాడుతూ... ఇప్పటివరకు జరిగిన రెండు విడతల ఎన్నికల్లో పోలింగ్ సరళి ఎన్డీఏకి అనుకూలంగా లేదని ఇంటెలిజెన్స్ రిపోర్టులు రావడంతో మోదీ హిందూ, ముస్లింల మధ్య చిచ్చుపెట్టి రాజకీయలబ్ధికి కుట్ర చేస్తున్నారని విమర్శించారు. మత విద్వేషాలు రెచ్చగొడుతున్న మోదీపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవటం లేదన్నారు. ఎన్నికల కమిషన్‌ను గుప్పెట్లో పెట్టుకోవటమే దీనికి కారణం అన్నారు. సుప్రీం కోర్టు అయినా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రపంచంలో 3వ ఆర్థిక శక్తిగా భారత్ ఎదుగుతున్నట్లు గొప్పలు చెబుతున్నారని... వాస్తంగా దేశ ఆర్థిక పరిస్థితి దివాలా తీసేలా ఉందన్నారు. 2014లో వ్యవసాయ రంగంలో ఎగుమతులు 10.10 శాతం ఉంటే ఇప్పుడు 2.2 శాతంగా ఉందన్నారు. జీడీపీలో అమెరికా, జర్మనీ, జపాన్, చైనా కంటే వెనుకబడి ఉన్నామన్నారు. మోదీ ప్రభుత్వం మీడియాను చెప్పుచేతల్లో పెట్టుకుని తాను ఏదో సాధించినట్లు దేశంలో ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. జీ20 సదస్సు మన కంటే ముందు ఇండోనేసియాలో జరిగిందని, వారు రూ.130 కోట్లు ఖర్చు చేశారని, జపాన్ రూ.510కోట్లు,

- మిగతా 2 లో

ఇండియా' అభ్యర్థుల గెలుపు కోసం సీపీఐ భారీ బైక్ ర్యాలీ

8లో

ఇదీ లోకం!

జగన్‌ను సాగనంపుదాం

పొదిలి సభలో చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో–ఒంగోలు: రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన సైకో ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మార్కాపురం నియోజకవర్గ అభ్యర్థి కందుల నారాయణరెడ్డి గెలుపును కాంక్షిస్తూ ఒంగోలు జిల్లా పొదిలిలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు. గడిచిన ఐదేళ్లలో సైకో జగన్ ప్రభుత్వం... రాష్ట్ర అభివృద్ధిని పక్కనబెట్టి కోట్ల రూపాయలు దోచుకోవడంపైనే దృష్టి పెట్టారని ఆరోపించారు. మాయమాటలు చెబుతూ మరో అవకాశం కోసం మీ వద్దకు వస్తున్నాడని, ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ఓటుతో జగన్‌కు బుద్ధి చెప్పాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. అమ్మ, చెల్లిని చూడనివారు రాష్ట్ర ప్రజలను చూస్తాడా అని ప్రశ్నించారు. మూడు

- మిగతా 2 లో

మోసగాళ్లకు ఓటుతో బుద్ధి చెప్పండి

- నెల ఆగండి...మరలా నేనే సీఎం
- ఇంటివద్దకే పెన్షన్ తెచ్చిస్తాం
- ఎన్నికల సభల్లో వైసీపీ అధినేత జగన్

విశాలాంధ్రబ్యూరో–ఒంగోలు/నరసాపురం/పెదకూరపాడు: అవ్వా తాతలు ఒక నెల ఆగండి... మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తా... మీ పెన్షన్ ఇంటికి తీసుకొచ్చి ఇస్తా... మోసగాళ్లు ఓటుకోసం వస్తున్నారు...జాగ్రత్తగా ఉండండి అంటూ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ప్రకాశం జిల్లా కనిగిరి, పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం, పల్నాడు జిల్లా పెదకూరపాడు క్రోసూర్ సెంటర్‌లో జరిగిన బహిరంగ సభల్లో మాట్లాడారు. కనిగిరి సభలో మాట్లాడుతూ కుట్రలు, వెన్నుపోట్లతో కూటమి కట్టి జెండాలు జతకట్టి వస్తున్న మోసగాళ్లకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. గడిచిన ఐదేళ్లలో నేను ఏం చేశానో ధైర్యంగా చెప్పగలుగుతున్నానని... ముఖ్యమంత్రిగా 14 ఏళ్లు పాలించిన చంద్రబాబు ఏం చేశాడో చెప్పగలడా అని ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడు పేరు చెబితే దోచుకోవడం, పంచుకోవడం తప్ప ప్రజల హృదయాల్లో గుర్తుండిపోయే ఒక్క పథకమైనా ఉందా అన్నారు. ఈ ఎన్నికల్లో వైసీపీని ఆదరించాలని కోరారు. మళ్లీ మీ బిడ్డ ప్రభుత్వం వస్తే మీకొస్తున్న ప్రతి పథకం రెట్టింపు స్థాయిలో కొనసాగిస్తానని, లేదంటే జగన్ పథకాలన్నీ చంద్రబాబు రద్దు చేస్తాడని పేర్కొన్నారు. కనిగిరి వైసీపీ అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్, ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. నర్సాపురం సభలో మాట్లాడుతూ... పది రోజుల్లో పేదలకు– పెత్తం దారులకు మధ్య జరిగే ఎన్నికల్లో పేదల పక్షాన

- మిగతా 2 లో

రాయ్‌బరేలీ బరిలో రాహుల్

- నామినేషన్ దాఖలు చేసిన కాంగ్రెస్ అగ్రనేత
- హాజరైన ఖర్గే, సోనియా, ప్రియాంక
- అమేథీ నుంచి కె.ఎల్.శర్మ నామినేషన్ దాఖలు

2లో

రాహుల్ ముందే చెప్పాల్సింది

- వయనాడ్ ప్రజలకు అన్యాయం
- ఇది రాజకీయనీతి కాదు
- సీపీఐ నేత అనీరాజా

తిరువనంతపురం: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ రాయ్‌బరేలీ లోక్‌సభ స్థానం నుంచి పోటీచేయడంపై వయనాడ్‌లో ఆయన ప్రత్యర్థి, ఎల్డీఎఫ్ కూటమి అభ్యర్థి అయిన సీపీఐ నేత అనీరాజా స్పందించారు. రాహుల్‌గాంధీ మరో నియోజకవర్గంలో పోటీ చేస్తున్నట్లు వయనాడ్ ప్రజలకు తెలియజేసి వయనాడ్‌లో పోటీ చేసి ఉండవచ్చునని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ విషయాన్ని దాచిపెట్టడం వయనాడ్ ఓటర్లకు జరిగిన అన్యాయమని పేర్కొన్నారు. ఇది రాజకీయ నీతికి అనుగుణంగా లేదని అనీరాజా అన్నారు. 'పార్లమెంటరీ ప్రజాస్వామ్యం లో ఒక వ్యక్తి రెండు నియోజకవర్గాల్లో పోటీ

- మిగతా 2 లో

ప్రచార హోరు

(మొదటిపేజీ తరువాయి)

99 శాతం అమలు చేశామని ఆ పార్టీ అధినేత జగన్ చెబుతున్నారు. 2014లో ఎన్డీఏ కూటమి ఇచ్చిన మేనిఫెస్టోలో ఒక్కటీ అమలు చేయలేదని, మళ్లీ అమలుకాని హామీలిచ్చారంటూ బహిరంగ సభల్లో విమర్శిస్తున్నారు.

జగనే లక్ష్యంగా చంద్రబాబు, పవన్ విమర్శలు

ఎన్డీఏ భాగస్వామ్య పార్టీలైన బీజేపీ, టీడీపీ, జనసేన ప్రచారం ఊపందుకుంది. ముఖ్యంగా చంద్రబాబు, పవన్‌లు సీఎం జగనే లక్ష్యంగా బహిరంగ సభల్లో ఘాటు విమర్శలు చేయడం చర్చనీయాంశమైంది. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో విచ్చలవిడిగా అవినీతి జరిగిందని, రాష్ట్రం అప్పులమయమైందని చెబుతున్నారు. ఎన్డీఏ కూటమి అధికారం చేపడితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని హామీలిస్తున్నారు. ఇప్పటికే ఎన్డీఏ కూటమి తరపున ఉమ్మడిగా చిలకలూరిపేట వేదికగా ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఎన్నికలకు శంఖారావం పూరించారు. ఆ తర్వాత కేంద్ర మంత్రులు అక్కడక్కడా పర్యటించారు. ఇక ప్రచార ఘట్టం తుది దశకు చేరుకోవడంతో... మరోసారి ప్రధాని మోదీ పర్యటన ఖరారైంది. రాజమండ్రి, అనకాపల్లి, రాజంపేట, విజయవాడ లోక్‌సభ పరిధిలో మోదీ ప్రచారం నిర్వహిస్తారు. మోదీ పర్యటన విజయవంతం చేయడానికి టీడీపీ, బీజేపీ, జనసేన సమాయత్తమవుతున్నాయి.

ఎన్డీఏ కూటమిలో గందరగోళం

ఎన్డీఏ కూటమి పార్టీల ప్రచారంలో గందరగోళం ఏర్పడింది. ఇటీవల చంద్రబాబు, పవన్ కల్యాణ్ విడుదల చేసిన మేనిఫెస్టోపై ప్రధాని నరేంద్ర మోదీ ఫోటో ను ముద్రించలేదు. కేవలం చంద్రబాబు, పవన్ ఫోటోలే ఉండటంతో ఎన్డీఏలో సమన్వయ లోపం స్పష్టమైంది. ఈ మేనిఫెస్టోను బీజేపీ కేవలం ఆశీస్సులతోనే సరిపెట్టింది. అనంతరం టీడీపీ అధినేత చంద్రబాబు జారీజేసిన ఎన్నికల ప్రకటనల్లో పవన్ ఫోటో కనిపించలేదు. కేంద్రంలోని బీజేపీతో పొత్తులో కొనసాగితే..తమకు మైనార్టీల ఓట్లు దూరమవుతాయన్న ఆందోళన టీడీపీని వెంటాడుతోంది. ఇటీవల ముస్లిం రిజర్వేషన్ల రద్దు అంశంపై ఏర్పడిన వివాదమూ టీడీపీ, జనసేనకు తలనొప్పిగా మారాయి. చంద్రబాబుతోపాటు పవన్ కల్యాణ్ ఫోటోలు ముద్రిస్తే...టీడీపీకి మహిళా ఓటర్లు దూరమవుతారన్న ప్రచారముంది. దీంతోనే వ్యూహాత్మకంగా మోదీ, పవన్ బొమ్మలను తొలగించారన్న విమర్శలున్నాయి.

అంజాన్ కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

శ్వాస వరకు పార్టీలోనే కొనసాగారు. 1989లో కోల్‌కతాలో జరిగిన సీపీఐ 14వ జాతీయ మహాసభల్లో పార్టీ జాతీయ సమితికి, 1992లో హైదరాబాద్‌లో జరిగిన 15వ జాతీయ మహాసభల్లో జాతీయ కార్యవర్గానికి, 1995లో ఢిల్లీలో జరిగిన 16వ మహాసభల్లో జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. చివరి శ్వాస వరకు ఆ పదవిలో కొనసాగారు. 1997లో త్రిస్సూర్ జాతీయ సదస్సు సందర్భంగా ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 2001, 2006, 2010, 2016 సంవత్సరాలలో కూడా అదే పదవికి అతుల్ కుమార్ అంజాన్ ఎన్నికయ్యారు. రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నారు. రైతుల ఉత్పత్తులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) సహా అనేక సిఫార్సులు చేసిన స్వామినాథన్ కమిషన్‌లోని ఏకైక రైతు సభ్యుడిగా ఆయన చేసిన కృషి ప్రత్యేకమైనది. అంతేకాకుండా, దేశవ్యాప్తంగా విద్యార్థుల ఉద్యమం, రైతు ఉద్యమం, పార్టీ నిర్మాణంలో అతుల్ కుమార్ అంజాన్ అద్భుతమైన పాత్ర పోషించారు. మితవాద, ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేసిన యోధుడు. అంజాన్ మరణం దేశంలోని ప్రస్తుత పరిస్థితుల్లో భారత కమ్యూనిస్టు పార్టీకి, రైతు ఉద్యమానికి తీరని లోటని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఒక ప్రకటనలో ప్రగాఢ సంతాపం తెలిపారు. అంజాన్‌కు పార్టీ ఘన నివాళులు అర్పిస్తూ, అన్ని రకాల దోపిడీ, వివక్ష లేని నవ భారతదేశం కోసం పోరాడటానికి ఆయన జీవితం నుంచి స్ఫూర్తి పొందాలని, ఆయన ఆశయాలు ముందుకు తీసుకెళ్లాలని పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులకు రాజా పిలుపునిచ్చారు. కాగా, అంజాన్ అంత్యక్రియలు శనివారం మధ్యాహ్నం 3 గంటలకు లక్నోలో జరుగుతాయని సీపీఐ ఒక ప్రకటనలో పేర్కొంది.

అంజాన్ మృతికి రాజకీయ నేతలు, సామాజిక కార్యకర్తల సంతాపం

అతుల్ కుమార్ అంజాన్ మృతి పట్ల అనేక రాజకీయ పార్టీల నాయకులు, సామాజిక కార్యకర్తలు సంతాపం తెలిపారు. రైతుల ప్రయోజనాల కోసం పోరాడిన నాయకుడు అంజాన్ అని రైతు నాయకుడు రాకేశ్ తికైత్ గుర్తు చేశారు. ఆర్ఎల్‌డీ పార్టీ నాయకుడు జయంత్ సింగ్ 'ఎక్స్' లో ఒక పోస్ట్‌లో అతుల్ కుమార్ అంకితభావంతో కూడిన ప్రజా సేవకుడని పేర్కొంటూ...ఆయన మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు.

రైతు ఉద్యమానికి తీరనిలోటు: రావుల వెంకయ్య

రైతుల సంక్షేమానికి నిబద్ధతతో అవిశ్రాంత కృషి చేసిన అతుల్‌కుమార్ అంజన్ మృతి దేశంలో రైతు ఉద్యమానికి తీరనిలోటుగా అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) అధ్యక్షులు రావుల వెంకయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వామినాథన్ కమిషన్‌లోని ఏకైక రైతు సభ్యునిగా ఆయన చేసిన కృషి గమనార్హమైనదిగా పేర్కొన్నారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక విధానాలు, వినాశకర మూడు రైతు వ్యతిరేక చట్టాలను వ్యతిరేకిస్తూ రైతులు నిర్వహించిన మహత్తర పోరాటం, రైతుల తాజా ఉద్యమాన్ని సరైన దిశలో నడిపించడంలో అతుల్ ముఖ్యమైన పాత్ర పోషించారని నివాళు లర్పించారు. సంయుక్త కిసాన్ మోర్చా నాయకులతో సత్సంబంధాలు కలిగి ఉన్న ఆయనతో రైతు నేతలు నిత్యం సంప్రదింపులు జరిపేవారు. తన పోరాటాల ద్వారా అంజన్ దేశంలో ప్రముఖ రైతు నాయకుడుగా ఆవిర్భవించారనీ, ఆయన మృతి దేశంలోని రైతు సంఘాలు, వామపక్ష ఉద్యమానికి పెద్ద దిగ్భ్రాంతిని కలిగించిందని రావుల వెంకయ్య పేర్కొన్నారు. అంజన్ మృతి సమాచారం తెలిసిన వెంటనే వెంకయ్య హుటాహుటిన విజయవాడ నుంచి లక్నో బయలుదేరి వెళ్లారు. లక్నోలో అంజన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. భార్య, పిల్లలు, ఇతర కుటుంసభ్యులను ఊరడించారు. అంత్యక్రియల ఏర్పాట్లను కుటుంబ సభ్యులతో సమీక్షించారు. అంజన్ మృతికి సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతిని రావుల వెంకయ్య తెలిపారు.

రైతు సంఘ నేతల ప్రగాఢ సంతాపం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) ప్రధాన కార్యదర్శి అతుల్ కుమార్ అంజాన్ మృతి రైతాంగానికి తీరని లోటని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు పి.రామచంద్రయ్య, కార్యనిర్వాహక అధ్యక్షులు ఎ.కాటమయ్య, అధ్యక్షులు జి.ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి దేగా ప్రభాకర్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో సంతాపాన్ని, అంజాన్ కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. అంజాన్ రైతాంగ సమస్యలపై అనేక ఉద్యమాలు నిర్వహించారని, కేంద్రం తీసుకువచ్చిన రైతు వ్యతిరేక మూడు వ్యవసాయ చట్టాల రద్దు కోసం జరిగిన పోరాటంలో ఆయన అన్ని రైతు సంఘాలను, రైతులను ఏకతాటిపైకి తెచ్చి పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించారని తెలిపారు. డాక్టర్ స్వామినాథన్ కమిషన్‌లో సభ్యులుగా రైతాంగ ఉత్పత్తులకు సి2+50 ప్రకారం మద్దతు ధర కల్పించేందుకు, రైతులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరుతూ అనేక ఉద్యమాలు నిర్వహించారని గుర్తు చేసుకున్నారు. కొద్ది కాలంగా ఆయన క్యాన్సర్‌తో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించటం బాధాకరమని, వారి మృతికి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

కేజ్రీవాల్ బెయిల్‌ను పరిశీలిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

స్పందిస్తూ.. మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను తాము వ్యతిరేకిస్తామని ఈడీ తరపున అడిషినల్ సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజు పేర్కొన్నారు. దాంతో మరింత స్పష్టతనిచ్చిన ధర్మాసనం... 'కేవలం పిటిషన్‌ను మాత్రమే విచారిస్తాం, బెయిల్ ఇస్తామని చెప్పడం లేదు. చివరకు బెయిల్ ఇవ్వొచ్చు, ఇవ్వకపోవచ్చు' అని తెలిపింది. ఒకవేళ బెయిల్ ఇవ్వాల్సి వస్తే... ఎటువంటి షరతులు విధించాలో కూడా 7వతేదీన తెలియపర్చాలని... ఇందుకు సంబంధించి వాదనల కోసం సిద్ధమై రావాలని ఈడీకి సుప్రీం ధర్మాసనం సూచించింది. మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో మార్చి 21న అరెస్టు అయిన ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్.. ప్రస్తుతం తిహార్ జైల్లో ఉన్నారు. ఈ క్రమంలో బెయిల్ కోసం ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందన తెలియజేయాలని ఏప్రిల్ 15న ఈడీకి నోటీసులు జారీ చేసింది. కేజ్రీవాల్ తరపున సీనియర్ న్యాయవాది ఏఎం సింఘ్వీ అత్యున్నత న్యాయస్థానంలో వాదించారు.

రాయ్‌బరేలీ బరిలో రాహుల్

రాయ్‌బరేలీ/న్యూఢిల్లీ : కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ పోటీపై ఉత్కంఠకు తెరపడింది. ఉత్తర ప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నియోజకవర్గం నుంచి శుక్రవారం లోక్‌సభ స్థానానికి నామినేషన్ల గడువు ముగియడానికి గంట ముందు రాహుల్ గాంధీ తన పత్రాలను దాఖలు చేశారు. అంతకుముందు ఉదయం, అమేథీ, రాయ్ బరేలీ పోటీ చేసే అభ్యర్థుల పేర్లను వెల్లడించింది. రెండు దశాబ్దాలుగా తన తల్లి సోనియా గాంధీకి చెందిన స్థానం నుంచి రాహుల్ అభ్యర్థిత్వాన్ని ప్రకటించింది. రాహుల్ 2019లో పక్కనే ఉన్న అమేథీ నియోజకవర్గం నుంచి ఓడిపోయారు. కానీ కేరళలోని వయనాడ్ నుంచి గెలుపొందారు. ఈ సారి కూడా ఆయన వయనాడ్ నుంచి పోటీ చేస్తున్నారు. మే 20న జరగనున్న పోలింగ్‌కు నామినేషన్లు దాఖలు చేసేందుకు చివరి రోజు శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో రాహుల్ పత్రాలను దాఖలు చేస్తున్న సమయంలో ఆయనతో పాటు కాంగ్రెస్ నేతలు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా ఉన్నారు. గాంధీ బావ రాబర్ట్ వాద్రా కూడా హాజరయ్యారు. అలాగే రాజస్తాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్ కుటుంబ సమేతంగా వచ్చారు. నేతలు అమేథీలోని ఫుర్సత్‌గంజ్ విమానాశ్రయానికి చేరుకుని, ఆ తర్వాత పక్కనే ఉన్న రాయ్‌బరేలీకి వెళ్లారు. పార్టీ మాజీ అధ్యక్షుడిని ఉత్సాహపరిచేందుకు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు, ఇతర ఇండియా కూటమి భాగస్వాములు జిల్లా కలెక్టరేట్ వద్దకు చేరుకున్నారు. గతంలో తన తల్లి సోనియాగాంధీ, అమ్మమ్మ ఇందిరాగాంధీ, తాతయ్య ఫిరోజ్‌గాంధీ నిర్వహించిన స్థానం నుంచి రాహుల్ గాంధీ పోటీ చేస్తున్నారు. రాయ్‌బరేలీ నుంచి తమ అభ్యర్థిగా దినేష్ ప్రతాప్ సింగ్‌ను బీజేపీ గురువారం ప్రకటించింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో సోనియా గాంధీ చేతిలో సింగ్ ఓడిపోయారు.

అమేథీ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా కె.ఎల్.శర్మ నామినేషన్

అమేథీ : కాంగ్రెస్ అభ్యర్థి కె.ఎల్.శర్మ శుక్రవారం అమేథీ లోక్‌సభ స్థానం నుంచి నామినేషన్ దాఖలు చేశారు. స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి కలెక్టరేట్‌లో శర్మ తన పత్రాలను దాఖలు చేశారు. కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా అంతకుముందు అమేథీలో శర్మకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. నియోజకవర్గానికి వచ్చిన వెంటనే ప్రియాంక గౌరీగంజ్‌లోని పార్టీ కార్యాలయానికి వెళ్లి శర్మను కలిశారు. ఆయన గెలుపు కోసం పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. తన తల్లి సోనియా గాంధీ గతంలో ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గం నుంచి నామినేషన్ దాఖలు చేయనున్న రాహుల్ గాంధీతో పాటు ఆమె రాయ్ బరేలీకి బయలుదేరారు. మే 20న జరగనున్న ఐదో విడత పోలింగ్‌కు నామినేషన్ దాఖలు చేయడానికి చివరి రోజు శుక్రవారం తెల్లవారుజామున అమేథీ స్థానం నుంచి శర్మ అభ్యర్థిత్వాన్ని ప్రకటించారు. బీజేపీ నాయకురాలు, సిట్టింగ్ ఎంపీ స్మృతి ఇరానీపై శర్మ పోటీ చేస్తున్నారు. అమేథి లోక్‌సభ నియోజకవర్గం గాంధీ కుటుంబానికి కంచుకోట అన్న విషయం తెలిసిందే. గతంలో సంజయ్ గాంధీ, రాజీవ్ గాంధీ, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఈ స్థానం నుంచి గెలుపొందారు. ఇక 2004లో రాహుల్ తొలిసారి అమేథి నుంచి పోటీ చేసి గెలుపొందారు. 2009, 2014 ఎన్నికల్లో వరుసగా అమేథి నుంచే విజయం సాధించారు. అయితే 2019లో జరిగిన ఎన్నికల్లో మాత్రం బీజేపీ ఎంపీ అభ్యర్థి, ప్రస్తుత కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ చేతిలో ఓటమిపాలయ్యారు.

అమేథీలో కాంగ్రెస్ ఓటమిని అంగీకరించింది : స్మృతీ ఇరానీ

అమేథీ జిల్లాలోని గౌరీగంజ్‌లోని కాంగ్రెస్ కార్యాలయానికి గురువారం సాయంత్రం రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ చిత్రాలతో కూడిన పోస్టర్లను కేంద్ర మంత్రి, అమేథీ ఎంపీ స్మృతి ఇరానీ తీసుకువచ్చారు. ఇప్పటికే ఈ నియోజకవర్గం నుంచి మళ్లీ నామినేషన్ దాఖలు చేసిన బీజేపీ నాయకురాలు మాట్లాడుతూ 'గాంధీ కుటుంబీకులు అమేథిలో పోటీ చేయకపోవడాన్ని బట్టి చూస్తుంటే పోలింగ్‌కు ముందే వారు ఓటమిని అంగీకరించారు. ఈ సీటుపై విజయం సాధించే అవకాశం ఉందని వారు భావించినట్లయితే వారే పోటీకి దిగేవారు. మరో అభ్యర్థిని నిలబెట్టేవాళ్లే కాదు. రాహుల్ గాంధీ ఇక్కడి నుంచి వెళ్లిపోవడమంటే అది అమేథి ప్రజల విజయమే' అని ఆమె అన్నారు. మే 20న జరిగే ఎన్నికల్లో అమేథి నుంచి మళ్లీ తానే గెలుస్తానని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి ధీమా వ్యక్తం చేశారు.

దేశం గొప్ప నాయకుడిని కోల్పోయింది

అతుల్ కుమార్ అంజాన్ సంతాప సభలో అజీజ్ పాషా

విశాలాంధ్ర-విజయవాడ : అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) ప్రధాన కార్యదర్శి, సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు అతుల్ కుమార్ అంజాన్ మరణంతో దేశం గొప్ప నాయకుడిని కోల్పోయిందని సీపీఐ జాతీయ కార్యదర్శి, పార్లమెంటు మాజీ సభ్యులు అజీజ్ పాషా అన్నారు. విజయవాడ దాసరి భవన్‌లో శుక్రవారం ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం అధ్వర్యంలో అతుల్ కుమార్ అంజాన్ సంతాప సభ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ అధ్యక్షత జరిగింది. ఈ సభలో అజీజ్ పాషా మాట్లాడుతూ దేశానికి, కమ్యూనిస్టు పార్టీకి అతుల్ కుమార్ విలువైన సంపద అన్నారు. ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్న తరుణంలో ఉత్తర ప్రదేశ్‌లో అఖిలేశ్ యాదవ్ ఇండియా కూటమి తరపున సీపీఐకి ఒక సీటు కేటాయిస్తామని, అది కూడా కేవలం అతుల్ కుమార్ అంజన్ కోసం అని స్పష్టం చేశారంటే ఆయన ఎంత పెద్ద నాయకుడో అర్థమవుతోందని తెలిపారు. తనకు క్యాన్సర్ ఉందని తెలిసినా ఎంతో ఆత్మస్థైర్యంతో పని చేశారని చెప్పారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో రైతు సమస్యలపై పోరాడిన గొప్ప నేత అతుల్ కుమార్ అన్నారు. విద్యార్థి ఉద్యమం నుంచి తనకు ఆయనతో సాన్నిహిత్యం ఉందన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ ఉత్తర భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేసేందుకు అతుల్ కుమార్ ఎంతో కృషి చేశారన్నారు. ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ రైతులు, రైతు కూలీలు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై అంజాన్ చేసిన ఉపన్యాసాలు ఎంతో ప్రేరణ ఇచ్చాయన్నారు. కేంద్రం తీసుకువచ్చిన మూడు వ్యవసాయ నల్లచట్టాలను వ్యతిరేకిస్తూ జరిగిన ఉద్యమంలో అతుల్‌కుమార్ అంజాన్ కీలకప్రాత పోషించారని గుర్తు చేశారు. కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్ కమిషన్ సభ్యులుగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేసి సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేశారని కొనియాడారు. రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు మాట్లాడుతూ రైతులకు పెన్షన్ ఇవ్వాలని మొదట ఆలోచన చేసింది అంజాన్ అని గుర్తు చేశారు. మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గా భవాని భవానీ మాట్లాడుతూ అతుల్ కుమార్ అడుగుజాడల్లో నడవటమే మనం ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు. సామాజిక విశ్లేషకులు టి.లక్ష్మీనారాయణ, సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్‌లు అతుల్ కుమార్‌తో వారికి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ముందుగా అతుల్ కుమార్ అంజాన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు పి.చంద్రనాయక్, కోశాధికారి ఆర్.పిచ్చయ్య కమ్యూనిస్టు యోధుల త్యాగాలు, రైతుల సమస్యలను వివరిస్తూ అభ్యుదయ గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, సీపీఐ సీనియర్ నాయకులు వై.చెంచయ్య, చంద్రరావు, విశాలాంధ్ర విజ్ఞాన సమితి డిప్యూటీ జనరల్ మేనేజర్ టి.మనోహర నాయుడు, ప్రొఫెసర్ నరసింహారావు, ఇన్సాఫ్ రాష్ట్ర కార్యదర్శి అఫ్సర్ తదితరులు పాల్గొన్నారు.

మతాల మధ్య మోదీ చిచ్చు

(మొదటిపేజీ తరువాయి)

రష్యా రూ.75 కోట్లు ఖర్చు చేస్తే ఇండియా రూ.4,600 కోట్లు ఖర్చు చేసిందన్నారు. ఈ సదస్సు ఎప్పుడూ ఒక్కచోటే జరగదని దానికి ఇంత ఖర్చు ఎందుకు చేశారో అర్థం కావటం లేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలన్నారు. విజయవాడ పశ్చిమ అసెంబ్లీ సీపీఐ అభ్యర్థి జి.కోటేశ్వరరావు అంకిత భావంతో ప్రజలకోసం పని చేసే వ్యక్తి అన్నారు. ఈ నియోజకవర్గంలో పార్టీలు మారి వచ్చిన వారికి అవకాశం ఇవ్వకూడదన్నారు. ప్రజల కోసం పని చేసే వారికి అవకాశం ఇవ్వాలన్నారు. విజయవాడ మాజీ మేయర్ మల్లికాబేగం మాట్లాడుతూ తాను ఏ పార్టీలో లేనని, ఇండియా కూటమికి మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకుని ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నాని చెప్పారు. తాము ఎన్‌ఆర్‌సీకి వ్యతిరేకంగా పంజా సెంటర్‌లో ధర్నా చేస్తున్నప్పుడు కమ్యూనిస్టులు వచ్చి మద్దతు ఇచ్చారని గుర్తు చేశారు. తాను మేయర్‌గా ఉన్నప్పుడు మదీనా వెళ్లిన సందర్భంలో అక్కడ పాకిస్థాన్ మహిళ తనతో మాట్లాడుతూ ఇండియాలో హిందువులు, ముస్లింలు ఐక్యమత్యంగానే ఉంటారా? అనే సందేహం వ్యక్తం చేసిందన్నారు. మన దేశంలో కుల, మతాలకు అతీతంగా కలసి మెలసి జీవిస్తామని గొప్పగా చెప్పటం జరిగిందని నాటి సంఘటనను గుర్తు చేసుకున్నారు. పశ్చిమ నియోజకవర్గంపై పూర్తి అవగాహన ఉన్న జి.కోటేశ్వరరావుకు ప్రజలు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గ సీపీఐ అభ్యర్థి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ మల్లికా బేగం మేయర్‌గా ఉన్నప్పుడు తాను కార్పోరేటర్‌గా ఈ ప్రాంత ప్రజలకు సేవలందించానని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా ఆమె సహకారం అందించే వారని చెప్పారు. తన విజయాన్ని కాంక్షిస్తూ రోడ్ షోలో పాల్గొన్న సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా, మాజీ మేయర్ మల్లికాబేగంకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు తనకు అవకాశం ఇస్తే నియోజకవర్గంలోని 22 డివిజన్‌లను సమగ్రంగా అభివృద్ధి చేస్తానని చెప్పారు. విజయవాడ పార్లమెంట్ నియోజవర్గానికి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న వల్లూరు భార్గవ్‌ను 'హస్తం' గుర్తుపై, విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి సీపీఐ తరుపున పోటీ చేస్తున్న తనకు 'కంకి-కొడవలి' గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు పి.చంద్రనాయక్, కోశాధికారి ఆర్.పిచ్చయ్య, ఇన్సాఫ్ రాష్ట్ర కార్యదర్శి అఫ్సర్, పశ్చిమ నియోజకవర్గ సమన్వయ కర్త దోనేపూడి శంకర్, సీపీఐ కృష్ణా జిల్లా కార్యదర్శి టి.తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను సాగనంపుదాం

(మొదటిపేజీ తరువాయి)

రాజధానుల పేరుతో జనాన్ని మోసం చేసి మళ్లీ అధికారంలోకి వస్తే విశాఖపట్నం నుంచి పాలన కొనసాగిస్తానని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. 2019 ఎన్నికల ముందు వివేకానందరెడ్డి హత్య , కోడికత్తి వంటి నాటకాలు ఆడి ప్రజలను మోసం చేసి సానుభూతితో ఓట్లు పొందారని, మరోసారి గులకరాళ్లతో కొట్టించుకొని ఓట్లు పొందాలని చూస్తున్నాడని దుయ్యబట్టారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెబుతారని తెలిపారు. టీడీపీ అధికారంలోకి రాగానే వృద్ధులకు ఇంటివద్దనే రూ.4వేలు పింఛన్ ఇస్తామని, వలంటరీ వ్యవస్థను కొనసాగిస్తామని, మహిళలకు మూడు సిలిండర్లు ఉచితంగా అందజేస్తామన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల ఆర్థికాభివృద్ధితో పాటు రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం టీడీపీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

నెల్లూరులో బాబు, పవన్ రోడ్‌షో

చంద్రబాబు, పవన్ కల్యాణ్ నెల్లూరులో రోడ్‌షో నిర్వహించారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని కేవీఆర్ పెట్రోల్ బంకు నుంచి ప్రారంభమైన రోడ్ షో ఆర్టీసీ బస్ స్టేషన్, మద్రాస్ బస్టాండ్, వీఆర్సీ సెంటర్, గాంధీ బొమ్మ, ఏసీ సెంటర్ మీదుగా నర్తకి సెంటర్‌కు చేరుకుంది. వీరితో పాటు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సిటీ, రూరల్ అసెంబ్లీ అభ్యర్థులు పొంగూరు నారాయణ, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కూడా ప్రచార రథంపై ఎక్కి ప్రజలకు అభివాదం చేశారు.

వైఎస్ వివేకా హత్య కేసులో

అవినాశ్‌రెడ్డికి ఊరట

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మాజీమంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డికి ఊరట లభించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు దస్తగిరి వేసిన పిటిషన్‌ను శుక్రవారం ఉదయం తెలంగాణ హైకోర్టు కొట్టేసింది. వివేకానంద రెడ్డి హత్య కేసులో సాక్షులను అవినాశ్‌రెడ్డి ప్రభావితం చేస్తున్నారని, కాబట్టి ఆయనకు ఇచ్చిన ముందస్తు బెయిల్ రద్దు చేయాలంటూ దస్తగిరి పిటిషన్ వేశాడు. అయితే దస్తగిరి వాదనను అవినాశ్ తరపు న్యాయవాదులు తోసిపుచ్చారు. రాజకీయ దురుద్దేశంతోనే దస్తగిరి పిటిషన్ వేశాడని, ఆయన ఆరోపణల్లో వాస్తవం లేదని వాదించారు. నిరాధార ఆరోపణలతో పిటిషన్ వేశారు. సీబీఐ బెయిల్ రద్దు ఎప్పుడూ కోరలేదు. అవినాశ్ రెడ్డి హైకోర్టు షరతులు ఉల్లంఘించలేదు. ఆయన సాక్షులను బెదిరించినట్లు ఆధారాల్లేవు. ఇప్పటికే ఈ కేసులో సీబీఐ ఛార్జ్‌షీట్ వేసిందని అవినాశ్ తరపు న్యాయవాది నాగార్జునరెడ్డి వాదనలు వినిపించారు. ఈ వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం దస్తగిరి పిటిషన్‌ను కొట్టేసింది. మరోవైపు ఇదే కేసులో అరెస్టు అయిన అవినాశ్‌రెడ్డి తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డికి ఊరట లభించింది. ఆయనకు బెయిల్ మంజూరు చేస్తూ తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే కేసులో నిందితులుగా ఉన్న ఉదయ్‌కుమార్ రెడ్డి, సునీల్ యాదవ్‌లకు మాత్రం బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది.

కడప కోర్టు తీర్పుపై ఏపీ హైకోర్టు ఆదేశాలు

వివేకానందరెడ్డి హత్యపై మాట్లాడకూడదంటూ కడప కోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై ఏపీ హైకోర్టులో విచారణ జరిగింది. వివేకా హత్య కేసులో వైసీపీ అధ్యక్షుడిపైనా, ఆ పార్టీ నేతలపైనా ఎన్నికల ప్రచారంలో ఎలాంటి వ్యాఖ్యలు చేయవద్దని, కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల గురించి మాట్లాడొద్దంటూ కడప జిల్లా కోర్టు ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. జిల్లా కోర్టు ఇచ్చిన ఉత్తర్వులు రద్దు చేయాలని కోరుతూ వివేకా కుమార్తె నర్రెడ్డి సునీత, ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, పులివెందుల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవి హైకోర్టులో వేర్వేరుగా వ్యాజ్యాలు దాఖలు చేశారు. పిటిషనర్ల తరపున మురళీధర్‌రావు, గూడపాటి వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు. కడప జిల్లా కోర్టు ఇచ్చిన ఆదేశాలపై జిల్లా కోర్టులోనూ సునీత తదితరులు అప్పీల్ పిటిషన్లు దాఖలు చేశారు. సాధ్యమైనంత త్వరగా ఆ వ్యాజ్యాలపై విచారణ జరిపి, ఈనెల 8వ తేదీలోపు తగు నిర్ణయం తీసుకోవాలని జిల్లా కోర్టుకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

ఈ సందర్భంగా హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. కోర్టు ముందు పెండింగ్‌లో ఉన్న కేసు గురించి ఎలా మాట్లాడుతారని షర్మిల, బీటెక్ రవి, సునీతలను ప్రశ్నించింది. అలా మాట్లాడటం ఎంతవరకు సమంజసమని నిలదీసింది. కేసు విచారణలో ఉండగానే ఒక వ్యక్తిని హంతకుడు అని ఎలా చెబుతారని ప్రశ్నించింది. ఇలా చెప్పటం నేరపూరితమైన చర్య కిందకు వస్తుందని పేర్కొంది.

రాహుల్ ముందే చెప్పాల్సింది

(మొదటిపేజీ తరువాయి)

చేయవచ్చు. అది అభ్యర్థుల హక్కు అయితే రెండు నియోజకవర్గాల్లో గెలిస్తే ఏదో ఒక నియోజకవర్గానికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. ఏ నియోజకవర్గానికి రాజీనామా చేసినా ఆ నియోజకవర్గం లో తనను గెలిపించిన ఓటర్లకు తీరని అన్యాయం చేసినట్లే. రాహుల్ రెండు నియోజకవర్గాల్లో పోటీ చేయడం అప్పటికప్పుడు తీసుకున్న నిర్ణయం కాదు. ఆ పార్టీలో ఎప్పుడో ఇలాంటి చర్చలు మొదలై ఉండవచ్చు. అందుకే, ఎలాంటి నిర్ణయం తీసుకోకపోయినా.... ఆ విషయంపై చర్చ జరుగుతోందని చెప్పాల్సిన నైతిక బాధ్యత రాహుల్ గాంధీపై ఉంది' అని ఆమె స్పష్టం చేశారు. వయనాడ్‌తో తనకు ఉద్విగ్నభరిత అనుబంధం ఉందని రాహుల్

గాంధీ ఎప్పుడూ చెబుతుంటారని... తాను నియోజకవర్గానికి ఏమీ చేయకపోయినా తన అనుబంధం గురించి మరోసారి చెప్పి రెండోసారి వయనాడ్‌లో పోటీచేశారన్నారు. ఇది సందర్భాన్ని బట్టి మారుతున్న సెంటిమెంట్ కాదా? అని ఆమె కాంగ్రెస్‌ను ప్రశ్నించారు. 2019లో రాహుల్ గాంధీ తాను ప్రాతినిధ్యం వహించే అమేథీలో బీజేపీ అభ్యర్థి స్మృతి ఇరానీ చేతిలో ఓడిపోగా... కేరళలోని వయనాడ్ ప్రజలు మాత్రం రాహుల్‌ను అఖండ మెజార్టీతో గెలిపించారు. ప్రస్తుతం 2019లో సోనియా గాంధీ చేతిలో ఓడిపోయిన బీజేపీ అభ్యర్థి దినేష్ ప్రతాప్ సింగ్‌పై రాహుల్ గాంధీ రాయ్‌బరేలీలో పోటీ చేయనున్నారు. విజయావకాశాల పరంగా చూస్తే... రాయ్‌బరేలీ రాహుల్ గాంధీని మళ్లీ ఉత్తరప్రదేశ్ ఎంపీని చేసే అవకాశాలున్నాయి. ఇక రెండవసారి కేరళలోని వయనాడ్‌లో కూడా గెలిస్తే రెండింటిలో ఒకదానికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. ఆ పరిస్థితే వస్తే రాహుల్ తన కుటుంబ కంచుకోట అయిన రాయ్‌బరేలీని తనతో ఉంచుకోవాలని కోరుకునే అవకాశాలు ఉన్నాయి. ఈ నిర్ణయం పార్టీ తర్వాత తీసుకుంటుందని కాంగ్రెస్ నేత మాణికం ఠాగూర్ తెలిపారు. 'ముందు ఎన్నికలు ముగియనివ్వండి, ఆ తర్వాత పార్టీ నిర్ణయిస్తుంది. రాహుల్ గాంధీ రెండు స్థానాలను గెలుస్తారు. వయనాడ్‌లో ప్రజలు ఆయనపై అపారమైన ప్రేమ, ఆప్యాయతతో ఉన్నారని మనందరికీ తెలుసు. రాయ్‌బరేలీలో కూడా ఆయన కుటుంబం ప్రాతినిధ్యం వహిస్తోందని మనందరికీ తెలుసు. ఇందిరాగాంధీ, సోనియా గాంధీ, ఇప్పుడు రాహుల్‌గాంధీ రెండు స్థానాల్లో భారీ మెజార్టీతో గెలుస్తాం' అని ఠాగూర్ అన్నారు. అయితే రాహుల్ గాంధీ వయనాడ్‌లో ఓడిపోతారని, అందుకే ఆయన రాయ్‌బరేలీ నుంచి పోటీ చేస్తున్నారని బీజేపీ అభ్యర్థి మజీందర్ సింగ్ సిర్సా అన్నారు. 'వయనాడ్ ప్రజలారా మీరు మోసపోయారని భావిస్తున్నారా? చింతించకండి, గాంధీ కుటుంబం ఏడు దశాబ్దాలుగా భారతదేశాన్ని మోసం చేస్తోంది' బీజేపీ ఐటీ విభాగాధిపతి అమిత్ మాల్వియా 'ఎక్స్'లో ఆరోపించారు.

మోసగాళ్లకు ఓటుతో బుద్ధి చెప్పండి

(మొదటిపేజీ తరువాయి)

మీ బిడ్డ జగన్ నిలిచాడని ఆశీర్వదించండి అంటూ జగన్ ప్రజలను కోరారు. పద్నాలుగేళ్ల చంద్రబాబు పాలనలో ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని, తన పాలనలో 98శాతం హామీలు అమలయ్యాయని తెలిపారు. చంద్రబాబు మోసాలకు ప్రలోభాలకు లొంగవద్దని సూచించారు. ఎవరి వల్ల మంచి జరుగుతుందో ఇంటిల్లపాది కూర్చోని ఆలోచించి... మీరు నమ్మిన వారికే ఓటే య్యండని చెప్పారు. సూపర్ సిక్స్ , లు సెవెన్ అంటూ అమలు కాని హామీలు ఇస్తున్నారన్నారు. నర్సాపురం పార్లమెంటు వైసీపీ అభ్యర్థి గూడూరి ఉమా బాల, అసెంబ్లీ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజులకు అఖండ విజయం చేకూర్చాలని సభాముఖంగా కోరారు. ఈ సభలో పాలకొల్లు అసెంబ్లీ అభ్యర్థి గుడాల ఈశ్వర రావు, ఎమ్మెల్సీ వంకా రవీంద్ర, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రె వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు. పెదకూర పాడు సభలో సీఎం జగన్ మాట్లాడుతూ... '2,31,000 ప్రభుత్వ ఉద్యోగాలు 59 నెలల కాలంలోనే ఇచ్చాం. అక్కచెల్లెమ్మలకు 31 లక్షల ఇళ్ల పట్టాలు, 21 లక్షల ఇళ్ల నిర్మాణం ఈ 59 నెలల్లోనే జరుగుతోంది. మేనిఫెస్టోకు విశ్వసనీయత తెచ్చి 99% అమలు జరిగింది ఈ పాలనలోనే. ప్రభుత్వ బడులు మారాయి, పిల్లల చదువులు మారాయి. లంచాలు లేని వివక్షలేని ఇంటివద్దకే పాలన, పెన్షన్, పౌరసేవలు, పథకాలు గతంలో ఎప్పుడూ లేవు' అని సీఎం జగన్ వివరించారు. జరగబోయే ఎన్నికల్లో వేసే ఓటు మీ ఇంటింటి భవిష్యత్తును, పథకాల కొనసాగింపును నిర్ణయిస్తుందని చెప్పారు. గత ఐదేళ్లలో ప్రతి ఒక్క రంగంలోనూ విప్లవాత్మక మార్పులు తేగలిగామని పేర్కొన్నారు. పెదకూరపాడు ఎమ్మెల్యే అభ్యర్థి నంబూరు శంకరరావును భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. సీఎం జగన్ సభల్లో పెద్ద ఎత్తున ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజా సేవకుడు అంజాన్

నివాళులర్పించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం : అంకితభావంతో కూడిన ప్రజా సేవకుడు అతుల్ కుమార్ అంజాన్ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శి, ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి అతుల్ కుమార్ అంజాన్ శుక్రవారం లక్నోలో మరణించారు. అనంతపురం పార్టీ కార్యాలయంలో శుక్రవారం అంజాన్ చిత్రపటానికి రామకృష్ణతో పాటు సీపీఐ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమం సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సి.మల్లికార్జున అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణ పాల్గొని మాట్లాడుతూ గత 12 ఏళ్లలో 2.14 లక్షల మంది రైతుల ఆత్మహత్యలకు ఎన్‌డీఏ, యూపీఏ ప్రభుత్వాలే కారణమని కుండబద్దలు కొట్టి చెప్పిన సీపీఐ సీనియర్ నాయకులు అతుల్‌కుమార్ అంజాన్ కంఠం మూగబోయిందన్నారు. అతుల్ కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారని తెలిపారు. సీపీఐ మంచి నాయకుడిని కోల్పోయిందన్నారు. వ్యవసాయ కార్మికుల పొట్టకొట్టి కార్పొరేట్ల కడుపు నింపడంలో యూపీఏ, ఎన్‌డీఏ ఒకటేనని అతుల్ కుమార్ అనేక ఉద్యమాల్లో చెప్పారన్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శిగా, అలాగే సుదీర్ఘకాలం అఖిల భారత కిసాన్ సభకు ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తూ రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారం కోసం పోరాడిన యోధుడు అని అన్నారు. రైతుల తల రాతలు మారాలంటే గిట్టుబాటు ధరలకు చట్టబద్ధత కల్పించాలని డాక్టర్ స్వామినాథన్ కమిషన్‌లో సభ్యునిగా ప్రభుత్వానికి సిఫార్సులు చేశారని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ తీసుకువచ్చిన మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా, రైతులకు పది వేల రూపాయల పెన్షన్ కోసం చివరిదాకా పోరాడరన్నారు. అటు పార్లమెంటులో, ఇటు క్షేత్రస్థాయిలో నిరంతరం గళం విప్పిన సీపీఐ అగ్ర నాయకుడని అన్నారు. అంజాన్ ఆశయాల సాధన కోసం పోరాడటమే ఆయనకు మనం ఇచ్చే ఘన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.నారాయణస్వామి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పి.రామకృష్ణ, జిల్లా కార్యదర్శి టి.నారాయణస్వామి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరాములు, లింగమయ్య, రమణయ్య, అలిపిర, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కుల్లాయి స్వామి, రమణయ్య, వంశీ, హనుమంతు, హరి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రాజేష్, వి.కృష్ణుడు, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు అంజాన్ : ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్

విశాలాంధ్ర-తిరుపతి : అఖిల భారత విద్యార్థి సమాఖ్య మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి అతుల్ కుమార్ అంజాన్ పోరాట యోధులని ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ అన్నారు. శుక్రవారం తిరుపతి నగరం బైరాగపట్టెడలోని సీపీఐ కార్యాలయంలో అంజాన్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. అంజాన్ విద్యార్థి ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించారన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించాలని దినేష్ పిలుపునిచ్చారు. అనంతరం ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రనాథ్ మాట్లాడుతూ అతుల్ కుమార్ అంజాన్ లక్నో విశ్వవిద్యాలయంలో విద్యార్థి నాయకుడుగా ఎదిగి... తరువాత కాలంలో సీపీఐ జాతీయ కార్యదర్శిగా పని చేశారని తెలిపారు. అతుల్ కుమార్ ఉత్తర ప్రదేశ్‌లో కీలక నేత అని, మారుమూల ప్రాంతాల్లో సైతం కమ్యూనిస్టు పార్టీ విస్తరణలో క్రియాశీలకంగా పని చేశారన్నారు. యువతపై ప్రత్యేక దృష్టి సారించి పార్టీని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. పేద ప్రజల కోసం తన జీవితం త్యాగం చేసిన అంజాన్ మృతి కమ్యూనిస్టు పార్టీ ఉద్యమానికి తీరని లోటన్నారు. ఆయన ఆశయ సాధన కోసం అందరం పని చేయాలని రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు, రాష్ట్ర సమితి సభ్యులు టి.జనార్దన్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, నగర కార్యదర్శి విశ్వనాథ్, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, నదియా, బాలకృష్ణ, చలపతి, రవి, ప్రజా సంఘాల నాయకులు రవి, రాజా, శివ, శ్రీరాములు, గుర్రప్ప, కాలయ్య, మంజుల, పద్మనాథ రెడ్డి, మణి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్‌పై ఈసీకి వైసీపీ ఫిర్యాదు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ప్రవర్తిస్తున్న ఎన్డీఏ కూటమికి చెందిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌పై ఎన్నికల సంఘానికి వైసీపీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, పార్టీ గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణమూర్తి, లీగల్ సెల్ నేత శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు చేశారు. వెలగపూడి సచివాలయంలో శుక్రవారం రాష్ట్ర ఎన్నికల కార్యాలయ అధికారులకు ఈ ఫిర్యాదును అందజేశారు. ఈనెల 2 వతేదీన రాయచోటి ఎన్నికల ప్రచార సభలో సీఎం జగన్‌పై చంద్రబాబు వ్యక్తిగత అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఇది ఎన్నికల నియమావళికి విరుద్ధమని తెలిపారు. పవన్ కల్యాణ్ ఈనెల రెండో తేదీన విశాఖ సౌత్, పాలకొండ ఎన్నికల ప్రచార సభలలో జగన్‌పై దురుసుగా వ్యవహరించారని తగిన ఆధారాలతో ఫిర్యాదు చేశారు. అనంతరం పార్టీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఉన్న నాలుగు అంశాలపై ఈసీకి ఫిర్యాదు చేశామన్నారు. డ్రామాలు ,నాటకాలతో ప్రజలను చంద్రబాబు తప్పుదారి పెట్టిస్తున్నారని చెప్పారు. మైనార్టీలపై మాట్లాడే అర్హత చంద్రబాబుకు లేదని, రూ.25 వేల కోట్లు మైనార్టీల సంక్షేమానికి కేటాయించిన వ్యక్తి సీఎం జగన్ అని స్పష్టంచేశారు. నవరత్నాలను కాపీ కొట్టి పేర్లు మార్చి చంద్రబాబు ప్రచారం చేసుకొంటున్నారని ఎద్దేవా చేశారు. సరైన విధానం లేని చంద్రబాబు ఓట్ల కోసం కుట్ర రాజకీయాలు చేస్తున్నాడని మండిపడ్డారు. నారాయణమూర్తి మాట్లాడుతూ ప్రచార సభల్లో పవన్ ఊగిపోతున్నాడని, పవన్ తీరు చూస్తే డ్రగ్స్ తీసుకొని మాట్లాడుతున్నట్టుగా ఉందని, ఆయన మానసిక పరిస్థితి బాగోలేదని చెప్పారు.

ఫారమ్-12 లేకుండానే ఓటుహక్కు కల్పించాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వీఆర్వో నేతల వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఫారమ్-12తో సంబంధం లేకుండా ఫెసిలిటేషన్ సెంటర్లో నేరుగా వెళ్లి ఓటు వేసే వెసులుబాటు కల్పించేలా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్వో) సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూపతిరాజు రవీంద్రరాజు, ఎం.అప్పలనాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ఫారమ్-12 దరఖాస్తు చేసినప్పటికీ, చాలామందికి ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఫారమ్-12 దరఖాస్తు చేయకపోయినా ఫెసిలిటేషన్ సెంటర్లో ఓటు హక్కు వినియోగించుకునేలా ఆ నియోజకవర్గంలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ ఓటు హక్కు అవకాశం కల్పించాలన్నారు. ఇదే అంశంపై వారం రోజుల క్రితం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి మెయిల్ ద్వారా తెలియజేశామని గుర్తుచేశారు. ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోపోవడం వల్ల చాలామంది ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకోలేకపోతున్నారని వివరించారు. ఫారమ్ -12 మే ఒకటో తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆదేశాలు ఇచ్చారని, చాలామంది అంగన్వాడి టీచర్లకు, కాంట్రాక్ట్ ఉద్యోగులకు మళ్లీ ఎన్నికల విధులు వేశారని చెప్పారు. వారందరూ ఫారమ్-12 దరఖాస్తు చేసుకోనందున ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని కోల్పోతున్నారని వివరించారు. ఈ విషయంపై చర్యలు తీసుకుని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగాల భర్తీలో పాలకులు విఫలం

లెనిన్‌బాబు విమర్శ

విశాలాంధ్ర-డోన్: ఎన్నికల ముందు ఉద్యోగాలిస్తామని నమ్మ బలికి మోసం చేసిన ప్రధాని మోదీ, సీఎం జగన్‌లకు ఓటుతో బుద్ధి చెప్పాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఏఐవైఎఫ్ 65వ వార్షికోత్సవం సందర్భంగా సీపీఐ కార్యాలయం వద్ద ఏఐవైఎఫ్ జెండాను శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం లెనిన్ బాబు మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని మోదీ, ఏటా జాబ్

క్యాలెండరు విడుదల చేస్తామని జగన్ హామీలిచ్చారని, అధికారం చేపట్టిన తర్వాత నిరుద్యోగులను నిలువునా మోసం చేశారని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీపై పాలకులు దృష్టి సారించడం లేదన్నారు. యువతను మోసగించడమే పునాదిగా పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. నిరుద్యోగులు లేని రాష్ట్రంగా ఏపీని మారుస్తామని జగన్ ప్రగల్భాలు పలికారని, కానీ ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా విడుదల చేయలేదన్నారు. పోలీసుశాఖలో ఖాళీలు భర్తీ చేయలేదన్నారు. ఉద్యోగాల కోసం రోడ్డెక్కిన యువతను అక్రమ కేసులతో బెదిరిస్తున్నారని ఆరోపించారు. దేశంలో మహిళల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నయవంచక బీజేపీ, వైసీపీలను ఓడించాల్సిన అవసరం ఉందని లెనిన్‌బాబు పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్, సీపీఐ నేతలు రణత్ యాదవ్, సూర్యప్రతాప్, పులి శేఖర్, లక్ష్మీ నారాయణ, విజయ్, రంగస్వామి, మౌలాలి, దివాకర్, హుస్సేన్ పీరా, వరదరాజులు, మనోజ్, అఖిల్, ఆంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ కమ్యూనిస్టు శేషగిరిరావు

కాంస్య విగ్రహావిష్కరణలో అక్కినేని వనజ

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు: క్రమ శిక్షణ, అంకితభావం గల నాయకుడు వలంకొండ శేషగిరిరావు అని సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యురాలు అక్కినేని వనజ నివాళి అర్పించారు. శేషగిరిరావు మొదటి వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు ఎన్‌టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలం అనిగండ్ల పాడు గ్రామంలో ఏర్పాటు చేసిన ఆయన కాంస్య విగ్రహాన్ని అక్కినేని వనజ శుక్రవారం ఆవిష్కరించారు. విగ్రహానికి పూలమాల వేసి...నివాళి అర్పించారు. అనంతరం అక్కినేని వనజ మాట్లాడుతూ జీవితాంతం ఉత్తమ కమ్యూనిస్టుగా శేషగిరిరావు కొనసాగారన్నారు. పెనుగంచిప్రోలు ఏరియాలో కమ్యూనిస్టు ఉద్యమం బలంగా ఉండేదని, నాటి నుంచి శేషగిరిరావు కుటుంబంతో తమకు మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. శేషగిరిరావు విగ్రహం ఏర్పాటు చేసిన కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు. అమరుల స్ఫూర్తితో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సీపీఐ ఎన్‌టీఆర్ జిల్లా కార్యదర్శి దోనెపూడి శంకర్ మాట్లాడుతూ శేషగిరిరావు హాలును ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. శేషగిరిరావు మరణం కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటన్నారు. సీపీఐ జగ్గయ్యపేట ఏరియా కార్యదర్శి అంబోజి శివాజీ, టీడీపీ నేత తిరుపతమ్మ, అమ్మ వారి ఆలయ మాజీ చైర్మన్ అత్తులూరి అచ్యుతరావు, శేషగిరిరావు మేనల్లుడు వెంకటేశ్వరరావు మాట్లాడారు. సీపీఐ నేతలు చుండూరి సుభారావు, పొన్నం నరసింహారావు, పాటిబండ్ల లక్ష్మయ్య, ఇతర పార్టీల నేతలు పాల్గొన్నారు.

బెజవాడను అభివృద్ధి చేశా... మళ్లీ గెలుస్తా

'మీట్ ది ప్రెస్'లో కేశినేని నాని

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): ఎంతోమంది మచ్చలేని వ్యక్తులు ఎన్నికైన విజయవాడ పార్లమెంట్ స్థానం నుంచి దురదృష్టవశాత్తు క్రిమినల్ చరిత్ర ఉన్న టీడీపీ అభ్యర్థి కేశినేని చిన్ని వంటి వ్యక్తి విజయం సాధిస్తే 'విజయవాడ ఫర్ సేల్' అని బోర్డు పెడతారని... అటువంటి వ్యక్తి తన తమ్ముడు కావటం దురదృష్టకరమని వైసీపీ విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని నాని పేర్కొన్నారు. శుక్రవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో కేశినేని నానితో 'మీట్ ది ప్రెస్' జరిగింది. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కంచల జయరాజ్ అధ్యక్షత వహించారు. నాని మాట్లాడుతూ... బెజవాడ అంటే తనకు ఎనలేని మక్కువ అన్నారు. మరోసారి తాను విజయవాడ పార్లమెంటు నియోజకవర్గ ప్రజలు తనను ఆశీర్వదిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. తాను ఎంపీ అయిన తర్వాత విజయవాడ ఎలా అభివృద్ధి చెందిందో విజయవాడకు రెండు ఫ్లై ఓవర్లను తీసుకొచ్చినట్లు గుర్తు చేశారు. దుర్గగుడి దగ్గర ఫ్లైఓవర్ నిర్మాణం సాధ్యం కాదని కొంతమంది మాట్లాడారని, దాన్ని నిర్మాణం చేసి నిరూపించామన్నారు. విజయవాడ- మచిలీపట్నం బైపాస్ రోడ్డును అభివృద్ధి చేశానన్నారు. తాను గన్నవరం ఎయిర్‌పోర్టుని అభివృద్ధి చేసి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుగా తీర్చిదిద్దానని చెప్పారు. గన్నవరం ఎయిర్‌పోర్టు అభివృద్ధి తన హయాంలోనే జరిగిందని, అయితే కరోనా వల్ల పనులు జాప్యం జరిగాయన్నారు. మరి కొద్ది రోజుల్లోనే ఆ పనులన్నీ పూర్తవుతాయని చెప్పారు. అంతేకాకుండా విజయవాడ -నాగపూర్ హైవే నిర్మాణం ఒక సంవత్సరంలో పూర్తవుతుందని కూడా ఆయన పేర్కొన్నారు. టాటా ట్రస్ట్ ద్వారా అనేక మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. అనేక గ్రామాల్లో వాటర్ ట్యాంకుల ద్వారా తాగునీరు అందించామని నాని గుర్తు చేశారు. ఎన్టీఆర్ జిల్లా ఏ కొండూరు ప్రజలు కిడ్నీ వ్యాధులతో బాధపడుతుంటే పార్లమెంట్లో ఆరోగ్య శాఖ మంత్రితో మాట్లాడి సమస్యలను పరిష్కరించినట్లు వివరించారు. నిత్యం ప్రజల్లో ఉండటం తనకు సంతోషాన్నిచ్చిందన్నారు. 2019లో సీఎం జగన్ వలంటీర్ల వ్యవస్థ తెచ్చినప్పుడు చంద్రబాబు అనేక ఆరోపణలు చేశారని, ఇప్పుడు అదే బెస్ట్ అని అందరూ అంటు టున్నారు. జగన్‌మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలే ఆయనను గెలిపిస్తాయని కేశినేని నాని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్, విజయవాడ ప్రెస్ క్లబ్ కార్యదర్శి దాసరి నాగరాజు,ఏపీయూడబ్ల్యూజే అర్బన్ యూనిట్ అధ్యక్షులు చావా రవి, సామ్నా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి,ఐజేయు నాయకులు ఎస్కే బాబు పాల్గొన్నారు.

బాలకృష్ణకు ఏమి తెలుసు: మంత్రి బొత్స

విశాలాంధ్ర-విజయనగరం: టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణ వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలనీ, ఎవరో రాసిచ్చిన స్క్రిప్టులు చదవడం మంచిది కాదని మంత్రి బొత్స సత్యనారాయణ హితవు పలికారు. తెలుసుకోకుండా పగలో మాటా... రాత్రో మాట మాట్లాడుతూ...తండ్రి పేరు చెప్పు కుంటే బతికే బాలకృష్ణ మాటలు అర్ధరహితమని వ్యాఖ్యానించారు. విజయనగరంలో మంత్రి బొత్స శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ బాలకృష్ణకు రాష్ట్రంలోని వాస్తవ పరిస్థితులు తెలుసా అని ప్రశ్నించారు. విద్య, విద్యాశాఖ గురించి తెలియకపోతే తెలుసుకోవాలని, అనుమానం ఉంటే తాము వివరించి చెబుతామన్నారు. జగన్ పాలనలో విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చామని మంత్రి బొత్స చెప్పారు. రంగులు వేశామంటూ విమర్శిస్తున్నారని, ఆ పని కూడా టీడీపీ ప్రభుత్వం చేయలేకపోయిందని విమర్శించారు. ఒకటవ తరగతి నుంచి ఇంగ్లీషు మీడియం, టోఫెల్ శిక్షణతో ఆంగ్ల భాషాప్రావీణ్యం కోసం శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రైవేటు పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దామన్నారు. దేశంలో మరో 20 ఏళ్లలో అన్ని రంగాల్లో 55 శాతం ఏపీ విద్యార్థులే ఉంటారని చెప్పారు. అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన జగన్మోహన్ రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి కాకపోతే పేద, మధ్యతరగతి వర్గాలకే నష్టమన్నారు. చంద్రబాబునాయుడివి దిక్కుమాలిన ఆలోచనలన్నారు. ఇతరులను ఆడిపోసుకోవడం తప్ప మరేమీ లేదన్నారు. రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలు రావడం వల్ల భారీగా వైద్య సీట్లు పెరిగాయని చెప్పారు. చంద్రబాబు, ఆయన తాబేదారు నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ కారణంగానే వృద్ధులు పింఛన్ల కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోందని మంత్రి బొత్స ఆరోపించారు. లాండ్ టైటిలింగ్ చట్టంపై అనవసర రాద్ధాంతం చేస్తున్నారని, ప్రజలను పక్కదోవ పట్టించడం సరికాదన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో ఎక్కడా తాగునీటికి ఇబ్బంది రాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్ శాఖల అధికారులను ఆదేశించారు. తాగునీరు, ఉపాధి హామీ పనులపై శుక్రవారం వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. సీఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలో తాగునీటి ఎద్దడి గల ఆవాసాలకు ట్యాంకులు ద్వారా మంచినీటి సరఫరా చేయాలని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా మంచినీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రక్షిత సరఫరా పథకాల నిర్వహణ, తాగునీటి అవసరాలకు ఇటీవల కాలువల ద్వారా నీటిని విడుదల చేయగా ఎన్ని సమ్మర్ స్టోరేజి ట్యాంకులను పూర్తిగా నీటితో నింపారు... అవి ఎన్ని రోజులు సరిపోతాయనే అంశాలపై ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. జూన్ నెలాఖరు వరకూ ఎక్కడా తాగునీటికి ఇబ్బంది రాకుండా ఆవాసాలకు ట్యాంకులు ద్వారా నీటిని అందించాలని ఆదేశించారు. భూగర్భ జల మట్టాల స్థాయి ఏవిధంగా ఉంది ఆశాఖ అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని ఎప్పటికప్పుడు భూగర్భ జల మట్టాలను అంచనా వేయాలని ఆదేశించారు. రాష్ట్ర జలవనరులు, పంచాయతీరాజ్. గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్ మాట్లాడుతూ తాగునీటికి ఇబ్బంది గల 281 ఆవాసాలకు

ప్రస్తుతం ట్యాంకుల ద్వారా మంచి నీటిని సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. మొత్తం 3,075 ఆవాసాలకు జూన్ వరకూ ట్యాంకులు ద్వారా సరఫరాకు చేసేందుకు అనుమతులు ఇవ్వడం జరిగిందని వివరించారు. కరువు ప్రభావిత మండలాల్లో వేసవి కార్యాచరణ ప్రణాళిక అమలుకు 39 కోట్ల రూపాయలకు ఎన్నికల సంఘం ఆమోదించిందని తెలిపారు. ఉపాధి పనుల ప్రగతిని వివరిస్తూ గురువారం రాష్ట్రంలో 28 లక్షల 56 వేల మంది కూలీలు పనులు నిర్వహించారని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కృష్ణారెడ్డి రెడ్డి, పబ్లిక్ హెల్త్ అండ్ మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం ఈఎన్‌సీ ఆనందరావు, ఎస్ఆర్జీఎస్ డైరెక్టర్ చిన తాతయ్య పాల్గొన్నారు.

గంజాయి మాఫియాపై ఉక్కుపాదం

కైకలూరు సభలో పవన్‌కల్యాణ్ హామీ

విశాలాంధ్ర-కైకలూరు: ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్రాన్ని అథోగతి పాల్జేశారని జనసేన అధినేత పవన్ కల్యాణ్ విమర్శించారు. ఏలూరు జిల్లా కైకలూరులో శుక్రవారం నిర్వహించిన విజయభేరి బహిరంగసభలో పవన్ మాట్లాడారు. ఎన్డీఏ కూటమి నుంచి కైకలూరు అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి కామినేని శ్రీనివాస్, ఏలూరు లోక్ సభ టీడీపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ లను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ... వైఎస్సార్సీపీ దుర్మార్గ పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో సమస్యల పరిష్కార బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందన్న ఆయన ప్రజలు ఆలోచించుకుని ఓటు వేయాలని కోరారు. ప్రజల భూములను దోచేసేందుకే 'ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్'తెచ్చారని ధ్వజమెత్తారు. మన ఆస్తిని మనదని రుజువు చేసుకోవాలా? అని ప్రశ్నించిన ఆయన 90 రోజుల్లో రుజువు చేసుకోలేకపోతే దోచుకుంటారా? అని వైసీపీ ప్రభుత్వాన్ని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజల భూములను కాజేసే ఈ దుర్మార్గ చట్టాన్ని రద్దు చేస్తామని చెప్పారు. ముఠా కూలీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్సీపీ పాలనలో 112 మంది జర్నలిస్టులపై దాడులు జరిగాయి. వారిపై 430 కేసులు నమోదు చేశారు. పత్రికలు, ఛానళ్లను కట్టడి చేసేందుకు జీవో నెం.1 తీసుకొచ్చి భయపెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జర్నలిస్టులకు న్యాయం జరిగేలా భద్రత కల్పిస్తామన్నారు. మద్యపాన నిషేధం చేస్తామన్న జగన్ యువతను గంజాయి మత్తుకు బానిస చేస్తున్నారని దుయ్యబట్టారు. స్థానిక సమస్యల్ని ప్రస్తావిస్తూ... ప్రస్తుత ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇసుక, మట్టి కొల్లగొడుతున్నారని, తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఎమ్మెల్యే కొడుకు సైతం రైతులను బెదిరించి దాదాపు 50 ఎకరాలు కబ్జా చేశారన్నారు. ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని... ఏ ఎమ్మెల్యే అయినా ప్రజలను ఇబ్బంది పెడితే వారి అవినీతి కోటలు బద్దలు కొడతాం అన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని అథోగతి పాలు చేశారని... మద్యపానాన్ని నిషేధించాకే ఓట్లు అడుగుతానని చెప్పి ఇప్పుడు రాష్ట్రంలో మద్యం ఏరులై పారిస్తున్నాడన్నారు. యువతను మాదక ద్రవ్యాలకు బానిసల్ని చేశారని... నాడు- నేడు అని గొప్పలు చెప్పుకుంటూ 7,300 ఎయిడెడ్ పాఠశాలు, కళాశాలను మూసేశారన్నారు. కూటమి అధికారంలోకి రాగానే గంజాయి మాఫియాపై ఉక్కుపాదం మోపుతామని, వందరోజుల్లో ఎక్కడా గంజాయి అమ్మకాలు జరగకుండా చూస్తామని పవన్ ప్రకటించారు. కైకలూరుని స్మార్ట్ మున్సిపాలిటీగా మారుస్తామని, కైకలూరు, అవనిగడ్డ, మచిలీపట్నం, పెడన నియోజకవర్గాలను చతుర్ముఖ నగరాలుగా తీర్చిదిద్దుతామని, కలిదిండి మండలంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తామని, రైతుబజార్లు నిర్మిస్తామని, ముదినేపల్లి మండలంలో ధాన్యం నిల్వ చేసుకునే గోదాములు నిర్మిస్తామని, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని, కైకలూరు మండలంలో ఈఎస్ఐ ఆస్పత్రిని తీసుకొస్తామని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 50 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తామని, కైకలూరు- ఏలూరు రూరల్ ప్రాంతాలను కలిపే బ్రిడ్జ్ నిర్మిస్తాంమని, కొల్లేరు సమస్యలు పరిష్కరిస్తామని పవన్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

వృద్ధులకు వసూలు చార్జీలు తిరిగివ్వాలి: సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో వృద్ధుల పింఛన్ బ్యాంకు ఖాతాలో వేసి రకరకాల కారణాలతో చార్జీలు వసూలు చేయడం అమానుషమని, వాటిని తిరిగి ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మంచంపై ఉన్న వారికి ఇంటివద్దే పంపిణీ చేస్తామని చెప్పి బ్యాంకుల్లో జమ చేసి, నానా ఇబ్బందులకు గురి చేయడం అన్యాయమని అన్నారు. బీజేపీ, వైసీపీ, టీడీపీల రాజకీయ చదరంగంలో పింఛన్‌దారులను బలిచేయడం తగదని, తక్షణమే వారి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బ్యాంకు చార్జీలు వసూలు చేయకూడదని, వసూలు చేసిన మొత్తాన్ని లబ్ధిదారులకు తిరిగి ఇవ్వాలని, కదలలేని వారికి ఇంటివద్దే పంపిణీ చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 65.49 లక్షల మంది పింఛన్‌దారులుంటే, వారిలో 48.92 లక్షల మందికి బ్యాంకు ఖాతాలున్నాయని ప్రభుత్వ అధికారులు ప్రకటించారని చెప్పారు. పింఛన్‌దారుల ఖాతాల లావాదేవీలు జరగలేదని, మినిమం బ్యాలెన్స్ లేవని ఇతర కారణాలు చెప్పి రూ.300 నుంచి రూ. 400 వరకు చార్జీలు వసూలు చేయడం అన్యాయమని పేర్కొన్నారు. పింఛన్ల పంపిణీకి పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని ముందు నుంచి రాజకీయ పార్టీలు మొత్తుకున్నా ప్రభుత్వ అలసత్వం ఫలితంగా పండుటాకులు ఎండ వేడి తాళలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. బ్యాంకులవద్ద పడిగాపులు కాస్తున్నారన్నారు. అక్కడకూడ సౌకర్యాలు అరకొరగానే ఉన్నాయని తెలిపారు. మంచంపై ఉండి బ్యాంకులకు వెళ్లలేని వారికి ఇంటింటికి పంపిణీ చేస్తామని చెప్పి, కదలలేని వారికి సైతం బ్యాంక్ ఖాతాల్లో వేశారన్నారు. ఆటోలు మాట్లాడుకుని, ఇతరుల సహాయంతో బ్యాంకుల చుట్టూ పెన్షన్ దారులు తిరుగుతున్నారని అన్నారు. బ్యాంకుల్లో జమ చేసిన పెన్షన్‌కు ఎలాంటి చార్జీలు విధించరాదని తెలిపారు.

సంపాదకీయం

ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో కులతత్వం

గతంలో దళితులకు చదువుకునే హక్కే మృగ్యమైనప్పుడు స్వాతంత్ర్యం తరవాత దళితులకు కూడా ఉన్నత విద్య అభ్యసించే అవకాశం వచ్చింది. కానీ వారిని గౌరవించడం, వారి ఉన్నతిని అంగీకరించడం ప్రస్తుత సమాజానికి సుతరామూ ఇష్టం లేదు. అందుకే తెలంగాణలో దళిత వర్గానికి చెంది, బాగా చదువుకుని మహాత్మా గాంధీ అంతర్రాష్ట్రీయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ స్థాయికి ఎదిగిన దళితుడిని ఈ సమాజం జీర్ణించుకోలేక పోయింది. ఆ దళిత విద్యావేత్త కారుణ్యకార హరిజనోద్ధరణ కోసం ఉద్యమించిన మహాత్మా గాంధీ పేర నెలకొల్పిన విశ్వవిద్యాలయం భరించ లేక పోయింది. కారుణ్యకార వైస్ చాన్సలర్ గా బాధ్యతలు తీసుకోక ముందు రాజేశ్ కుమార్ శుక్లా వైస్ చాన్సలర్ గా ఉండే వారు. ఒక మహిళతో ఆయన సంభాషణ వివాదాస్పదం కావడంతో ఆయన రాజీనామా చేయాల్సి వచ్చింది. మహాత్మా గాంధీ అంతర్రాష్ట్రీయ హిందీ విశ్వవిద్యాలంలో ప్రొ వైస్ చాన్సలర్ ను నియమించే సంప్రాదాయం లేదు. అందుకని ఉన్న వారిలో సీనియర్ అయిన కారుణ్య వైస్ చాన్సలర్ బాధ్యతలు చేపట్టారు. విద్యా రంగంలో కారుణ్యకార సాధించిన విజయాలు అమోఘమైనవి. కానీ ఆయన ముక్కు సూటితనం విశ్వవిద్యాలయ కులీనులకు నచ్చలేదు. కారుణ్యకార గత సంవత్సరం ఆగస్టులోనే వైస్ చాన్సలర్ బాధ్యతలు తీసుకున్నారు. కానీ కులీన వర్గం ఆయనను మూడు నెలలైనా భరించలేక పోయింది. ఆయనను ఆ పదవిలోంచి తొలగించారు. ఆయన హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆయనకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. కానీ ఏలిన వారికి నచ్చలేదు. రాష్ట్రపతి ముర్ము ఈ విశ్వవిద్యాలయానికి "విజిటర్". ఆమె ఆదేశాల మేరకు కేంద్ర విద్యా శాఖ ఆయనను తొలగించింది. రాష్ట్రపతి కేంద్ర మంత్రివర్గ సిఫార్సు లేకుండా ఎవరినీ తొలగించే అవకాశమే లేదు. కారుణ్య ఇది విశ్వవిద్యాలయ చట్టానికి వ్యతిరేకమని మొర పెట్టుకున్నా వినే వారే కనిపించలేదు. విశ్వ విద్యాలయ నిబంధనల ప్రకారం "విజిటర్" స్థానంలో ఉన్న రాష్ట్రపతికి ఎవరినీ నియమించే అధికారం గానీ, తొలగించే అధికారం గానీ లేదు. కారుణ్య స్థానంలో డా. భీమరయ్ మెత్రియన్ తాత్కాలిక వైస్ చాన్సలర్ గా నియమించారు. ఆ తరవాత కృష్ణ కుమ్మర్ ను వైస్ చాన్సలర్ గా నియమించారు. హైకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు కారుణ్యకార గత మార్చి 31న మళ్లీ వైస్ చాన్సలర్ బాధ్యతలు స్వీకరించారు. తనకు జరిగిన అన్యాయానికి, విశ్వవిద్యాలయం అనుసరిస్తున్న అక్రమ పద్ధతులకు వ్యతిరేకంగా న్యాయ పోరాటం చేస్తుండగానే ఆయనకు గత నెలలో షో కాజ్ నోటీస్ జారీ చేశారు. ఆయన గదికి తాళం పెట్టారు. అసలు ఆయనను విశ్వవిద్యాలయంలో అడుగు పెట్టడానికే అవకాశం లేకుండా చేశారు. కారుణ్యకు సహానుభూతి తెలిపే విద్యార్థులు, అధ్యాపకులు తన అధికారాలను వినియోగించుకోవాలనుకునే దళిత విద్యావేత్తను విశ్వవిద్యాలయం యాజమాన్యానికి నచ్చడం లేదంటున్నారు. ఇది ఉన్నత స్థానానికి ఎదిగిన ఓ దళిత విద్యావేత్తను పనిగట్టుకుని వేధించడమే. విశ్వవిద్యాలయాలలోకి హిందుత్వ శక్తులు చొరబడిన తరవాతే ఇలాంటి విపత్కర పరిస్థితి ఎదురవుతోందని వారు అంటున్నారు. విశ్వ విద్యాలయాలోకి చొరబడ్డ హిందుత్వ శక్తులు యాజమాన్యం మీద ఒత్తిడి తీసుకొస్తున్నారు. విశ్వవిద్యాలయాల నిర్వాహకులకు విద్యార్థులు సమీకృతం కావడం, విద్యార్థి సంఘాలు ఏర్పాటు చేయడం బొత్తిగా ఇష్టం లేదు. కారుణ్యకారను వైస్ చాన్సలర్ పదవి నుంచి తొలగించినందుకు నిరసన తెలియజేసిన విద్యార్థుల్లో కొంత మందిని విశ్వవిద్యాలయం నుంచి బహిష్కరించారు. తనను విశ్వవిద్యాలయం నుంచి బహిష్కరించినందుకు ఒక విద్యార్థి బొంబాయి హైకోర్టు నాగపూర్ బెంచిని ఆశ్రయించవలసి వచ్చింది.

విశ్వవిద్యాలయాలలో కులీన వర్గాల పెత్తనం ఒక ఎత్తయితే సామాజిక శాస్త్రాలు బోధించే ఉన్నత విద్యా రంగంలో ప్రైవేటు విశ్వవిద్యాలయాలు కుక్కగొడుగుల్లా పుట్టుకు రావడం మరో ఎత్తు. మహాత్మా గాంధీ అంతర్రాష్ట్రీయ హిందీ విశ్వవిద్యాలయం ప్రైవేటు విశ్వవిద్యాలయమే. అంతకు ముందు ఈ అంశాలు ప్రభుత్వ ఆర్థిక సహాయంతో నడిచే విశ్వవిద్యాలయాల్లో మాత్రమె బోధించే వారు. పదిహేనేళ్ల కింది దాకా కూడా సామాజిక శాస్త్రాల అధ్యయనానికి ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో చేరాలన్న ఆలోచనే ఉండేది కాదు. ఈ ఉన్నత విద్యా సంస్థలలో ఫీజులు దండిగా వసూలు చేస్తారు. వాటి స్థాయినిబట్టి ఒక్కో విశ్వవిద్యాలయం గ్రాడ్యుయేషన్ కోర్సు పూర్తి చేయడానికే 15 నుంచి 50 లక్షల దాకా వసూలు చేస్తుంది. ఒకప్పుడు ఊహించడానికి వీలులేని పరిస్థితి ఇప్పుడు సర్వత్రా కనిపిస్తోంది. అతి కొద్ది కాలంలో ఉన్నత విద్యారంగ స్వరూప స్వభావాలు అమాంతం మారిపోయాయి. డబ్బు సంచులు కుమ్మరించి ఇలాంటి ఉన్నత విద్యాలయాల్లో చదువుకునే వారి అంతిమ లక్ష్యం విదేశాలకెళ్లి మరింత ఉన్నత విద్య అభ్యసించడమే. ఆ తరవాత వారు స్వదేశానికి తిరిగి రావడమే అరుదు. వచ్చినా ప్రభుత్వ ఆర్థిక సహాయంతో నడిచే విశ్వవిద్యాలయాల వేపే చూడరు. మళ్లీ డబ్బు భారీగా సంపాదించే విద్యాసంస్థలలో చేరాలనే ప్రయత్నిస్తారు. ప్రైవేటు విశ్వవిద్యాలయాల మీద ఉండే, అవి నాణ్యంగా ఉంటాయన్న భ్రమ మౌలికంగా విద్యార్థుల జీవన శైలినే మార్చేస్తున్నాయి. ఈ విశ్వవిద్యాలయాల్లో విదేశాలలో డాక్టరేట్ పట్టా పుచ్చుకుని వచ్చిన వారికే పెద్ద పీట. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో నాణ్యత తగ్గుతోందన్న అభిప్రాయం కూడా ప్రైవేటు విశ్వవిద్యాలయాల మీద మోజు పెరగడానికి కారణం. ఈ మోజే వాటిలో విద్యాభ్యాసం చాలా ఖరీదైన వ్యవహారం అయిపోతోంది. ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో చదువు ఎలా ఉన్నా అవి విశాలమైన స్థలంలో ఏర్పాటు చేస్తారు. నాణ్యతతో నిమిత్తం లేకుండా పచ్చని లాన్లు, అందమైన భవనాలు మాత్రం ఉంటాయి. ఆ సంస్థల్లో ఉండే ఖాళీ స్థలాల్లో నలుగురికి ఉపయోగపడే ఫల వృక్షాలు కనిపించవు. సౌందర్యాత్మకత ఉట్టిపడే లాన్లు మాత్రం విస్తృతంగా ఏర్పాటు చేస్తారు. ఈ సొబగులు ఉండకూడదని కాదు. కానీ మౌలికమైన విద్య విషయంలో శ్రద్ధ లేక పోవడం, అవి కుల వివక్షతతో సహా అనేక రకాల వివక్షకు ఆలవాలంగా మారడం ప్రమాదకరం. సొబగుల మీద శ్రద్ధవల్ల విద్యార్జన బహు భారమై పోతోంది. సొగసైన అద్దాలతో అందంగా నిర్మిస్తున్న విశ్వవిద్యాలయాల భవనాలు జ్ఞానార్జనకు నిలయాలుగా లేకపోవడం దుష్పరిణామాలకు దారితీసే విలోమ ప్రక్రియే. కారుణ్యకార లాంటి వారు ప్రతి ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లోనూ తారన పడుతూనే ఉంటారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో రోహిత్ వేముల ఆత్మ హత్యకు పాల్పడవలసి రావడం, జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, జాదవ్ పూర్ విశ్వవిద్యాలయంలో సామాజిక చింతన ఉన్న విద్యార్థులు జైళ్లకెళ్లడంతో పాటు నానా యాతన పడవలసి రావడం వికృత పరిస్థితులకు ప్రస్ఫుటమైన సంకేతం.

మేకతోలు కప్పుకున్న పులులు

ఎం కోటేశ్వరరావు

తన బొందిలో ప్రాణం ఉన్నంత వరకు ముస్లింలకు రిజర్వేషన్లను అడ్డుకుంటానని ప్రధాని నరేంద్రమోదీ ఎన్నికల ప్రచారంలో చెప్పారు. మాయని మచ్చగా ఉన్న అంటరాని తనం నిర్మూలన గురించి, దానికి కారణమైన సనాతన ధర్మం, మనువాదం గురించి మోదీ నోటి వెంట ఒక్క మాటా ఇంతవరకు రాకపోగా సనాతన ధర్మాన్ని కాపాడతామని వీర ప్రతిజ్ఞలు చేస్తున్నారు. సబ్‌కా సాథ్ సబ్ కా వికాస్ అన్న నోటితోనే ఒక సామాజిక తరగతికి రిజర్వేషన్లను అడ్డుకుంటానని ప్రతిజ్ఞ చేశారు నరేంద్రమోదీ. అనేక అంశాలలో దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులతో సమంగా ముస్లింలు ఉన్నారని అనేక నివేదికలు స్పష్టం చేశాయి. కేవలం మతాన్ని చూపి వారిని సామాజిక న్యాయానికి దూరం చేయటం సమంజసమా ? తమకు నాలుగు వందలకు పైగా స్థానాలను ఇవ్వాలని బీజేపీ చెప్పటం వెనుక రాజ్యాంగ మార్పు, రిజర్వేషన్ల ఎత్తివేతకే అని అనేక మంది భావిస్తున్నారు. ఒక వైపు ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వం అని చెబుతూనే ఇతరుల రిజర్వేషన్లు రద్దు చేయం అని బీజేపీ, దాని మాతృసంస్థ ఆర్‌ఎస్‌ఎస్ నేతలు పదే పదే నమ్మబలుకుతున్నారు. తమతో చేతులు కలిపిన తెలుగుదేశం నేత చంద్రబాబు నాయుడు ముస్లిం రిజర్వేషన్లు అమలు జరుపుతానంటూ ప్రచారం చేస్తున్నారు.

బీహార్‌లో మరోమారు బీజేపీ అండతో ముఖ్యమంత్రి పీఠాన్ని నిలుపుకున్న నితీష్ కుమార్ గతంలో చెప్పిందేమిటి ?(2015 సెప్టెంబరు 23, ఇండియా డాట్‌కామ్, ఇండో ఆసియన్ న్యూస్ సర్వీసు) దేశంలో ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి రిజర్వేషన్లను తొలగించాలని కోరుకుంటున్నది. రిజర్వేషన్ల విధానాన్ని సమీక్షించాలని చెప్పటం వారి వ్యూహంలో భాగం. ఇది ప్రమాదకరం, ఆర్‌ఎస్‌ఎస్ రాజకీయ విభాగం బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ అధిపతి మోహన్ భగవత్ ఇప్పుడున్న రిజర్వేషన్ విధానం సరైంది కాదని ఇటీవల అన్నారని కూడా నితీష్ కుమార్ చెప్పారు. వెనుకబడిన తరగతుల రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకమని జెడి(యు) సీనియర్ నేత ఉపేంద్ర కుష్వాహ (పిటిఐ వార్త, 2022 అక్టోబరు 16, బిజినెస్ స్టాండర్డ్) చెప్పారు. రిజర్వేషన్లతో నిమిత్తం లేకుండా బోధనా సిబ్బంది నియామకానికి యూజీసీ జారీ చేసిన మార్గదర్శక సూత్రాలే దానికి నిదర్శనం అన్నారు. ఈ విధానం కింద నియమించిన 40 మందిలో ఒక్కరు కూడా వెనుకబడిన తరగతులకు చెందిన వారు లేరన్నారు. ఇప్పుడు అదే నేతలు మాట మార్చి రిజర్వేషన్లు కొనసాగుతాయని ఇప్పుడు చెబుతున్నారు, వాటినెందుకు నమ్మాలి ?

కాషాయ దళాలు చెబుతున్న మాటల మీద రోజు రోజుకూ అనుమానాలు ఎందుకు పెరుగుతున్నాయి ? ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతవేత్త, సంయుక్త ప్రధాన కార్యదర్శి మన్మోహన్ వైద్య జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్‌లో మాట్లాడుతూ(2017 జనవరి 20, ఏఎన్ఐ వార్త, బిజినెస్ స్టాండర్డ్, ఎన్‌డిటివి) ఉద్యోగాలు, విద్యా సంస్థలలో కుల ప్రాతిపదికన రిజర్వేషన్లు త్వరలో పోవాలి. అందరికీ సమాన అవకాశాలు కావాలి తప్ప భారత్‌లో రిజర్వేషన్లు అవసరం లేదని, అవి వేర్పాటు వాదాన్ని ప్రోత్సహిస్తాయని చెప్పారు. సమాజంలో ఘర్షణ సృష్టిస్తాయని అందువలన వాటి మీద పునరాలోచన చేయాలన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ అధిపతి మోహన్ భగవత్ తమ పత్రికలు ఆర్గనైజర్, పాంచజన్యలకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రిజర్వేషన్ విధానంపై "సామాజిక సమీక్ష" జరపాలని చెప్పారు. దాని మీద వివాదం తలెత్తటంతో అబ్బే అలాంటిదేమీ లేదు నూటికి నూరు శాతం రిజర్వేషన్లను గౌరవిస్తున్నారని ఆర్‌ఎస్‌ఎస్ ఒక ప్రకటన చేసింది.(ఇండియా టుడే, 2015 సెప్టెంబరు 23) తమ నేత భారత సమాజంలోని బలహీన వర్గాలందరికీ రిజర్వేషన్ల ఫలితాలు అందేలా ఆలోచించాలని కోరినట్లు ఆర్‌ఎస్‌ఎస్ ప్రచార ప్రముఖ్ మన్మోహన్ వైద్య ఒక ప్రకటన జారీ చేశారు." వాటి మీద రాజకీయాలు చేయకుండా రాజ్యాంగ నిర్మాతలు కోరుకున్నట్లుగా రిజర్వేషన్ల విధానాన్ని అమలు చేసి ఉంటే ప్రస్తుత పరిస్థితి తలెత్తి ఉండేది కాదు, ప్రారంభం నుంచి వాటిని రాజకీయం చేశారు " అని మోహన్ భగవత్ చెప్పారు. దీనదయాల్ ఉపాధ్యాయ ప్రవచించిన సంపూర్ణ భావజాలానికి అనుగుణ్యంగానే భగవత్ మాట్లాడినట్లు ఆర్గనైజర్ పత్రిక సంపాదకుడు ప్రఫుల్ల కేత్కర్ సమర్థించారు. ఇలా మాట్లాడటం అడ్డుపడటం, ఎస్‌సి, ఎస్‌టి,వెనుకబడిన తరగతుల రిజర్వేషన్లను బలహీనపరిచే యత్నమే అని జెడియు ప్రధాన కార్యదర్శి కెసి త్యాగి అన్నారు.

భారత్‌కు మార్క్స్ అధ్యయనం అవశ్యం

కృష్ణ ఝా

సామాజిక శాస్త్రవేత్త కారల్ మార్క్స్ రూపొందించిన సిద్ధాంతం, గతి తార్కిక సూత్రాలు, భారతదేశానికి నేడు మరింత అవసరం. మార్క్స్ రచించిన శాస్త్రీయ సిద్ధాంతాన్ని మన దేశానికి అన్వయించ వలసిన పరిస్థితులు ఉన్నాయి. ప్రజాస్వామ్య విలువల కోసం, రాజ్యాంగ హక్కుల కోసం మార్క్స్ అడుగుజాడల్లో పోరాటం చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. గుత్త పెట్టుబడిదారీ వ్యవస్థ విధానాలకు వ్యతిరేకంగా స్వేచ్ఛ, సమానత్వం, తదితర అనేక హక్కులకోసం పోరాటాలు నిర్వహిస్తున్నాము. సామాజిక-ఆర్థిక వ్యవస్థ నిర్మాణం ఆధారంగా ఉత్పత్తి విధానాన్ని మార్క్స్ ప్రతిపాదించారు. మూలాధారం కీలకంగా మొత్తం ఉపరితల నిర్మాణ లక్షణాన్ని అయన కనుగొన్నారు. మానవాళి సృష్టించుకున్న భాష, ఉత్పత్తి మార్గం పరిణామం ఆధారంగా సమాజ పరిణామం జరిగింది. మార్క్స్‌కు ముందు ఉత్పత్తి ప్రక్రియకు ముడిపదార్థం, సాధనాలు, కార్మికులు అవసరమయ్యాయి. ఇతర సాధనాలతోపాటు కార్మికుడిని ప్రస్తావించారు. ఉత్పత్తి విధానంలో మనిషి పాత్రను మార్క్స్ మొట్టమొదట గుర్తించారు. ఆయన వారిని కార్మికులని, ఒక వర్గం వారని గుర్తించారు. సమాజం ఎల్లవేళలా ముందుకు నడవడానికి కార్మికుడు ఎంతైనా అవసరమని మార్క్స్ చెప్పారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఇలా ఉంటుందని ఆయన గుర్తించినప్పటికీ, సామాజిక, ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలోని అన్ని దశల్లో శ్రామికుడు అవసరమని ఆయన చెప్పారు.

మార్క్స్ పెట్టుబడి కేంద్రీకరణ, డబ్బుకు డబ్బు సాధించే స్థాయిని గుర్తించారు. సామ్రాజ్యవాదం, పారిశ్రామిక పెట్టుబడి, బ్యాంకుల పెట్టుబడి కలిసి ద్రవ్యపెట్టుబడిగా తయారవుతుందని విఐ లెనిన్ గుర్తించేస్థాయిని అందించారు మార్క్స్. మౌలికంగా మార్క్స్ శాస్త్రవేత్త. ఆయన పాదార్థిక సిద్ధాంతం గతి తార్కికం ఆధారంగా రూపొందించిందే. అయితే సమాజం ఎల్లప్పుడూ మార్పుకు లోనవుతుంది. భౌతిక ప్రపంచంలో ఏదీ పై స్థాయిఅని చెప్పలేదు. ఈ గమనం తార్కికం, ఐక్యత, పోరాటంతో కలిసే ఉంటుంది. మార్క్స్ గొప్పతత్వవేత్త, శాస్త్రవేత్త, ప్రముఖ ఆలోచనాపరుడు. భవిష్యత్‌లో రానున్న సమాజాన్ని గురించి మార్క్స్ ముందుగానే అంచనా వేశారు. కార్మిక వర్గం నాయకత్వంలో వర్గ వ్యతిరేకతలేని సమాజం ఏర్పడనున్నదని ఆయన రచించారు.

మార్క్స్ జర్మనీలోని ప్రష్యా ప్రాంతంలో రోహిన్ రాష్ట్రంలోని ట్రైయర్ అనే చిన్న పట్టణంలో 1818 మే 5వ తేదీన జన్మించారు.ఆయనకంటే ముందుగానే ఆవిరియంత్రాన్ని జేమ్స్‌వాట్ కనుగొన్న తర్వాత పారిశ్రామికవిప్లవం ప్రారంభమైంది. సైన్స్, ఆవిరియంత్రం కనుగొనడంతో ఆధునికతలో ప్రవేశించి ఆ తర్వాత పెట్టుబడి దారీ వ్యవస్థలోకి ప్రవేశించింది. మార్క్స్ పరిణామక్రమాన్ని చూశారు. దీంతో ఆయన గతితార్కితను ఆవిష్కరించారు. దాన్ని ఆయన సిద్ధాంతం అన్నారు.శాస్త్రీయంగా సామాజిక-ఆర్థిక నిర్మాణం దశలను నిర్వచించారు. ఈ దశలను వంశపారంపర్య క్రమానుగతం ఎన్నటికీ వెనక్కి మళ్లించలేని, కొత్తదనంతోపాటు ప్రచారాన్ని పదిలపరచడం.

ఐరోపాలో మూడు ప్రముఖ దేశాలలోని స్థితిగతులను మార్క్స్‌లోతుగా అధ్యయనం చేశారు. వీటిలో ఫ్రాన్స్ ఒకటి. ఈ దేశ ప్రజలు సోషలిజంపై కలలు గన్నారు. సైన్స్, వర్గసంబంధాలు ఇంకా పరిపక్వంకావలసిఉంది. అందువల్ల సోషలిజం ఇంకా ఊహాజనితంగానే ఉన్నది. 1789 ఏప్రిల్ 14నపారిస్‌లోని రాచరికకోటపై ప్రజలు దాడిచేసినప్పుడు సమానత్వం,స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం నినాదాలు చేశారు. అయితే ఈ లక్ష్యం ఇంకా నెరవేరలేదు. ఫ్రాన్స్‌లో రక్తపు మడుగులు పారినప్పటికీ రాజరికం అంతం కాలేదు. సమానత్వం, న్యాయం లక్ష్యం సాధనకు సమయం పరిపక్వం కాలేదు. ఈ రెండు వ్యక్తీకరణలు మానవ జీవితానికి ఎంతైనా అవసరం. అంతేకాదు, భూస్వామ్య వ్యవస్థ నుంచి పెట్టుబడిదారి వ్యవస్థకు మారే క్రమం ఇంకా పరిపక్వం కాలేదని మార్క్స్ చెప్పారు. పారిశ్రామిక విప్లవానికి బూర్జువా సమాజం



మార్గదర్శకం అయింది. దీంత కార్మికవర్గంలో రైతులు చేరారు. అయినప్పటికీ విప్లవం పరిస్థితులు ఇంకా పరిపక్వం కాలేదు. మార్క్స్ పరిణామ క్రమస్థాయిని విశ్లేషించారు. సందర్భాన్ని అనుసరించి ప్రతిభావనను అర్థం చేసుకోవాలని మార్క్స్ వివరించారు. సామాజిక -ఆర్థిక స్థాయిలనుబట్టి వ్యాఖ్యానాలు భిన్నంగా ఉంటాయి. సామాజిక, ఆర్థికస్థాయిలు కూడా వర్గాల స్వభావాన్ని, పాలకులు, పాలితుల స్వభావాన్ని అనుసరించి ఉంటాయి. ఉత్పత్తిపద్ధతిని అనుసరించి వర్గాల స్థాయిలు ఉంటాయి. ఫ్రెంచి విప్లవం రైతాంగం నాయకత్వంలో జరిగింది. అయితే ఇది రైతులకున్న భూమితో అధికంగా ముడివడింది. రైతులు మార్పును కోరుకున్నారుగానీ తమ భూమిని వదులుకోవడానికి సిద్ధంగా లేరు. అయితే భూమిపై దోపిడీ అంతానికి సమ్మతించలేదు, ఫ్యూడల్ శక్తులను మాత్రమే అణచివేయాలని కోరుకున్నారు. వర్గ ప్రయోజనాలను అందరూ కోరుకున్నారు. అందువల్ల న్యాయం, సంకెళ్లనుంచి విముక్తి కాలేదు. సమానత్వం సాధ్యం కాలేదు. అయితే వర్గ స్వభావాన్ని గుర్తించేందుకుగాను శాస్త్రీయంగా నినాదాలను రూపొందించారు. రెండు వర్గాల ఐక్యత, పోరాటం ద్వారా సమాజం ముందుకు నడుస్తున్నదని మార్క్స్ గుర్తించారు. వర్గపోరాటంలో ప్రతి ఒక్కరి స్థానాన్ని బట్టి ఐక్యంగా సమాజ నిర్మాణం జరుగుతుంది. కార్మిక వర్గం "పాలన" క్రమంలో అంతిమంగా గతి తార్కిక వ్యాఖ్యానం చేశారు. గతి తార్కికత కొనసాగి మార్పుతీసుకు వస్తుందన్నారు.

ఫ్రెంచి విప్లవం సందర్భంగా ఇచ్చిన నినాదాలను మార్క్స్ విమర్శించారు. వాస్తవంగా అవి మానవీయ నినాదాలు. మౌలికంగా అవి వర్గదృక్పథంతో రూపొందించిన నినాదాలు కాదు. సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం నినాదాలు వర్గదృక్పథం గలవి. వాస్తవంగా మార్క్స్ కూడా చరిత్ర పొడవునా వర్గపోరాట క్రమం వెలుగులో అసలు వాస్తవాన్ని గుర్తించారు. పెట్టుబడిదారి వ్యవస్థలో సంక్షోభం ఎప్పటికీ అంతరించదని మార్క్స్ చెప్పారు.

(మే 5వ తేదీ మార్క్స్ జయంతి సందర్భంగా)

రైతు సమస్యల పోరాట యోధుడు అతుల్

కె.వి.వి. ప్రసాద్

ప్రముఖ రైతు నాయకుడు అతుల్ కుమార్ అంజాన్ మరణం దేశంలో రైతు ఉద్యమానికి, వామపక్ష ఉద్యమానికి తీరనిలోటు. ఆయన అకాల మరణం వామపక్ష నాయకులను, కార్యకర్తలను తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. ఆయన స్వామినాథన్ కమిషన్‌లో సభ్యుడిగా ఉండి రైతు సమస్యలపై అవిరళ కృషి చేశారు. ఆరు దశాబ్దాలపైన వయస్సుగల రైతులకు పెన్షన్ రావడానికి అతుల్ కృషి ఎనలేనిది. మూడు వ్యవసాయ దుష్ట చట్టాలు రద్దు చేయాలని కొన్నివందల రైతు సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వంలో జరిగిన మహత్తర పోరాటంలో అతుల్ ప్రముఖపాత్ర నిర్వహించారు.

భారతీయ కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ కార్యదర్శి, ఆల్ ఇండియా కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి అయిన అతుల్ లక్నో ఆసుపత్రిలో శుక్రవారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచారు. ఆయన వయస్సు 70 ఏళ్లు. అతుల్ 20వ ఏట లక్నోలో విద్యార్థిగా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించాడు. గత కొంతకాలంగా లక్నోలోని క్యాన్సర్ ఆసుపత్రిల్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మరణించారు. 1953లో లక్నోలో జన్మించిన అతుల్ కుమార్ లక్నో స్టేట్ బోర్డు స్కూల్‌లో ప్రాథమిక వ్యిదను అభ్యసించారు. 1967,72,76,83 లలో వరుసగా లక్నో విశ్వవిద్యాలయం నుంచి గ్రాడ్యుయేషన్, పోస్టు గ్రాడ్యుయేషన్, యల్.యల్.బి. పూర్తి చేశారు. ఈ కాలంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన లక్నో యూనివర్శిటీ విద్యార్థి యూనియన్ అధ్యక్షునిగా 10 సంవత్సరాలపాటు నిర్విరామంగా బాధ్యతలు నిర్వహించి విద్యార్థుల సమస్యలపై పోరాడి వారి మన్ననలను పొందారు. 1978లో ఆలిండియా స్టూడెంట్ ఫెడరేషన్ ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షునిగా పనిచేశారు. 1985 వరకు ఏఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షునిగా పనిచేశారు. 1985లో గుంటూరులో జరిగిన ఏఐఎస్ఎఫ్ జాతీయ మహాసభలలో విద్యార్థి ఉద్యమ బాధ్యతలనుండి తప్పుకొన్నారు. అనంతరం 1997లో మే 18-20 తేదీలలో కేరళ రాష్ట్రం త్రిసూర్‌లో జరిగిన అఖిల భారత కిసాన్ సభ జాతీయ మహాసభలలో అతుల్ కుమార్ అంజాన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై నేటి వరకు కొనసాగుతున్నారు.

2010 డిసెంబరు 9-12వరకు మహారాష్ట్రలోని ఔరంగాబాద్ మహాసభలలో 60 సంవత్సరాలు నిండిన రైతాంగానికి పెన్షన్ సౌకర్యం కల్పించాలనే ప్రధాన తీర్మానాన్ని ఆమోదింపచేసి అందుకోసం దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని నిర్వహించడంలో కృతకృత్యులైనారు. వివిధ రాష్ట్రాల్లో రైతులకు పెన్షన్ లభిస్తున్నదంటే ఆయన కృషి మేరకే. ప్రభుత్వాల రైతాంగ వ్యతిరేక విధానాలతో నిరాశకు గురైన రైతులు గిట్టుబాటు ధరలు లభించక ఆత్మహత్యలకు పాల్పడుతున్న దశలో అతుల్ కుమార్ అంజాన్ చొరవతో వివిధ రైతుసంఘాలతో కలిసి దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో సదస్సులు, సెమినార్లు నిర్వహించిన ఫలితంగా ఆనాటి యూపీఏ ప్రభుత్వ హయాంలో డా. యం.యస్. స్వామినాథన్ సారథ్యంలో నియమించిన రైతు కమిషన్‌లో అతుల్ కుమార్ అంజాన్ సభ్యునిగా కొనసాగారు. స్వామినాథన్‌తోపాటు అనేక రాష్ట్రాలు పర్యటించి రైతాంగ సమస్యలను అప్పులభారంతో క్రుంగిపోతున్న రైతులు పరిస్థితిని అధ్యయనం చేశారు. 2006లో కమిషన్ రిపోర్టు అప్పటి యూపీఏ ప్రభుత్వానికి సమర్పించారు. ఆనాటి యూపీఏ ప్రభుత్వం కమిషన్ నివేదికను అమలు చేయకపోవడంతో తిరిగి కమిషన్ సిఫార్సుల అమలుకు ఇతర రైతుసంఘాలతో కల్సి ఉద్యమబాట పట్టారు.

అతుల్ కుమార్ మంచి వాగ్ధాటి కలిగిన రైతునేత. మంచి ఉపన్యాసకునిగా రైతాంగ సమస్యలను వివరించడంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును పొందారు. ఉర్దూ, హిందీతోపాటు మరో నాలుగు భాషలతో ఆయనకు పరిచయం ఉన్నది. ఉత్తరాది రాష్ట్రాల్లో ఏ ప్రాంతానికి వెళ్ళినా ఆ ప్రాంత గ్రామీణ ప్రజలతో, రైతాంగంతో స్థానిక భాషలో మాట్లాడగలిగిన దిట్ట. రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలు, చేతివృత్తిదారుల సమస్యలపై నిత్యం వివిధ ఛానల్‌లలో చర్చాగోష్ఠిల ద్వారా ప్రభుత్వాల, ప్రజల దృష్టికి తెచ్చేవారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా కార్పోరేట్ల దోపిడీపై నిక్కచ్చిగా మాట్లాడేవారు. క్షేత్రస్థాయిలో నిరంతరం రైతులు పండించే పంటలకు కనీస మద్దతు ధరలు ఉండాలని స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను ఖచ్చితంగా అమలు చేయాలని అందుకోసం చట్టం రూపొందించాల్సిన ఆవశ్యకతను ఆయన సమావేశాలలో, సదస్సులలో, సెమినార్లలో తన శైలిలో నొక్కి చెప్పేవారు. దేశంలోగాకుండా ఇతర దేశాల్లో సైతం రైతాంగ సమస్యలపై జరిగే సెమినార్లకు హాజరై భారతదేశ రైతాంగ వాణిని వినిపించేవారు. అనేక కీలక ఉద్యమాలలో పేదల పక్షాన నిలిచి తమ రాజకీయ జీవితంలో 4 సంవత్సరాల తొమ్మిది నెలలపాటు జైలు జీవితం అనుభవించారు. వీరి తండ్రి డా.ఎ.పి. సింగ్ హిందూస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేవారు. స్వాతంత్ర సమరయోధులు. బ్రిటిష్ కాలంలో సుదీర్ఘకాలం జైలు శిక్ష అనుభవించారు. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబం నుండి వచ్చిన అతుల్ కుమార్ చిన్నతనం నుండే రాజకీయాలపట్ల ఆసక్తి చూపేవారు. అదే ఆయనను విద్యార్థి ఉద్యమం వైపు, అనంతరం రైతాంగ ఉద్యమం వైపు, కమ్యూనిస్టు ఉద్యమం వైపు నడిచేందుకు మార్గం సుగమం అయినది.

ఉత్తరప్రదేశ్‌లో కమ్యూనిస్టు పార్టీకి పెట్టని కోటగా ఉన్న ఘోసీ లోక్‌సభ స్థానం నుండి పలు మార్లు పోటీ చేసినా విజయం సాధించలేకపోయారు. అయితే ఉత్తరప్రదేశ్‌తోపాటు ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన, దేశవ్యాప్తంగా పలు పార్టీల నాయకులు, రైతుసంఘాల నాయకులతో సత్సంబంధాలు కలిగి ఉండేవారు. అతుల్ కుమార్ ధైర్యవంతుడు. అంకితభావంతో కూడిన ప్రజా సేవకునిగా గుర్తింపు ఉంది. పార్టీ, రైతుసంఘ కార్యకర్తలతో స్నేహశీలిగా మెలిగేవారు. ఆయన మరణవార్త అనేక మందిని ఆశనిపాతానికి గురిచేసింది. అనేకమంది ప్రముఖులు సంతాప సందేశాలు దిల్లీలోని అఖిల భారత కిసాన్‌సభ కార్యాలయానికి పంపుతున్నారు. అన్ని రాష్ట్రాలతోపాటు మన రాష్ట్రంలో సైతం అనేక జిల్లాల్లో సంతాపం తెలియచేస్తూ రైతు గొంతుక మూగబోయిందంటూ నివాళులర్పిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ప్రధాన కార్యదర్శి
సెల్ : 9490952737

అమేథికి దూరంగా గాంధీలు

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని అమేథి లోక్‌సభ నియోజకవర్గం గాంధీల కంచుకోట. 2019కి ముందు గాంధీల వారసులు ఇక్కడ నుంచి బరిలోకి దిగేవారు. ఈ ఎన్నికల్లో బయటి వ్యక్తిని బరిలోకి దింపారు. పోటీకి దిగిన కిశోర్ లాల్ శర్మ గాంధీ కుటుంబానికి వీర విధేయుడు. అతడిని అభ్యర్థిగా ప్రకటించడంపై ప్రియాంక గాంధీ హర్షం వ్యక్తం చేశారు. అమేథి, రాయ్‌బరేలి కోసం కిశోర్ తన జీవితాన్ని త్యాగం చేశారని వివరించారు. అమేథి నుంచి ఆయన అభ్యర్థిగా బరిలోకి దిగడంపై సంబర పడ్డారు. అమేథి లోక్‌సభ నియోజకవర్గానికి, గాంధీ కుటుంబానికి మంచి అనుబంధం ఉంది. 31 ఏళ్ల నుంచి గాంధీ కుటుంబ సభ్యులు బరిలోకి దిగారు. రెండుసార్లు ఇతర పార్టీ అభ్యర్థులు గెలిచారు. 1980 నుంచి అమేథితో గాంధీ కుటుంబానికి విడదీయరాని బంధం ఏర్పడింది. ఇందిరాగాంధీ చిన్న కుమారుడు సంజయ్ గాంధీ పోటీ చేసి, గెలుపొందారు. సంజయ్ మరణం తర్వాత జరిగిన ఉపఎన్నికల్లో రాజీవ్‌గాంధీ పోటీ చేశారు.

అప్పటి నుంచి రాజీవ్ గాంధీ అమేథి నుంచి బరిలోకి దిగారు. 1984, 1989, 1991లో వరసగా హ్యాట్రిక్ విజయం సాధించారు. 1991లో రాజీవ్ గాంధీ మరణించిన తర్వాత కాంగ్రెస్ నేత సతీశ్ శర్మ1991 ఉపఎన్నిక, 1996 సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొందారు. 1999 నుంచి రాజీవ్ గాంధీ సతీమణి సోనియా గాంధీ బరిలోకి దిగారు. 2004లో కుమారుడు రాహుల్ గాంధీ కోసం సీటు త్యాగం చేశారు. 2009, 2014లో రాహుల్ గాంధీ గెలుపొందారు. 2019లో మాత్రం స్మృతి ఇరానీ చేతిలో ఓడిపోయారు. మరోసారి పోటీ చేసేందుకు రాహుల్ గాంధీ అంగీకరించలేదు. దాంతో కిశోర్ శర్మకు టికెట్ దక్కింది.

రాజీవ్ గాంధీ మరణించిన తర్వాత జరిగిన ఉపఎన్నికల్లో సతీశ్ శర్మ పోటీ చేసి గెలుపొందారు. ఇన్నాళ్లకు మరో శర్మ... కిశోరి లాల్ బరిలోకి దిగారు. పంజాబ్‌లో గల లుధియానా కిశోర్ శర్మ స్వస్థలం. గాంధీల కుటుంబానికి నమ్మిన బంటు. 1987 నుంచి అమేథి నియోజకవర్గం కోసం పనిచేస్తున్నారు. 1990లో సోనియా గాంధీ విజయం సాధించడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. ఇన్నాళ్లకు అమేథి నుంచి పోటీ చేసే అరుదైన అవకాశం ఆయనకు దక్కింది.

ప్రియాంకపై భారీ కుట్ర: ఆచార్య ప్రమోద్



ఘజియాబాద్: రాయ్‌బరేలి నుంచి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ బరిలో దిగడంపై ఆ పార్టీ మాజీ నేత ఆచార్య ప్రమోద్ కృష్ణం స్పందించారు. యూపీలోని ఘజియాబాద్‌లో ఆయన శుక్రవారం ఓ వార్తాసంస్థతో మాట్లాడుతూ ప్రియాంక గాంధీని ఎన్నికల్లో రాహుల్ గాంధీ పోటీ చేయనీయరని సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రియాంక గాంధీని ఎన్నికల బరిలో దింపడం రాహుల్‌కు ఇష్టం లేదని, ఆ విషయం తాను ఇంతకుముందే చెప్పానని గుర్తుచేశారు. కుటుంబంలో, పార్టీలో ప్రియాంక గాంధీకి వ్యతిరేకంగా భారీ కుట్రకు తెరలేపారని ఆరోపించారు. కుటుంబంలో, పార్టీలో తనకు వ్యతిరేకంగా జరిగే కుట్రలో ఆమె బాధితురాలిగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీకి అమేథి నుంచి పోటీ చేయడం ఇష్టం లేకుంటే వారణాసిలో ప్రధాని నరేంద్ర మోదీని ఢీ కొనాలని ఆచార్య ప్రమోద్ కృష్ణం సూచించారు.

ఆడబిడ్డలు ఓడిపోయారు...

బ్రిజ్‌భూషణ్ గెలిచాడు

ప్రముఖ రెజ్లర్ సాక్షి మాలిక్ పోస్ట్

లక్నో: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ ఎంపీ, భారత రెజ్లింగ్ సమాఖ్య మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌కు లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ టికెట్ నిరాకరించింది. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న కైసర్‌గంజ్ స్థానంలో కుమారుడు కరణ్ భూషణ్ సింగ్‌ను బరిలోకి దింపింది. ఈ ప్రకటనపై ప్రముఖ రెజ్లర్, ఒలింపిక్ పతక విజేత సాక్షి మాలిక్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ భావోద్వేగభరిత పోస్ట్ పెట్టారు. ఈ దేశ ప్రభుత్వం అంత బలహీనంగా ఒక వ్యక్తి ముందు లొంగిపోయిందా?అని నిలదీశారు. 'ఈ దేశ ఆడబిడ్డలు ఓడిపోయారు. బ్రిజ్ భూషణ్ గెలిచాడు. ఆయనకు వ్యతిరేకంగా మేమంతా మా కెరీర్‌లను పణంగా పెట్టి పోరాడాం. ఎండనకా... వాననకా... ఎన్నో రోజులు రోడ్లపై నిద్రించాం. అయినా ఆయనను ఇంతవరకు అరెస్టు చేయలేదు. మేం న్యాయం తప్ప ఇంకేం డిమాండ్ చేయట్లేదు. అరెస్టు విషయం పక్కనబెట్టండి. ఈ రోజు ఆయన కుమారుడికి ఎన్నికల్లో టికెట్ ఇచ్చారు. ఈ నిర్ణయంతో మీరు (బీజేపీని ఉద్దేశిస్తూ) కోట్లాది మంది అమ్మాయిల మనోధైర్యాన్ని దెబ్బతీశారు. కేవలం ఒకే ఒక్క కుటుంబానికి టికెట్ ఇవ్వాల్సిన పరిస్థితి ఉందంటే... ఒక వ్యక్తి ముందు ఈ దేశ ప్రభుత్వం అంత బలహీనపడిందా? శ్రీరాముడి పేరుతో ఓట్లు మాత్రమే కావాలా? ఆయన చూపిన బాటలో నడవరా?' అని సాక్షి ప్రశ్నించారు. కైసర్‌గంజ్ లోక్‌సభ స్థానానికి వరుసగా మూడు పర్యాయాలుగా బ్రిజ్‌భూషణ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే లైంగిక వేధింపుల ఆరోపణలు చేస్తూ గతేడాది జనవరిలో సాక్షి మలిక్, బజ్‌రంగ్ పునియా, వినేశ్ ఫొగాట్ సహా అగ్రశ్రేణి రెజ్లర్లు ఆయనకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టిన సంగతి తెలిసిందే. దీంతో ఆయనపై పార్టీలో తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. ఈ క్రమంలోనే తాజా ఎన్నికల్లో బీజేపీ హైకమాండ్ ఆయనను పక్కనబెట్టింది. కానీ, యూపీలో అతిపెద్ద బాహుబలి నేతల్లో ఒకరిగా బ్రిజ్‌భూషణ్‌కు పేరుంది. భారీ సంఖ్యలో కేసులు ఉన్నప్పటికీ... ఎంపీగా ఏకంగా ఆరుసార్లు పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. విద్యాసంస్థలు, అఖాడాలు నిర్వహిస్తూ యువతలో పాపులారిటీ సంపాదించారు. యూపీలోని గోండా చుట్టుపక్కల అరడజను జిల్లాల్లో ఆయన హవా కనపడుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకునే కైసర్‌గంజ్ స్థానంలో పార్టీ ఆయన కుమారుడికి అవకాశం కల్పించినట్లు తెలుస్తోంది. బ్రిజ్‌భూషణ్ చిన్న కుమారుడైన కరణ్ ప్రస్తుతం యూపీ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్నారు. ఆయన ఎన్నికల్లో పోటీ చేయడం ఇదే తొలిసారి. ఇక, మరో కుమారుడు ప్రతీక్ ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్నారు. కుమారుడికి టికెట్ ఇవ్వడంపై బ్రిజ్‌భూషణ్ స్పందిస్తూ... పార్టీ కంటే ఎవరూ ఎక్కువ కాదని, నిర్ణయాన్ని స్వాగతిస్తున్నానని తెలిపారు.

వారసత్వం కాదు... బాధ్యత

రాహుల్ రాయ్‌బరేలీకి మారడంపై కాంగ్రెస్ వివరణ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాయ్‌బరేలీ నుంచి పోటీ చేస్తుండడంపై బీజేపీ విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టింది. ఓటమి భయంతోనే రాహుల్ అమేఠీ నుంచి రాయ్‌బరేలీకి పారిపోతున్నారని స్వయంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎద్దేవా చేశారు. ఈ విమర్శలపై కాంగ్రెస్ స్పందించింది. విస్తృత చర్చల అనంతరం, దీర్ఘకాల వ్యూహంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. తమ ఎత్తుగడ బీజేపీ దాని మద్దతుదారులను కలవరపెడుతోందని పేర్కొంది. ఈ వ్యవహారంపై వివరణ ఇస్తూ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ 'ఎక్స్'లో సుదీర్ఘ పోస్ట్ చేశారు. 'రాయ్‌బరేలీ సోనియా గాంధీయే కాదు, ఇందిరాగాంధీ కూడా ప్రాతినిధ్యం వహించిన స్థానం. ఇది వారసత్వం కాదు... ఒక బాధ్యత, విధి. గాంధీ కుటుంబానికి సంబంధించినంత వరకు, అమేఠీ, రాయ్‌బరేలీ మాత్రమే కాదు... ఉత్తరం నుంచి దక్షిణం వరకు దేశం మొత్తం గాంధీ కుటుంబానికి బలమైన కోట. ఉత్తరప్రదేశ్ నుంచి రాహుల్ మూడుసార్లు, కేరళ నుంచి ఒకసారి ఎంపీగా గెలిచారు. వింధ్య పర్వతాల దిగువన పోటీ చేసే ధైర్యం ప్రధాని ఎందుకు చేయలేకపోయారు?' అని జైరామ్ రమేశ్ ప్రశ్నించారు. ప్రియాంకగాంధీ ఎన్నికల బరిలో లేకపోవడం పైనా జైరామ్ వివరణ ఇచ్చారు. 'ప్రియాంక గాంధీ దేశవ్యాప్తంగా ప్రచారం చేస్తూ మోదీ అసత్యాలను ఎండగడుతున్నారు. 1985 మార్చిలో చేసిన వారసత్వ పన్ను రద్దుపై ప్రధాని చేసిన దుష్ప్రచారాలను ఆమె దీటుగా తిప్పికొట్టారు. అందుకే ఆమె ఒక్క నియోజకవర్గానికే పరిమితం కాకూడదని భావించాం' అని తెలిపారు. అమేఠీ నుంచి రాహుల్‌పై పోటీ చేయడమే ఇప్పటివరకు కేంద్రమంత్రి స్మృతి ఇరానీకి ఉన్న గుర్తింపు అని జైరామ్ అన్నారు. ఇకపై ఆమెకు ఎలాంటి రాజకీయ ప్రాధాన్యం ఉండబోదన్నారు. అర్థం లేని ప్రకటనలు ఆపి... మూతపడిన ఆసుపత్రులు, స్టీల్ ప్లాంట్లు సహా స్థానిక అభివృద్ధిపై స్పందించాలని హితవు పలికారు. ఇవి సుదీర్ఘ ఎన్నికలని... ఈ చదరంగంలో ఇప్పటివరకు కాంగ్రెస్ కొన్ని పావులు మాత్రమే కదిపిందని వ్యాఖ్యానించారు. మరిన్ని ఎత్తుగడల కోసం వేచి చూడాలని 'ఎక్స్'లో రాసుకొచ్చారు.

వయనాడ్ ప్రజల మిశ్రమ స్పందన

తిరువనంతపురం: కాంగ్రెస్ పార్టీకి కంచుకోట, సోనియా గాంధీ ప్రాతినిధ్యం వహించిన ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ లోక్‌సభ స్థానంలోనూ రాహుల్ గాంధీ పోటీ చేయడంపై కేరళలోని వయనాడ్ ప్రజలు మిశ్రమంగా స్పందించారు. రాహుల్‌గాంధీ రాయ్‌బరేలీలో కూడా పోటీ చేయడంలో తప్పేమీ లేదని కొందరు అన్నారు. రెండు స్థానాల్లో ఆయన గెలిస్తే వయనాడ్ సీటు ఖాళీ చేసే అవకాశం ఉందని మరి కొందరు తెలిపారు. రాహుల్ గాంధీ అలా చేసిన పక్షంలో వయనాడ్ ప్రజలకు మంచిది కాదన్నారు. కాగా, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) నాయకుడు పీకే కున్హాలికుట్టి... రాహుల్ గాంధీ నిర్ణయాన్ని సమర్థించారు. రాయ్‌బరేలీ నుంచి ఆయన పోటీ చేయడంలో ఎలాంటి తప్పులేదని అన్నారు. ఈ నిర్ణయం ఇండియా కూటమికి ఊతమిస్తుందని తెలిపారు. ప్రధాని మోదీ గతంలో రెండు స్థానాల నుంచి పోటీ చేయలేదా అని ఆయన ప్రశ్నించారు. మరోవైపు వయనాడ్ లోక్‌సభ స్థానానికి ఏప్రిల్ 26న పోలింగ్ జరిగింది. సీపీఐ నేత అనీ రాజా, కేరళ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కె.సురేంద్రన్‌తో రాహుల్ గాంధీ పోటీ పడ్డారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో వయనాడ్ నుంచి గెలిచిన రాహుల్ గాంధీ... ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ స్థానంలో ఓడిపోయారు. ఈసారి వయనాడ్‌తోపాటు రాయ్‌బరేలీ నుంచి ఆయన పోటీ చేస్తున్నారు.

సోనియా ప్రయత్నం ఫలించడం లేదు: అమిత్ షా



బెంగళూరు: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వయనాడ్ నుంచి మాత్రమే కాకుండా రాయ్‌బరేలీ లోక్‌సభ స్థానం నుంచి కూడా పోటీ చేస్తున్నారు. ఈ స్థానంలో బీజేపీ అభ్యర్థిపై భారీ తేడాతో ఓడిపోతారని కేంద్ర హోంమంత్రి 'అమిత్ షా' పేర్కొన్నారు. రాహుల్ గాంధీని ఎన్ని సార్లు ఈ స్థానం నుంచి బరిలోకి దింపినా ఇంతవరకూ విజయం పొందలేదని అమిత్ షా ఎద్దేవా చేశారు. అమేఠీ నుంచి పారిపోయి... రాహుల్ గాంధీ రాయ్‌బరేలీలో నామినేషన్ దాఖలు చేశారని అన్నారు. 'బీజేపీ అభ్యర్థి దినేశ్ ప్రతాప్ సింగ్‌పై రాహుల్ భారీ తేడాతో ఓడిపోతారు. నా మాటలు రాసుకోండి' అని ఆయన అన్నారు. బెలగావి జిల్లాలో జరిగిన బహిరంగ సభలో అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ ప్రయత్నించారు. ఒకేసారి చంద్రయాన్ ప్రారంభమైంది. అయితే సోనియా గాంధీ రాహుల్ గాంధీ పేరుతో ఈ 'యాన్'ని ఇరవై సార్లు ప్రయోగించారు, కానీ ఆమె ప్రయోగం విజయవంతం కాలేదు. ఈ రోజు ఇరవై ఒకటవసారి అంటూ అమిత్ షా అన్నారు. రాహుల్ గాంధీ గత రెండు దశాబ్దాలుగా తన తల్లి సోనియా గాంధీకి చెందిన ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నియోజకవర్గం నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. కానీ ఒక్కసారి కూడా గెలుపొందలేదు. గాంధీ కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన కిషోరి లాల్ శర్మను అమేఠీ లోక్‌సభ స్థానం నుంచి బరిలోకి దింపారు. ఐదో దశ సార్వత్రిక ఎన్నికల్లో అమేఠీ, రాయ్‌బరేలీ స్థానాలకు ఈ నెల 20న పోలింగ్ జరగనుంది. రాయ్‌బరేలీ గతంలో రాహుల్ గాంధీ తల్లి సోనియా గాంధీ, ఆయన అమ్మమ్మ ఇందిరా గాంధీ, అతని తాత ఫిరోజ్ గాంధీలను ఎన్నుకున్న నియోజకవర్గం.

గవర్నర్ వికృత చేష్టలపై ప్రధాని స్పందించరేం? మమత



కోల్‌కతా: రాజ్‌భవన్‌లో ఓ మహిళా ఉద్యోగితో గవర్నర్ సీవీ ఆనందబోస్ అనుచితంగా ప్రవర్తించారని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ మండిపడ్డారు. ఆ మహిళను చూస్తుంటే తన హృదయం ద్రవించిపోయిందన్నారు. గవర్నర్ బోస్ ఆమెను ఎందుకు వేధించారో బీజేపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ సమస్యను ఎందుకు పరిష్కరించడం లేదని ఆమె ప్రశ్నించారు. శుక్రవారం పుర్బా వర్ధమాన్ జిల్లాలో జరిగిన బహిరంగ సభలో మమతబెనర్జీ మాట్లాడుతూ... 'నిన్న రాజ్‌భవన్‌లో పనిచేసిన ఓ యువతి బయటకు వచ్చి గవర్నర్ వేధింపులపై గోడు వెళ్లబోసుకుంది. ఆ మహిళ కన్నీళ్లు చూసి నా గుండె పగిలిపోయింది... ఆమె వీడియో సాక్ష్యం చూశాను. సందేశ్‌ఖాలీ గురించి మాట్లాడే ముందు బీజేపీ ఎందుకు సమాధానం చెప్పాలి. రాజ్‌భవన్‌లో పనిచేస్తున్న మహిళపై గవర్నర్ ఇలా చేయవచ్చా?' అని ఆమె అన్నారు. నిన్న రాత్రి రాజ్‌భవన్‌కు వచ్చిన ప్రధాని నరేంద్రమోదీ ఈ అంశంపై ఎందుకు మాట్లాడలేదంటూ మమత ఆశ్చర్యం వ్యక్తపర్చారు. 'ఇకపై రాజ్‌భవన్‌లో పనిచేయాలంటే చాలా భయంగా ఉందని ఆ మహిళ ఏడుస్తూ బయటకు వెళ్లిపోయింది. అసాధారణ సమయాల్లో తనను పిలిచి వేధింపులకు గురిచేశారని చెప్పింది. ఇది సిగ్గుచేటైన విషయం' అన్నారు. స్కూల్ సర్వీస్ కమిషన్ కేసులో చాలా మంది ఉద్యోగాలు కోల్పోవడానికి బీజేపీయే కారణమని మమత పేర్కొన్నారు.

భయపడకు... పారిపోకు...

వయనాడ్‌లో ఓటమి భయంతోనే రాయ్‌బరేలీకి రాహుల్: మోదీ

కోల్‌కతా: ఓడిపోతానన్న భయంతోనే కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అమేథి స్థానాన్ని విడిచి వెళ్లినట్లు ప్రధాని నరేంద్రమోదీ ఆరోపించారు. భయపడవద్దు.. పారిపోవద్దని రాహుల్‌కు చెబుతున్నానని మోదీ పేర్కొన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నుంచి పోటీ చేస్తున్నారు. అమేథీ స్థానాన్ని వీడి ఆయన... రాయ్‌బరేలీ నుంచి పోటీకి సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ శుక్రవారం బెంగాల్‌లో జరిగిన ఓ సభలో మాట్లాడారు. ఇటీవల బీజేపీ నేతృత్వంలోని కేంద్ర సర్కారును రాహుల్ పదేపదే విమర్శించారు. ఈడీ, సీబీఐ లాంటి సంస్థలతో దాడులు చేస్తున్నట్లు ఆయన ఆరోపిస్తూ... ఎవరూ భయపడవద్దు అంటూ పేర్కొన్నారు. రాహుల్ చేసిన ఆ వ్యాఖ్యలను ఇప్పుడు ఆయనకే ఉద్దేశిస్తూ మోదీ విమర్శలు చేశారు. సోనియా గాంధీని కూడా ఆయన వదల్లేదు. తల్లీకొడుకులు ఇద్దరూ తమ స్థానాన్ని వదలివేసి పారిపోయినట్లు ప్రధాని పేర్కొన్నారు. ఆ పార్టీకి చెందిన పెద్ద నేత కూడా పోటీ చేయదని చెప్పానని, ఆమె భయంతో పారిపోయారని, రాజస్థాన్‌కు వెళ్లి రాజ్యసభ నుంచి పోటీ చేశారని మోదీ ఎద్దేవా చేశారు. వయనాడ్‌లో కూడా రాహుల్ ఓటమి ఖరారు అవుతుందని, ఓటింగ్ ముగిసిన తర్వాత రాహుల్ మూడవ సీటు గురించి ప్రయత్నం మొదలుపెడతారని, అమేథీలో ఓటమి భయం వల్ల.. రాయ్‌బరేలీకి వెళ్లారని, భయపడవద్దు అంటూ దేశం అంతా తిరుగుతూ చెబుతున్న ఆ నేతలకు తానో విషయాన్ని చెప్పాలని భావిస్తున్నానని, మీరెవరూ భయపడవద్దు అని, ఎవరూ పారిపోవద్దు అని కాంగ్రెస్ నేతకు మోదీ హితవు పలికారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎలాంటి ఫలితాలు వస్తాయనేది స్పష్టమైందని, దీనికి ఓపీనియన్ పోల్స్ అవసరం లేదని మోదీ అన్నారు. రాహుల్ గాంధీ రాయ్‌బరేలి నుంచి పోటీ చేస్తారనే ప్రకటన వెలువడిన అనంతరం మోదీ స్పందించారు. రాహుల్ వయనాడ్‌తో పాటు మరో స్థానం నుంచి పోటీ చేస్తారని తాను గతంలో చెప్పానని గుర్తుచేశారు. రాహుల్ వయనాడ్‌లో ఓటమి పాలవుతారని తాను చెప్పానని, అందుకే రెండోస్థానం కోసం వెతుకులాట చేపట్టి రాయ్‌బరేలి నుంచి బరిలో నిలిచారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ రాజ్యాంగాన్ని మార్చాలని కోరుకుంటోందని, దళితులు, ఓబీసీ కోటాలను కత్తిరించి వాటిని జిహాది ఓటు బ్యాంక్‌కు పంచాలని కుయుక్తులు పన్నుతోందని మోదీ దుయ్యబట్టారు. విపక్షాలు దేశాన్ని అభివృద్ధి చేయాలని కోరుకోవని, ఓట్ల కోసం సమాజాన్ని విచ్ఛిన్నం చేయడమే వాటికి తెలిసిన మార్గమని ఆరోపించారు.

రేవణ్ణ, ప్రజ్వల్‌పై కిడ్నాప్ కేసు

మైసూరు: కర్నాటక మాజీ మంత్రి హెచ్‌డి రేవణ్ణ, ఆయన కుమారుడు ప్రజ్వల్ రేవణ్ణ తన తల్లిని కిడ్నాప్ చేశారంటూ ఓ యువకుడి ఫిర్యాదు మేరకు గురువారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఇక్కడి పోలీసులు తెలిపారు. హసన్ జిల్లాలోని హోలెనరసిపురా నియోజకవర్గం నుంచి జేడీ(ఎస్) ఎమ్మెల్యేగా ఉన్న రేవణ్ణ, మాజీ ప్రధాని, జేడీ(ఎస్) వ్యవస్థాపకుడు హెచ్‌డి దేవెగౌడ కుమారుడు. అలాగే మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డి కుమారస్వామికి అన్నయ్య. హసన్‌కు చెందిన జేడీ(ఎస్) సిట్టింగ్ ఎంపీ ప్రజ్వల్ మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. 33 ఏళ్ల ఎంపీకి సంబంధించిన అనేక స్పష్టమైన వీడియో దృశ్యాలు కొన్ని రోజులుగా సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేయడం ప్రారంభించిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసును విచారించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ను ఏర్పాటు చేసింది. ఏప్రిల్ 26న పోలింగ్ జరిగిన హసన్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎన్‌డీఏ అభ్యర్థిగా ప్రజ్వల్ రేవణ్ణ ఉన్నారు. గత ఏడాది సెప్టెంబరులో జేడీ(ఎస్) ఎన్‌డీఏలో చేరింది. హోలెనరసిపురా పోలీస్ స్టేషన్‌లో ఇప్పటికే తండ్రీకొడుకులిద్దరిపై వేధింపుల కేసు నమోదయింది. రాష్ట్ర హోం మంత్రి జి.పరమేశ్వర తెలిపిన వివరాల ప్రకారం గురువారం రాత్రి మరో ఫిర్యాదు నమోదయింది. ఈ తాజా కేసులో మైసూరు జిల్లాలోని కృష్ణరాజ నగర్ పట్టణానికి చెందిన 20 ఏళ్ల ఫిర్యాదుదారుడు తన తల్లిని రేవణ్ణ కిడ్నాప్ చేశాడని పేర్కొన్నాడు. ఆరేళ్ల క్రితం తన తల్లి హోలెనరసిపురలోని రేవణ్ణ నివాసంలో పని చేసేదని, మూడేళ్ల క్రితం ఉద్యోగం మానేసి స్వగ్రామానికి చేరుకుందని వివరించాడు. ఐదు రోజుల క్రితం, రేవణ్ణ సన్నిహితుడు సతీష్ బాబన్న అతని ఇంటికి వచ్చి, పోలీసులు విచారణ కోసం మీ వద్దకు రావచ్చని, వారికి ఏమీ వెల్లడించవద్దని చెప్పారు. 'ఏప్రిల్ 29న రాత్రి 9 గంటల సమయంలో సతీష్ బాబాన్న మా ఇంటికి వచ్చి మీ అమ్మ పట్టుబడితే మీకు ఇబ్బందులు తప్పవని, మీరంతా జైలుకు వెళ్లవచ్చని అన్నారు. మిమ్మల్ని తీసుకెళ్లమని రేవణ్ణ కోరారు. ఆ తర్వాత ఆమెను మోటార్‌సైకిల్‌పై తీసుకెళ్లాడు' అని ఫిర్యాదుదారు తెలిపారు. తన తల్లిని ఎక్కడికి తీసుకెళ్లారో తనకు ఎలాంటి ఆధారం లేదని చెప్పాడు. అయితే, మే 1న, తన స్నేహితుల నుంచి తనకు ఫోన్ వచ్చిందని, తన తల్లిని తాడుతో కట్టివేసి, ప్రజ్వల్ ఆమెపై అత్యాచారం చేశాడని చూపించే వీడియో బయటపడిందని వివరించాడు. తన తల్లికి ప్రాణహాని ఉందని, తన తల్లి ఎక్కడ ఉందో తెలుసుకోవడానికి పోలీసుల సహాయం కావాలని ఫిర్యాదుదారుడు కోరాడు. మైసూరు రూరల్ సబ్ డివిజన్ పరిధిలోని కె.ఆర్.నగర్ పోలీసులు హెచ్‌డి రేవణ్ణ, సతీష్ బాబన్నపై కిడ్నాప్, అక్రమ నిర్బంధం కేసు నమోదు చేశారు. ఇదిలాఉండగా,

కుట్రే... న్యాయపరంగా పోరాడతా: హెచ్‌డి రేవణ్ణ

ఈ కేసుకు సంబంధించిన ఆరోపణలపై రేవణ్ణ బుధవారం స్పందిస్తూ, 'ఈ కుట్రలను ఎదుర్కొనే శక్తి నాకు ఉంది. ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు. నేనేమీ తప్పు చేయలేదు. నేను ఎలాంటి విచారణకైనా సిద్ధమే. న్యాయపరంగా పోరాడతాను' అని తెలిపారు.

మరో 4 రోజులు వడగాడ్పులు

న్యూఢిల్లీ: భానుడి ప్రతాపంతో ఎండలు భగ్గుమంటుంటే రెండు రోజులుగా వడగాడ్పులు జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పగలు 10 గంటలు దాటితే బయటకు రావాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. సాయంత్రం 6 గంటల తర్వాత కూడా వేడిగాలి సెగలు రేపుతోంది. పిల్లలు, వృద్ధులూ వడగాడ్పులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో నాలుగు రోజుల పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లో వడగాడ్పుల ప్రభావం కొనసాగుతుందని వాతావరణశాఖ హెచ్చరించింది. తూర్పు ప్రాంతంలో వడగాడ్పులు మరో మూడు రోజుల పాటు కొనసాగుతాయని ఐఎండీ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నరేశ్ కుమార్ హెచ్చరించారు. ఒడిశా, పశ్చిమ బెంగాల్, బీహార్ రాష్ట్రాల్లో తీవ్ర వడగాడ్పులు కొనసాగుతాయని స్పష్టం చేశారు. మూడు రోజుల తర్వాత ఉరుముల కారణంగా వేడి గాలుల తీవ్రత తగ్గుతుందని అన్నారు.

ఈడీ లక్ష్యం కేజ్రీవాల్ అరెస్టు

స్వయంగా అమిత్ షా అంగీకరించారు: అతిశి

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను కుట్రపూరితంగానే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్టు చేసిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఓ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారని ఆమ్ ఆద్మీ పార్టీ శుక్రవారం పేర్కొంది. కేజ్రీవాల్‌కు సమన్లు పంపిన తొలి రోజు నుంచే ఈడీ అరెస్టు చేయాలని భావించిందని షా ఒక న్యూస్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో స్పష్టం చేశారని పార్టీ నాయకురాలు, ఢిల్లీ మంత్రి అతిశి విలేకరుల సమావేశంలో ఆరోపించారు. 'కేజ్రీవాల్‌కు ఈడీ సమన్లు రావడం ప్రారంభించిన రోజు నుంచి అతన్ని అరెస్టు చేయడానికి ఇది కుట్ర అని ఆప్ బహిరంగంగా చెప్పింది' అని ఆమె వివరించారు. అవి ఈడీ సమన్లు కాదని, బీజేపీ సమన్లు అని అన్నారు. ఈడీ స్వతంత్ర దర్యాప్తు సంస్థ అని, ఆ సమన్లతో తమకు ఎలాంటి సంబంధం లేదని బీజేపీ అధికార ప్రతినిధులు అప్పట్లోనే చెప్పారని అతిషి తెలిపారు. పదేళ్ల దుష్టపాలనను కేజ్రీవాల్ బయటపెడతాడని బీజేపీ భయపడుతోందని ఆరోపించారు. కేజ్రీవాల్‌కు పిలిచి అరెస్టు చేసేందుకు సమన్లు సాకుగా ఉన్నాయని షా చెప్పారని ఆమె అన్నారు.

సిసోడియా బెయిల్‌పై ఈడీ, సీబీఐకి హైకోర్టు నోటీసు

న్యూఢిల్లీ: ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కుంభకోణానికి సంబంధించి నమోదైన అవినీతి, మనీలాండరింగ్ కేసుల్లో బెయిల్ కోరుతూ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా దాఖలు చేసిన పిటిషన్లపై ఢిల్లీ హైకోర్టు శుక్రవారం కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) , ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)లకు నోటీసు జారీ చేసింది. సిసోడియా బెయిల్‌పై స్పందన తెలియజేయాలని ఆదేశించింది. ఏప్రిల్ 30న తన బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసిన ట్రయల్ కోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ సిసోడియా వేసిన పిటిషన్లపై జస్టిస్ స్వర్ణ కాంత శర్మ సీబీఐ, ఈడీకి నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణను మే 8కి వాయిదా వేశారు. తన అభ్యర్థనలు పెండింగ్‌లో ఉన్న సమయంలో, అనారోగ్యంతో ఉన్న తన భార్యను వారానికి ఒకసారి కస్టడీలో కలవడానికి అనుమతించే ట్రయల్ కోర్టు ఆదేశాలను కొనసాగించాలని కోర్టును సిసోడియా మధ్యంతర దరఖాస్తులో కోరారు. ట్రయల్ కోర్టు ఆదేశాలను కొనసాగిస్తే దర్యాప్తు సంస్థకు ఎలాంటి అభ్యంతరం లేదని ఈడీ తరపు న్యాయవాది చెప్పడంతో జస్టిస్ శర్మ అభ్యర్థనను అనుమతించారు.

2021-22కి సంబంధించి ఇప్పుడు రద్దు చేయబడిన ఢిల్లీ ఎక్సైజ్ పాలసీని రూపొందించడంలో, అమలు చేయడంలో అవకతవకలకు సంబంధించి వరుసగా సీబీఐ , ఈడీ దాఖలు చేసిన అవినీతి, మనీలాండరింగ్ కేసులలో సిసోడియా బెయిల్ పిటిషన్‌లను ట్రయల్ కోర్టు కొట్టివేసింది. సీబీఐ అరెస్టు చేసిన తర్వాత 2023 ఫిబ్రవరి 26 నుంచి సిసోడియా కస్టడీలో ఉన్నారు. ఆ తర్వాత ఈడీ ఆయన్ను అరెస్ట్ చేసింది. ఎక్సైజ్ పాలసీ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కె.కవిత కూడా అరెస్టయిన సంగతి విదితమే.

సమరాంగణం 2024

గుజరాత్‌లో గుబులు

కాషాయానికి కషాయం!

- రేకులు రాలుతున్న 'కమలం'
- మోదీ-షా ద్వయం ఆందోళన
- వెంటాడుతున్న రాజ్‌పుత్‌ల వివాదం
- పార్టీలో అంతర్గత అసమ్మతి జ్వాల

గుజరాత్ రాష్ట్రం బీజేపీకి కంచుకోట. 33 ఏళ్లుగా కాంగ్రెస్‌కు కొరకరాని కొయ్యగా ఉంది. 2019లో అన్ని ఎంపీ స్థానాలనూ బీజేపీ కైవశం చేసుకోగా... ఈసారి ఎన్నికల్లో తిరిగి తన పూర్వవైభవాన్ని చాటుకునేందుకు కాంగ్రెస్ కసరత్తు చేస్తుంటే... తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకునేందుకు బీజేపీ ఆపసోపాలు పడుతోంది. సిట్టింగ్ ఎంపీలను తోసి రాజంటోంది. దూరమైన వర్గాలను ఆకట్టుకునేందుకు పాట్లు పడుతోంది. ఆదానీ, అంబానీల నీడలో ఎదిగిన బీజేపీ... పూర్తిగా పేదలు, రైతులు, వ్యాపార వర్గాలకు దూరమైంది. ఈసారి మోదీ-షా వ్యూహాలు పూర్తిగా ఫలించే అవకాశాలు కనిపించటం లేదు. మోదీ మాటల మోళీ... అమిత్‌షా మంత్రాంగం ప్రభావం ఈ ఎన్నికల్లో ఓట్లను రాబట్టడం కష్టమేనని కాషాయ శిబిరంలో చర్చ జరుగుతోంది.

సార్వత్రిక ఎన్నికల్లో గుజరాత్ బీజేపీకి ముచ్చెమటలు తప్పటం లేదు. నరేంద్ర మోదీ, అమిత్‌షా సొంత రాష్ట్రం గుజరాత్‌పైనే ఇప్పుడు అందరి దృష్టి పడింది. 2022లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఎన్నడూలేనంత స్థాయిలో భారీ మెజారిటీ సాధించింది. అయితే ఈ లోక్‌సభ ఎన్నికల్లో కాషాయ పార్టీకి కషాయం పట్టాలని కాంగ్రెస్ వ్యూహం రచిస్తోంది. రాష్ట్రంలో హ్యాట్రిక్ కొట్టాలని బీజేపీ విశ్వప్రయత్నం చేస్తోంది. ఆ ఆశలు అడియాశలేనని రాష్ట్ర రాజకీయ పరిణామాలు సూచిస్తున్నాయి. ఇప్పటికే రాజ్‌పుత్‌లతో బీజేపీ ఇబ్బంది పడుతోంది. పార్టీ సీనియర్ నేత ఒకరు క్షత్రియుల మనోభావాలను దెబ్బతీయడం వివాదానికి తెరతీసిన విషయం తెలిసిందే. మరోవైపు కొందరి అభ్యర్థిత్వాలను పార్టీ వర్గాలు వ్యతిరేకిస్తున్నాయి. ఇదే క్రమంలో కొందరు తమ నామినేషన్లు ఉపసంహరించుకోగా మరికొందరు పోటీలో నిలిచారు. ఫిరాయింపు నేతలకు ప్రాధాన్యత ఇవ్వడంపై పార్టీలో అంతర్గతంగా ఆసమ్మతి జ్వాల రగులుతోంది. ఓట్లు రావన్న భయంతో ఏకగ్రీవాల కోసం కమల దళం కసరత్తు చేస్తోంది. ఇదే క్రమంలో ప్రలోభాలు, బెదిరింపులకు పాల్పడుతూ ప్రత్యర్థులు లేకుండా చేసుకుంటోంది. ఇందుకు సూరత్ స్థానంలో బీజేపీ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నిక కావడమే నిదర్శనం.

2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 26 లోక్‌సభ స్థానాల్లోనూ బీజేపీ విజయ దుందుభి మోగించింది. కాంగ్రెస్‌కు ఒక్కస్థానం దక్కలేదు. బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా వ్యూహ రచన, మోదీ చరిష్మా కారణమని బీజేపీ భుజాలు చరచుకుంది. 2017 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ దీటుగా పోటీ ఇచ్చింది. 77 స్థానాలను కైవశం చేసుకుంది. దీంతో 16 స్థానాలు పెరిగాయి. మరోవైపు, బీజేపీ 99 స్థానాల్లో గెలిచింది. 16 సిట్టింగ్ స్థానాలను కోల్పోయింది. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటెత్తుపోకడ ప్రదర్శించిన కాంగ్రెస్ చతికిలపడ్డది. ఆ ఎన్నికలలో బీజేపీ రికార్డు స్థాయిలో విజయం సాధించింది. పోటీచేసిన 182 నియోజకవర్గాలలో 166 చోట్ల గెలుపొందింది. అంతకుముందు ఎన్నికలలో కన్నా 57 స్థానాలు అధికంగా గెలుచుకుంది. ఈ ఎన్నికలలో కాంగ్రెస్ తీవ్రంగా నష్టపోయింది. 179 నియోజకవర్గాలలో పోటీ చేసి 17 చోట్ల మాత్రమే విజయం సాధించింది. అంతకుముందు ఎన్నికలలో గెలుచుకున్న 60 నియోజకవర్గాలను కోల్పోయింది.

ఉద్దండుల పోటీ

గుజరాత్ నుంచి ఉద్దండులు బరిలో నిలవడంతో చాలా స్థానాల్లో పోటీ ఆసక్తికరంగా మారింది. అహ్మదాబాద్ ఈస్ట్, అహ్మదాబాద్ వెస్ట్, అమ్రేలీ, ఆనంద్, బనస్కాంతా, బర్డోలీ, భరూచ్, భావ్‌నగర్, ఛోటా ఉదయ్‌పూర్, దహోద్, గాంధీనగర్, జామ్‌నగర్, జూనాగఢ్, కచ్, ఖేడా, మహేసనా, నవసరి, పాంచ్‌మహల్, పటన్, పోర్బందర్, రాజ్‌కోట్, సబర్‌కాంతా, సురేంద్రనగర్, వడోదరా, వల్సాద్ స్థానాల్లో పోలింగ్ జరగబోతోంది. గాంధీనగర్‌లో అమిత్‌షా (బీజేపీ), ఇండియా కూటమి తరపున సోనల్ పటేల్ (కాంగ్రెస్) మధ్య హోరాహోరీ సాగనుంది. రాజ్‌కోట్, పోరుబందర్, ఆనంద్, దహోడ్, నవసరి స్థానాల్లోనూ బీజేపీకి కాంగ్రెస్‌కు మధ్య నువ్వా, నేనా అన్నట్లు పోటీ ఉంది. భావ్‌నగర్, భరూచ్ స్థానాల్లో ఆప్ నేతలతో బీజేపీ అభ్యర్థులు తలపడనున్నారు. పోటీ చేస్తున్న ప్రముఖుల్లో కేంద్రమంత్రులు అమిత్‌షా, పరుషోత్తం రూపాలా (రాజ్‌కోట్-బీజేపీ), మన్సుక్ మాండవియా (పోర్బందర్-బీజేపీ), బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సీఆర్ పాటిల్ (నవసరి) ఉన్నారు. భరూచ్ స్థానంలో ఆప్ అభ్యర్థి ఛతర్ వసావా... బీజేపీ నేత అన్సుక్‌భాయి వసవాకు మధ్య రసవత్తర పోరు సాగబోతోంది. అన్ని స్థానాల్లో తమ అభ్యర్థులు సునాయాసంగా గెలుస్తారని బీజేపీ దీమాగా ఉంది.

రాజ్‌పుత్‌లతో కష్టాలు-ట్రంప్‌కార్డుపైనే ఆశలు

క్షత్రియులలో ఆగ్రహం కాషాయ పార్టీని ఇబ్బంది పెడుతోంది. రూపాలా వ్యాఖ్యలతో ఈ వర్గం కోపంగా ఉంది. తాజా ఎన్నికల్లో బీజేపీకి ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని నిర్ణయించుకుంది. దీంతో గుజరాత్‌లోని అన్ని స్థానాల్లో కమలం వికసిస్తుందని ఆశిస్తున్న బీజేపీ పెద్దలకు ముచ్చెమటలు పట్టే పరిస్థితి ఏర్పడింది. రాజ్‌పుత్‌లను బుజ్జగించేందుకు కమలనాథులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అనేక చోట్ల నిరసనలు, ముట్టడి కార్యక్రమాలు జరిగాయి. జామ్‌నగర్, సబర్‌కాంతా, పటన్, భావ్‌నగర్ తదితర ప్రాంతాల్లో బీజేపీ ప్రచారాన్ని రాజ్‌పుత్‌లు అడ్డుకున్నారు. దీంతో తమకున్న ట్రంప్ కార్డు (నరేంద్రమోదీ)నే బీజేపీ నమ్ముకున్నది.

ఈ ఎన్నికలలో సిట్టింగ్ ఎంపీలు ఐదుగురికిపైగా టికెట్లు నిరాకరించడం బీజేపీకి కొంత ఇబ్బందికర పరిస్థితే. రెండుసార్లు ఎంపీగా ఉండి మూడవ సారి పోటీకి సిద్ధమైన నాయకుడు సైతం నామినేషన్ ఉపసంహరించుకోవడాన్ని బట్టి బీజేపీలో అంతర్గత అసమ్మతి అర్థమవుతోంది. అభ్యర్థుల ఎంపికపై పార్టీ వర్గాల్లో అసహనం పెరిగింది. ఇద్దరు అభ్యర్థులు తమ నామినేషన్లు వెనక్కి తీసుకున్నారు. రంజన్‌బేన్ భట్ (వడోదర నుంచి రెండుసార్లు ఎంపీ) తనపై అవినీతి ఆరోపణలు రావడంతో పోటీ నుంచి తప్పుకున్నారు. ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ పోస్టర్లు వెలిశాయి. భట్ నామినేషన్ ఉపసంహరణ అనంతరం ఆయన స్థానంలో హేమంత్ జోషికి టికెట్ లభించింది. భిఖాజీ ఠాకూర్ కూడా సబర్‌కాంతా స్థానం నుంచి దాఖలు చేసిన తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. ఠాకూర్ స్థానంలో కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే మహేంద్ర బరియా భార్య శోభనను బీజేపీ బరిలోకి దించింది. ఇంటిపేరుకు సంబంధించిన వివాదం క్రమంలో సామాజిక మాధ్యమాల్లో నిరసనలు హోరెత్తగా ఠాకూర్ నామినేషన్ ఉపసంహరించుకున్నారు. శోభనా బరియా అభ్యర్థిత్వంపైనా విమర్శలు వచ్చాయి. ఏళ్ల తరబడి పార్టీలో సేవ చేసిన వారిని వదిలేసి ఫిరాయింపు నేతలకు ప్రాధాన్యత ఇస్తున్నారని సొంత నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. గుజరాత్‌లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌కు పెద్ద సవాలుగా పరిణమించింది. తగిన ధర కల్పించడంలో విఫలమవడంతో రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వంపై రైతులు ఆగ్రహంతో ఉన్నారు. దీంతో తాజా ఎన్నికల్లో బీజేపీకి గతసారి వలే భారీ మెజారిటీ వచ్చే అవకాశాలు లేకపోగా కాంగ్రెస్ పుంజుకునేందుకు ఆస్కారం కలిగింది.

ఓటు హక్కుకు దూరం

- యూపీలోని వివాహితల ఆవేదన
- జాబితాలో పేర్లులేని 70 లక్షల మంది

ఉత్తరప్రదేశ్‌లో మహిళల దుస్థితిని ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. అనేక రకాల దాష్టీకాలకు వారు బాధితులుగా ఉన్నారు. ప్రాథమిక హక్కులను కోల్పోతారు. వివాహిత మహిళలకు కనీసం ఓటు హక్కు లేకుండా పోతోంది. సుమారు 70 లక్షల మంది మహిళల పేర్లు ఓటర్ల జాబితాలో లేవంటే పరిస్థితి ఎంత దారుణమో అర్థం చేసుకోవచ్చు. ఇక్కడి మహిళలు తమ అత్తమామలు అనుమతించిన తర్వాతే ఓటరు గుర్తింపు కార్డులు పొందడం ఆనవాయితీ.

2011 జనగణన ప్రకారం ఉత్తరప్రదేశ్‌లో 18ఏళ్లు పైబడిన మహిళలు 7.7 కోట్ల మంది ఉన్నారు. ఎన్నికల సంఘం(ఈసీఐ) గణాంకాల ప్రకారం ఏడు కోట్ల మంది మహిళా ఓటర్లు నమోదయ్యారు. అంటే 70 లక్షల మంది పేర్లు జాబితాలో లేవు. యూపీలోని ఒక్కో నియోజకవర్గం నుంచి సగటున 87,500 మంది మహిళా ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోతున్నారు. 2019 లోక్‌సభ ఎన్నికలలో జాతీయ సగటుపరంగా పురుషులు, మహిళా ఓటర్లలో దాదాపు సమాన శాతం పోలింగ్ నమోదు కాగా.. యూపీ వంటి కొన్ని రాష్ట్రాలు వెనుకబడ్డాయి. యూపీలో ఓటర్ల సంఖ్య 2021లో 14.71 కోట్ల నుంచి 15.02 కోట్లకు పెరిగింది. ఇందులో ఏడు కోట్ల మంది మహిళా ఓటర్లు ఉన్నారు. నవంబర్ 1, 2021 నాటికి 1,000 మంది పురుష ఓటర్లకు 857 మంది మహిళలు ఉన్నారు కానీ డిసెంబర్ 5, 2021 నాటికి అది ఆ సంఖ్య 868కి చేరింది.

కాగా, ఓటు వేసేందుకు మెట్టింటివారు, అత్తింటివారు అనుమతి ఇవ్వడంలేదన్నది మహిళలు వాపోయారు. పెళ్లికి ముందు ఓటు వేస్తామంటే ఇప్పుడు కాదు పెళ్లి తర్వాత అనేవారు... పెళ్లి తర్వాత ఓటేస్తామంటే అత్తింటివారు పట్టించుకోరని పశ్చిమ యూపీకి చెందిన నిర్మల వాపోయారు. ఈ ఏడాది ఎలాగైన ఓటు వేయాలని సంకల్పించి, ఓటరు కార్డును పొందేందుకు శ్రమించానని, దానిని సాధించుకున్నానని ఆమె చెప్పారు. నిర్మల తరహా అనేక మంది వివాహితులు ఓటు హక్కుకు దూరమయ్యారు.

వారసుడొస్తున్నాడు...

- మూడో తరం 'గాంధీ'గా రాహుల్ పోటీ
- ఈ స్థానంతో విడదీయలేని బంధం
- ఇక్కడ నుంచే ఎంపీలైన ఫిరోజ్, ఇందిరా, సోనియా

కాంగ్రెస్ కంచుకోట రాయ్‌బరేలీ

ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ కాంగ్రెస్ పార్టీకి కంచుకోట. ఈ స్థానంలో గాంధీ కుటుంబానికి అమితాదరణ ఉంటుంది. ఫిరోజ్ గాంధీ నుంచి ఇందిరా గాంధీ, సోనియాగాంధీ వరకు ఇదే స్థానం నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించారు. గాంధీ కుటుంబం నుంచి మూడవ తరం నాయకుడిగా కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ రాయ్‌బరేలీ నుంచి పోటీ చేయనున్నారు. దీంతో వారసుడు వస్తున్నాడన్న ఆనందం రాయ్‌బరేలీ ప్రజల్లో కనిపించింది. రాహుల్ కేరళలోని వయనాడ్ నుంచి పోటీ చేసిన విషయం తెలిసిందే. తాజాగా రాయ్‌బరేలీ నుంచి ఆయన నామినేషన్ వేశారు. ఈ ఆకస్మిక పరిణామం ప్రత్యర్థులను గందరగోళానికి గురిచేసింది. రాజకీయ వర్గాల్లో పెద్దచర్చకు దారితీసింది. యూపీలోని అమేథి, రాయ్‌బరేలీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించకుండా కాంగ్రెస్ పార్టీ చివరకు సస్పెన్స్ కొనసాగించింది. నామినేషన్ల చివరి రోజైన శుక్రవారం రాహుల్‌ను బరిలో నిలిపింది. దీంతో రాయ్‌బరేలీ పోరు మరింత ఆసక్తికరంగా మారింది.

గాంధీల వారసత్వ స్థానం

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1952లో, 1957లో జరిగిన తొలి రెండు సార్వత్రిక ఎన్నికల్లో రాయ్‌బరేలీ నుంచి ఫిరోజ్ గాంధీ (రాహుల్ తాతయ్య) ఎన్నికయ్యారు. 1967 నుంచి 1977 వరకు ఎంపీగా ఉన్నారు. ఫిరోజ్ గాంధీ సతీమణి, భారత పూర్వ ప్రధాని ఇందిరా గాంధీ 1967, 1971, 1980 ఎన్నికలలో రాయ్‌బరేలీ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఎమర్జెన్సీ తర్వాత జరిగిన ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ 2004 నుంచి 2019 వరకు నాలుగు సార్లు రాయ్‌బరేలీ ఎంపీగా ఉన్నారు. వీరికి దగ్గర బంధువులైన అరుణ్ నెహ్రూ, శీలా కౌల్ కూడా ఈ స్థానానికి గతంలో ప్రాతినిధ్యం వహించారు. అయితే రాయ్‌బరేలీలో గాంధీ కుటుంబానికి పట్టువున్నది. ఇక్కడి ప్రజలకు గాంధీ ఇంటి పేరు అంటే మమకారం ఎక్కువ. కాబట్టి రాహుల్ ఓడిపోయే ప్రసక్తి లేదు. 2019లో ఉత్తర ప్రదేశ్‌లోని అన్ని స్థానాల్లో కాంగ్రెస్ చిత్తు అయినప్పటికీ రాయ్‌బరేలీలో సోనియాగాంధీ 55.8శాతం ఓట్లతో గెలిచారు.

అమేథిని కాదని రాయ్ బరేలీ నుంచి రాహుల్ గాంధీ పోటీ చేస్తుండటంపై రాజకీయ వర్గాల్లో భారీ ఎత్తున చర్చ జరుగుతోంది. రాహుల్ భయపడిపోయి అమేథి నుంచి పారిపోయారంటూ బీజేపీ ఆరోపణలు గుప్పిస్తోంది. కాంగ్రెస్ వాటిని సమర్థమంతంగా తిప్పికొడుతోంది. రాయ్‌బరేలీ నుంచి రాహుల్ పోటీకి కారణం గాంధీ కుటుంబానికి ఈ స్థానంతో ఉన్న ఆత్మీయబంధమని కాంగ్రెస్ చెబుతోంది. ఉత్తర-దక్షిణ భారతం మధ్య సమతుల్యతకూ ఈ స్థానం దోహదమవుతుంది. సోనియాగాంధీ రాజ్యసభ ఎంపీగా ఉన్నందున ఉత్తరంలో అగ్రనాయకుడి ప్రాతినిధ్యం అత్యవసరం. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే (కర్నాటక), ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ (కేరళ), అధికార ప్రతినిధి జైరాం రమేశ్ (కర్నాటక) దక్షిణ భారతానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో కాంగ్రెస్ మెరుగైన ప్రదర్శన ఇవ్వగా ఉత్తరాది ఆరు రాష్ట్రాల్లో నేరుగా బీజేపీతో తలపడింది. అయితే ఆయా రాష్ట్రాల్లో పార్టీ మరింతగా బలపడాల్సిన అవసరమున్నది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల్లో కాంగ్రెస్ గెలిచింది కానీ రాజస్థాన్, చత్తీస్‌గఢ్‌ను కోల్పోయింది. హిమాచల్ ప్రదేశ్‌లో మాత్రమే పార్టీ సొంతంగా అధికారంలో ఉంది. జార్ఖండ్ సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామిగా కొనసాగుతోంది. వాస్తవానికి అమేథి నుంచి ప్రియాంక గాంధీని పోటీ చేయించాలని కాంగ్రెస్ సీనియర్లు భావించారు. దేశవ్యాప్తంగా పార్టీ తరపున ప్రచార బాధ్యతలను చేపట్టడంతో పోటీ నుంచి ప్రియాంక తప్పుకున్నారు. దీంతో గాంధీ కుటుంబానికి విధేయుడైన కిశోరీ లాల్ శర్మకు అమేథి టికెట్ లభించింది. తొలుత మాజీ ఎంపీ శీలా కౌల్ మనుమడిని అమేథి నుంచి పోటీ చేయించాలని కాంగ్రెస్ యోచించింది. చివరకు శర్మను ఎంపిక చేసింది.

రాయ్‌బరేలీ ప్రజలకు సోనియా భావోద్వేగ వీడ్కోలు

ఇన్నేళ్లు తనకు అండగా నిలిచిన రాయ్‌బరేలీ ప్రజలనుద్దేశించి సోనియాగాంధీ ఓ భావోద్వేగ సందేశాన్ని ఫిబ్రవరి 15న పంపారు. వయస్సు, అనారోగ్యం కారణంగా ఈసారి లోక్‌సభకు పోటీ చేయలేని తెలియజేశారు. 'ఈరోజు నేను ఈ స్థానంలో ఉన్నానంటే అందుకు రాయ్‌బరేలీ కారణమని చెప్పేందుకు గర్విస్తున్నాను. మీరు నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు చేయగలిగినదంతా చేశాను. నాకు వయస్సు మళ్లింది. ఆరోగ్యం సహకరించడంలేదు. అందుకే లోక్‌సభకు పోటీ చేయడం లేదు. ఈ నిర్ణయంతో మీకు ప్రత్యక్షంగా సేవ చేయలేను. మీరెప్పుడు నా మనస్సులో నిలిచిపోతారు. నన్ను ఆదరించినట్లుగానే నా కుటుంబాన్నీ ఆదరిస్తారని ఆశిస్తున్నా. ఢిల్లీలో ఉన్న నా కుటుంబం మీతోనే సంపూర్ణమవుతుంది. మీరుకు నాకు అత్తింటి వారిచ్చిన అదృష్టం. మామగారు ఫిరోజ్ గాంధీని, అత్తయ్య ఇందిరా గాంధీని ఆదరించారు. ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా మన బంధం మరింత పటిష్ఠమైంది. అత్తయ్యను, భర్తను కోల్పోయిన తర్వాత మీ వద్దకు వచ్చిన నన్ను మీరు ఎంతో ఆప్యాయంగా ఆదరించారు. మీరు నాకు ఆత్మీయులు' అని సోనియాగాంధీ పేర్కొన్నారు. రాజస్థాన్ స్థానం నుంచి రాజ్యసభకు నామినేషన్ వేసిన మరుసటి రోజు ఈ సందేశం ఓటర్లకు చేరింది. కాగా, ఇందిరా గాంధీ తర్వాత గాంధీ కుటుంబం నుంచి రాజ్యసభలో అడుగుపెట్టే రెండవ నేతగా సోనియాగాంధీ నిలిచారు. ఇందిరాగాంధీ 1964 నుంచి 1967 వరకు రాజ్యసభ సభ్యురాలిగా ఉన్నారు.

సమరాంగణం 2024

అభివృద్ధికి మలుపు జాఫర్ గెలుపు

అనంతపురంలో సీపీఐ ప్రచార జోరు

సమస్యలపై పోరాడే మిమ్మల్నే గెలిపిస్తామంటున్న ఓటర్లు

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న ప్రజా గొంతుక అనంతపురం అర్బన్ శాసనసభా నియోజకవర్గ సీపీఐ అభ్యర్థి సి.జాఫర్ ఎన్నికల ప్రచారం ప్రజా అభిమానులతో ముందుకు సాగుతోంది. జాఫర్ విజయం కోసం నియోజకవర్గంలో ఇండియా కూటమి కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ శ్రేణులు నియోజకవర్గంలో ఇంటింటికి తిరిగి కంకి-కొడవలి గుర్తుకు ఓటువేసి జాఫర్‌ని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నారు. సీపీఐలో గత 41 సంవత్సరాలుగా ఉంటూ ప్రజల సమస్యలపై పోరాడుతున్న యోధుడు జాఫర్‌ని గెలిపించడం ద్వారా అసెంబ్లీలో ప్రజావాణి వినిపించే అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ప్రత్యేకంగా మహిళా సమాఖ్య, కార్మిక, కర్షక దళాలు మండుటెండను, వడగాడ్పులను సైతం లెక్కచేయకుండా ప్రచారం నిర్వహిస్తున్నారు. జాఫర్ తనదైన శైలిలో ప్రచారాన్ని మొదలుపెట్టి ప్రజల్ని ఆకట్టుకుంటున్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాంభూపాల్, కాంగ్రెస్ పార్టీ మాజీ మంత్రి శైలజానాథ్, అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి వి. మల్లికార్జున వెంటరాగా నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించి ఏప్రిల్ 23న జాఫర్ నామినేషన్ దాఖలు చేశారు. తన ప్రచారంలో నియోజకవర్గ అభివృద్ధిలో వెనుకబాటు, జరిగిన అవినీతిని తీవ్రంగా ఎండగడుతున్నారు. అభ్యర్థి జాఫర్ ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వివిధ డివిజన్లలో పర్యటిస్తున్నారు. ఆయన పర్యటనలో ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీల నగర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని సగభాగంపైగా ఆయన ప్రచారం పూర్తిచేశారు. ఇంటింటికి వెళ్లి ప్రతి ఓటరును కలిసి కంకి-కొడవలి గుర్తుకు ఓటువేసి తనను గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇస్తున్నారు. ప్రతి వీధిలోనూ ఆయన ప్రచారానికి ఓటర్ల నుంచి విశేష స్పందన వస్తోంది. స్థానికులు ఎదురేగి ఆయనకు స్వాగతం పలికి ప్రచారంలో పాలుపంచుకుంటున్నారు గతంలో కమ్యూనిస్టు పార్టీ ప్రజాప్రతినిధులు అందించిన సేవలను గుర్తుచేసుకుని మళ్లీ కమ్యూనిస్టులు రావాలనే ఆకాంక్షను బలంగా వ్యక్తంచేస్తున్నారు. ఓటువేసి తప్పకుండా గెలిపిస్తామని హామీ ఇస్తున్నారు. ప్రజా సమస్యలను చట్టసభల్లో వినిపించే కమ్యూనిస్టులను గెలిపించాలని జాఫర్ విజ్ఞప్తి చేస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేయడానికి కోట్లు అవసరం లేదు... ప్రజల మద్దతు చాలు అని కమ్యూనిస్టులకు అనేకమార్లు ఇక్కడి జనం పట్టం కట్టిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు. నియోజకవర్గంలో గతంలో కమ్యూనిస్టులు ఎన్నికైనప్పుడు, ఇతరులు ఎన్నికైనప్పుడు అభివృద్ధిలో ఎంతో తేడావుందనీ, ఈ తేడాను బేరీజు వేసుకుని తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. నియోజకవర్గాన్ని గతంలో సమతుల్యంగా అభివృద్ధి చేసిన ఘనత కమ్యూనిస్టులకు ఉందనీ, అదే స్ఫూర్తితో పని చేస్తున్న తనను గెలిపిస్తే నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. ప్రజలకు పన్నుల భారం లేని, వివక్ష లేని పారదర్శక పాలన కోసం ఇండియా కూటమి బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని జాఫర్ కోరుతున్నారు. నియోజకవర్గంలో కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన పోరాటాలను ప్రజలకు వివరంగా తెలియజేస్తూ అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకుంటున్నారు. పేద ప్రజలకు వేలాది పట్టాలిప్పించడం ఒక సీపీఐకే సాధ్యమని ప్రజలు చెపుతూ జాఫర్‌కే ఓటువేస్తామని హామీ ఇస్తున్నారు. పేద కుటుంబం నుంచి వచ్చినందున పేదల సమస్యలు తెలిసిన జాఫర్ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేస్తూ ప్రభుత్వాలతో పోరాడి సమస్యలను పరిష్కరిస్తున్నారనీ, అందుకని ఆయనకే ఓటువేసి గెలిపిస్తామని ఓటర్లు మాట ఇస్తున్నారు.

ఇండియా కూటమి పార్టీల బృందం అందరిని కదలిస్తూ... కలిసి ముచ్చటిస్తూ కంకి-కొడవలి గుర్తుపై ఓటువేసి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే జాఫర్‌ను శాసనసభకు పంపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నది. నియోజకవర్గం అభివృద్ధి సాధించాలన్నా, జనవాణి అసెంబ్లీలో వినిపించాలన్న జాఫర్‌ని గెలిపించి తీరాలని ఓటర్లను చైతన్యపరుస్తున్నారు. కమ్యూనిస్టులు చట్టసభల్లో ఉంటే ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలను నిలదీస్తారనీ, అందుకే ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే వారిని గెలిపించాలని అభ్యర్థిస్తున్నది. బీజేపీ, వైసీపీ, టీడీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తున్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి జాఫర్ చేస్తున్న కృషిని కళ్లకు కట్టినట్టు వివరిస్తున్నారు.

- విశాలాంధ్ర- అనంతపురం వైద్యం

వైసీపీలో కలవరం

అసెంబ్లీ బరిలో అసంతృప్తులు

ఎస్సీ, బీసీ నేతల దూరం

ఎంఎస్ బాబు

వసంత కృష్ణప్రసాద్

గుమ్మన జయరామ్

అరణి శ్రీనివాసులు

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార వైసీపీకి చెందిన కొందరు సిట్టింగ్ ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు పార్టీకి దూరమయ్యారు. 2019లో వైసీపీ నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేలలో కొందరు పార్టీని వీడారు. వారంతా ఈ దఫా తిరుగుబాటు బావుటా ఎగురేస్తున్నారు. చాలా మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు రాకపోయినప్పటికీ, పార్టీనే అంటిపెట్టుకుని ఉన్నారు. కొందరు ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు మాత్రం అధిష్ఠానం నిర్ణయాన్ని వ్యతిరేకించి, ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీ అయిన కాంగ్రెస్ చెంతకు చేరారు. మరి కొందరు ఎన్డీఏ కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన నుంచి పోటీలోకి వెళ్లారు. ఇది వైసీపీకి పెద్ద షాక్‌గా మారింది. వైసీపీలో సీట్ల మార్పులు, చేర్పుల కారణంగా టికెట్లు దక్కని వారంతా అసమ్మతితో పార్టీ వీడారు.

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు షర్మిల నాయకత్వంలో ముగ్గురు వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడం చర్చనీయాంశంగా మారింది. చిత్తూరుజిల్లా పూతలపట్టు (ఎస్సీ) నియోజకవర్గ సిట్టింగ్ ఎమ్మెల్యే ఎంఎస్ బాబు వైసీపీకి రాజీనామా చేసి కాంగ్రెస్ చెంతన చేరారు. ఇప్పుడు ఆయన అదే నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థి ఎం.సునీల్‌కుమార్‌పై కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. పి.గన్నవరం (ఎస్సీ) వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆ పార్టీని వీడి, అదే నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. నందికొట్కూరు (ఎస్సీ) వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ వైసీపీకి రాజీనామా చేసి, ఇదే నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. శ్రీకాకుళంజిల్లా టెక్కలి నియోజకవర్గ వైసీపీ సీనియర్‌నేత, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి కాంగ్రెస్‌లోకి చేరారు. ఈ ఎన్నికల్లో టెక్కలి కాంగ్రెస్ అభ్యర్థిగా ఆమె పోటీకి దిగడంతో వైసీపీ నేతలు ఆందోళన చెందుతున్నారు. బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గ వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఇప్పుడు చీరాల నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీకి దిగారు. వైసీపీ బలోపేతం కోసం ఎంతో కృషిచేసిన వారిని ఖాతరు చేయకుండా, టికెట్లు కేటాయించడంతో నేతలు కాంగ్రెస్ చెంతన చేరారు. 2019 ఎన్నికల్లో వైసీపీకి మద్దతిచ్చిన మాజీ ఎమ్మెల్యే డీవై దాస్ తిరిగి కాంగ్రెస్ గూటికి వచ్చారు. ప్రస్తుతం కృష్ణాజిల్లా పామర్రు కాంగ్రెస్ అభ్యర్థిగా ఆయన పోటీ చేస్తున్నారు.

ఎన్డీఏ కూటమిలోకి వైసీపీ ఎమ్మెల్యేలు

ఎన్డీఏ కూటమి భాగస్వామ్య పార్టీ అయిన టీడీపీ, జనసేనలోకి వైసీపీ ఎమ్మెల్యేలు చేరారు. తిరుపతి జిల్లా సత్యవేడు(ఎస్సీ) నియోజకవర్గ వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. అదే నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. మైలవరం నియోజకవర్గంలో వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే వసంతకృష్ణప్రసాద్ ప్రభుత్వ విధానాలపై అసంతృప్తి వ్యక్తం చేసి, పార్టీకి గుడ్‌బై చెప్పారు. గత ఎన్నికల్లో ఇక్కడి నుంచి టీడీపీ తరపున పోటీ చేసిన మాజీ మంత్రి దేవినేని ఉమాకు టికెట్‌ను నిరాకరించారు. దీంతో మైలవరం టీడీపీ అభ్యర్థిగా వసంత కృష్ణప్రసాద్ గెలుపు ఆసక్తిగా మారింది. నెల్లూరుజిల్లా వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే ఆనం రాంనారాయణరెడ్డి ఆ పార్టీని వీడి ఈ ఎన్నికల్లో ఆత్మకూరు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఇదే జిల్లాకు చెందిన నెల్లూరు రూరల్ వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి...అదే నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా బరిలిలో నిలిచారు. పెనమలూరు అసెంబ్లీ వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి టీడీపీలో చేరారు. ఈ ఎన్నికల్లో ఏలూరుజిల్లా నూజివీడు టీడీపీ అభ్యర్థిగా పోటీకి దిగారు. అనంతపురంజిల్లా గుంతకల్లు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి గుమ్మనూరు జయరామ్ పోటీ చేస్తున్నారు. ఈయన వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే. మంత్రిగా ఉన్న జయరామ్‌ను ఎంపీ అభ్యర్థిగా అధిష్ఠానం ప్రకటించింది. అందుకు ఆయన నిరాకరించి, తాను ఎమ్మెల్యేగానే పోటీ చేస్తానని చెప్పడం, అందుకు అధిష్ఠానం నిరాకరించడంతో జయరామ్ పార్టీని వీడారు. ఈ ఎన్నికల్లో టీడీపీలో చేరి గుంతకల్లు అసెంబ్లీ నుంచి పోటీకి దిగారు. వైసీపీ ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్ ఆ పార్టీకి రాజీనామా చేసి, ఈ ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థిగా విశాఖ దక్షిణం నుంచి పోటీలో ఉన్నారు. తిరుపతి వైసీపీ ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులకు తిరిగి టికెట్ దక్కకపోవడంతో ఆయన పార్టీ వీడారు. చిత్తూరు నియోజకవర్గ జనసేన అభ్యర్థిగా ఆయన బరిలో నిలిచారు. ఈ తరహాగా వైసీపీ నుంచి ముఖ్యనేతలు కాంగ్రెస్, టీడీపీ, జనసేనకు దగ్గరవ్వడం వైసీపీపై తీవ్ర ప్రభావం చూపుతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

- విశాలాంధ్ర బ్యూరో-అమరావతి

కర్నూలులో ఎన్నికల వేడి

- పూటకో పార్టీ మారుతున్న నేతలు
- ఆరోపణలు-ప్రత్యారోపణల హోరు
- ధనమయయంగా మారిన ఎన్నికలు



ఎన్నికల తేదీ సమీపిస్తుండటంతో ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో రాజకీయాలు వేడెక్కాయి. పూటకో పార్టీలోకి నాయకులు వెళుతుండటం... ఆరోపణలు, ప్రత్యారోపణలతో హోరెత్తిస్తుండటంతో స్థానిక రాజకీయాలు మరిగిపోతున్నాయి. ఈ పరిస్థితిలో తాజా ఎన్నికలు ధనమయమయ్యాయి. రాష్ట్రంలో వేసవి వాతావరణం కంటే కూడా రాజకీయమే సెగలు కక్కుతుండటం చర్చనీయాంశమైంది. ఒకవైపు రాజకీయ వేడి, మరోవైపు పగటి ఉష్ణోగ్రతలతో కర్నూలు జిల్లా ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ సారి ఎన్నికలలో ఎలాగైనా గెలవాలన్నట్లుగా రాజకీయాల స్థాయిని నేతలు దిగజారుస్తున్నారు. అధికార పార్టీ నాయకుడు మరో పార్టీలోకి వెళితే సాయంత్రానికల్లా నయానో భయానో బెదిరించి తిరిగి పార్టీలోకి తెచ్చుకునే పరిస్థితి ఉంది.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంటు నియోజకవర్గాలు ఉన్నాయి. 2019 ఎన్నికలలో వైసీపీ క్లీన్‌స్వీప్ చేసింది. 2014 ఎన్నికలలో వైసీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి రెండు ఎస్సీ నియోజకవర్గాలతో పాటు కర్నూలు, ఎమ్మిగనూరు, ఆలూరు, కర్నూలు పార్లమెంటు అభ్యర్థులను మార్పు చేశారు. ఈ సారి గెలుపు గుర్రాలకే టికెట్లు ఇచ్చారు. వైసీపీ, టీడీపీ పార్టీలు తమ అభ్యర్థులను పోటాపోటీగా ఎంపిక చేశారు. రెండు పార్టీలు సంపన్నులకే పెద్దపీట వేశాయి. ప్రజల్లో గుర్తింపు లేకపోయినాగానీ ఇతర జిల్లాలకు చెందిన డబ్బున్న నేతలను బరిలోకి దించాయి. డబ్బు ప్రామాణికంగానే టికెట్లు ఇచ్చినట్లు ప్రచారమున్నది. అయితే తమను కాదని పక్క జిల్లాల వారిని పోటీకి దింపడంపై స్థానిక నేతల్లో అసమ్మతి నెలకొంది. నందికొట్కూరు, కోడుమూరు నియోజకవర్గాలలో వైసీపీలో ఉన్న మాజీ ఎమ్మెల్యేలు సీటు ఆశించి భంగపడ్డారు. ఆపై కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుని ఆ పార్టీ తరపున ఎన్నికల బరిలో నిలిచారు. ఎంపీ సంజీవకుమార్, మంత్రి గుమ్మనూరు జయరాం కూడా టీడీపీలో చేరారు. నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్ కాంగ్రెస్‌లోకి వెళ్లారు. ఈ పరిస్థితుల్లో తాజా ఎన్నికలు జిల్లాలో ఉత్కంఠ పెంచాయి. ఇండియా కుటమి తరపున సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ అభ్యర్థులు బరిలో ఉండటంతో వైసీపీ, టీడీపీ అభ్యర్థులకు భయం పట్టుకుంది. ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో అభ్యర్థి వల్ల ఓట్లు చీలే అవకాశం ఉండటంతో ఏమి జరుగుతుందో అన్న అందోళన ఆ పార్టీ నేతల్లో ఉంది. దీంతో గెలుపే లక్ష్యంగా విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారు. టీడీపీ... ఎన్డీయే కూటమిలో ఉండటం కూడా ఆ పార్టీకి ఇబ్బందిగా మారింది.

- విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు

ఇండియా' అభ్యర్థుల గెలుపు కోసం

సీపీఐ భారీ బైక్ ర్యాలీ

మతం పేరుతో మోదీ చిచ్చుపెడుతున్నారు: రామకృష్ణ

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తుండటంతో ఇండియా కూటమి ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. అందులో భాగంగా శుక్రవారం భారీ జనసముద్రం మధ్య అనంతపురం నగరంలో బైకు ర్యాలీ నిర్వహించారు. బైక్ ర్యాలీలో పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఈ పదేళ్లలో మోదీ సర్కారు ప్రజలు, రైతు సమస్యలను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. కేవలం కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను దోచిపెట్టడమే లక్ష్యంగా పనిచేసిందని ధ్వజమెత్తారు. అదానీ, అంబానీల కోసమే ప్రధాని మోదీ పనిచేస్తున్నారన్నారు. 143 కోట్లమందికి ప్రధానిగా ఉన్న నరేంద్రమోదీ ఎన్నికల ప్రచారంలో క్రైస్తవులకు, ముస్లింలకు వ్యతిరేకంగా విషం కక్కుతున్నారని ఆరోపించారు. రాహుల్‌గాంధీ ప్రధాని కావాలని పాక్ నేతలు కాంక్షిస్తున్నారంటూ అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. తిరిగి మోదీ ప్రధానమంత్రి అయితే అంబేద్కర్ రాజ్యాంగాన్ని మంటగలుపుతారని హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు రిజర్వేషన్లు ఉండవని చెప్పారు. రాష్ట్రంలో ముస్లింలకు ఇస్తున్న నాలుగు శాతం రిజర్వేషన్ల రద్దు చేస్తామని బహిరంగంగా ప్రకటిస్తున్నారని, దీనిపై మైనారిటీలు ఆలోచించాలని కోరారు. ఇండియా కూటమి గెలుపుతోనే దేశం అభివృద్ధి చెందుతుందని స్పష్టంచేశారు. టీడీపీ, బీజేపీ, జనసేన, వైసీపీ ఎంపీలు గెలిస్తే...మోదీకి మరోసారి దాసోహం కాకతప్పదని రామకృష్ణ వివరించారు. ఇండియా కూటమి తరఫున అనంతపురం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వి.మల్లికార్జున్ హస్తం గుర్తుకు ఓటు వేస్తే రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అవుతారన్నారు. ఎన్నికల్లో గెలవడానికి వైసీపీ, ఎన్‌డీఏ అభ్యర్థులు కోట్లు కుమ్మరిస్తున్నారని ఆరోపించారు. వారు గెలిస్తే ప్రజల సమస్యలు పక్కనపెట్టి ఖర్చు చేసిన డబ్బులు సంపాదించుకోవడంపైనే దృష్టి పెడతారన్నారు. ప్రజల సమస్యలను అసెంబ్లీలో వినిపించే సీపీఐ అనంత అర్బన్ అభ్యర్థి జాఫర్‌ను కంకి కొడవలి గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. ర్యాలీలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.జగదీశ్, జిల్లా సహాయ కార్యదర్శి పి.నారాయణస్వామి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పి.రామకృష్ణ, జిల్లా కార్యదర్శి టి.నారాయణస్వామి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరాములు, లింగమయ్య, రమణయ్య, అలీపీర, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కుల్లాయిస్వామి, నాయకులు రమణయ్య, వంశీ, హనుమంతు, హరి, రాజేశ్, వి.కృష్ణుడు, మోహన్ కృష్ణ, రాకెట్ల, శ్రీనివాసులు, చాంద్ బాషా, రాజశేఖర్, శ్రీకాంత్, షకీల్, ఆనంద్, సుఖదేవ్, జిలాన్, సంతోశ్ కుమార్, రాజు, జాఫర్, నాగార్జున, ఖాజా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

విమల విజయం అభివృద్ధికి చిహ్నం

ప్రచారంలో దూసుకుపోతున్న ఇండియా కూటమి నేతలు

విశాలాంధ్ర-విశాఖ: ఇండియా కూటమి బలపరిచిన విశాఖ పశ్చిమ అసెంబ్లీ సీపీఐ అభ్యర్థి అత్తిలి విమల విజయాన్ని కాంక్షిస్తూ నియోజకవర్గ పరిధిలో ప్రచారాన్ని ఆ పార్టీ శ్రేణులు హోరెత్తిస్తున్నారు. విమల విజయం అభివృద్ధికి చిహ్నం... ఆమె గెలుపుతోనే పశ్చిమ నియోజకవర్గ రూపురేఖలు మారిపోతాయంటూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ప్రజాస్పందన చూస్తుంటే విమల గెలుపు నల్లేరుపై నడకేనంటున్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కసిరెడ్డి సత్యనారాయణ, పీ చంద్రశేఖర్, ఎస్.కె.రెహమాన్, ఆర్.శ్రీనివాసరావు, జీ రాంబాబు, సీపీఐ అనకాపల్లి జిల్లా నేతలు జీ గురుబాబు, అర్జున్, వై.రాంబాబు, గండి అప్పారావు, క్రాంతి నేతృత్వంలో శుక్రవారం విమల ఇంటింటా ప్రచారం చేశారు. గోపాలపట్నం లక్ష్మీనగర్ ఈ, ఎఫ్ బ్లాకుల్లో, పారిశ్రామిక ప్రాంతం, జనతా కాలనీ, ఇందిరా కాలనీ-1, అంబేద్కర్ జంక్షన్, మర్రిపాలెం తదితర ప్రాంతాల్లో ఎండను సైతం లెక్కచేయక ప్రచార హోరెత్తించారు. కంకి-కొడవలి గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ధన రాజకీయాలు రాజ్యమేలుతున్న తరుణంలో నిరంతరం ప్రజల మధ్య ఉండే వామపక్ష వాదులకు పట్టం కట్టాలని కోరారు. బీజేపీ, దాని మిత్రపక్షాలను ఓడించి రాష్ట్రాన్ని రక్షించాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో బీజేపీని ఓడించడం ద్వారా రాష్ట్రంలో వైసీపీ, టీడీపీలకు ముకుతాడు వేయవచ్చని వివరించారు. అడుగడుగునా విమలకు ప్రజలు హారతులు పట్టి స్వాగతించారు. కమ్యూనిస్టుల వాణి అసెంబ్లీలో వినిపించాలని, అందుకు నేడు జరుగుతున్న ఎన్నికలు మంచి తరుణమని పేర్కొన్నారు. నియోజవర్గ పరిధిలో అధికశాతం మంది కాంట్రాక్ట్ కార్మికులు ఉన్నారని, వారి ఉద్యోగ భద్రత నేడు ప్రశ్నార్థకంలో పడిందని విమర్శించారు. ఈ ప్రచారంలో కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, భారత్ బచావో, ఆమ్ ఆద్మీ విద్యార్థి, యువజన, మహిళా సంఘాల నేతలు పాల్గొన్నారు.

అన్నమయ్య ప్రాజెక్టుకు

టీడీపీ, వైసీపీ ద్రోహం

బుక్కే విశ్వనాథ్ ఎన్నికల ప్రచారంలో ఈశ్వరయ్య

విశాలాంధ్ర-రాజంపేట: అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోవడానికి నాటి టీడీపీ, నేటి వైసీపీ ప్రభుత్వాలే కారణమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య విమర్శించారు. ప్రాజెక్టు మరమ్మతులకు నాలుగు కోట్ల రూపాయల కోసం నాడు అధికారులు మొరపెట్టుకున్నా చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోలేదని, ఇప్పుడు జగన్ ప్రభుత్వం సైతం ఆ పనులు చేపట్టలేదని మండిపడ్డారు. ఇసుకాసురుల ధన దాహానికి ప్రాజెక్టు కొట్టుకుపోవడంతో పాటు గ్రామాలకు గ్రామాలు జలమయమయ్యాయని చెప్పారు. ఇండియా కూటమి బలపరిచిన సీపీఐ రాజంపేట అసెంబ్లీ అభ్యర్థి బుక్కే విశ్వనాథ నాయక్ విజయాన్ని కాంక్షిస్తూ ఈశ్వరయ్య సహా సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ నేతలు రాజంపేట పట్టణంలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. రాజంపేట కొత్త బస్టాండ్ నుండి పాత బస్టాండ్ వరకు ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారినా రాజంపేట అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. ఈ ప్రాంతానికి మెడికల్ కళాశాల వస్తే...దానిని సైతం నాయకులు ఇతర ప్రాంతానికి తరలించారన్నారు. గాలేరు-నగరి పూర్తి అయితే రాజంపేట, రైల్వే కోడూరు నియోజక వర్గాలలో మూడు పంటలు వేసుకోవడానికి, తాగునీటికి ఇబ్బంది ఉండదన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయించడంలో పాలకులు నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. నందలూరు లోకోషెడ్‌ను మన పాలకులు మూసివేసి... ఉపాధి లేకుండా చేశారన్నారు. ప్రజాసంఘాల ఉద్యమం ఫలితంగా నాడు లోక్‌సభలో సీపీఐ నేత గురుదాస్ దాస్‌గుప్తా పోరాడారని, ఇందుకు ప్రభుత్వం దిగివచ్చి...అనుమతిచ్చినా ఇక్కడి పాలకులు మోకాలొడ్డారని ఈశ్వరయ్య గుర్తు చేశారు. ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించడం ద్వారా ఈ ప్రాంత అభివృద్ధికి సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రచార కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మహేశ్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్వేల రవికుమార్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.శివరామకృష్ణ దేవర, జ్యోతి, చిన్నయ్య, నియోజకవర్గ సహాయ కార్యదర్శి ఎమ్మెస్ రాయుడు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పందుగోల మణి, సీపీఐ జిల్లా సమితి సభ్యులు సలీం వేణుగోపాల్ రెడ్డి, రాజశేఖర్, నాగమ్మ, నాయకులు శివయ్య, నరసింహులు, నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

'జంగాల' ప్రచారానికి విశేష ఆదరణ

విశాలాంధ్ర-గుంటూరు: గుంటూరు నగరంలో శుక్రవారం రాత్రి ఇండియా కూటమి బలపరచిన గుంటూరు పార్లమెంట్ సీపీఐ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్ నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభించింది. స్థానిక బీఆర్ స్టేడియం నుంచి హిందూ కళాశాల మీదుగా పట్నంబజారు, పాతబస్టాండ్ సెంటర్ వరకు ప్రచార కార్యక్రమం నిర్వహించారు. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కంకి కొడవలి గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని జంగాల ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, నాయకులు మేడా హనుమంతరావు, ఆకిటి అరుణ్‌కుమార్, పచ్చల శివాజి, బందెల నాసర్ జీ, నూతలపాటి చిన్న, ఆకిటి రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ మద్దతు

ఎన్నికల ప్రచారం చేసుకుంటూ ముందుకు సాగుతున్న జంగాలకు గుంటూరు నగర ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రాంప్రసాద్, మంగా శ్రీనివాసరావు అధ్వర్యంలో కార్యకర్తలు ఘన స్వాగతం పలికి తమ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా జంగాల అజయ్‌కుమార్‌ను సత్కరించారు. గుంటూరు ఎంపీగా జంగాలను తాము గెలిపించుకుంటామని స్పష్టం చేశారు.

గుంటూరు పార్లమెంట్ స్థానంలో 'కంకి కొడవలి' గుర్తుపై ఓటేయండి

దేశంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తేనే పెట్రోలు, డీజిల్ సహా నిత్యావసర వస్తువుల ధరలు తగ్గుతాయని ఓ వీడియో సందేశంలో జంగాల అజయ్‌కుమార్ పేర్కొన్నారు. గుంటూరు పార్లమెంట్‌కు కాంగ్రెస్, సీపీఎం, ఆమ్ ఆద్మీ తదితర పార్టీలతో కూడిన ఇండియా కూటమి బలపరిచిన సీపీఐ అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నందున ఈవీఎం మెషిన్‌లో కనిపించే బ్యాలెట్‌లో హస్తం గుర్తుకు బదులు కంకి కొడవలి గుర్తు ఉంటుందన్నారు. అలాగే పార్లమెంట్ పరిధిలోని మంగళగిరిలో సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుపై సీపీఎం అభ్యర్థి, మిగిలిన ప్రాంతాలలో హస్తం గుర్తుపై కాంగ్రెస్ అభ్యర్థులు పోటీలో ఉంటారని వెల్లడించారు. ప్రజలు ఈ మార్పును గమనించాలని కోరారు. గుంటూరు పార్లమెంటు సీపీఐ అభ్యర్థిగా తనను కంకి కొడవలి గుర్తుపై ఓటు వేసి గెలిపించాల్సిందిగా కోరారు. ప్రజల పక్షాన పోరాటం చేసే కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. దేశంలో ఇండియా కూటమి గెలిస్తే ప్రధానిగా రాహుల్ గాంధీ బాధ్యతలు చేపట్టడతారని... ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తూ తన మొదటి సంతకం చేస్తారని తెలిపారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం రక్షించబడుతుందని, దేశంలో ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందన్నారు. ఇవన్నీ ఇండియా కూటమి గెలుపుతోనే సాధ్యమని స్పష్టం చేశారు.

'ఇండియా'తోనే

కడప-బెంగళూరు రైల్వేప్రాజెక్టు సాధ్యం

కమలాపురం సీపీఐ అభ్యర్థి గాలిచంద్ర

విశాలాంధ్ర-కడప రూరల్ : దేశంలో ఇండియా కూటమి అధికారంలోకి రాగానే కడప బెంగళూరు రైల్వేలైన్ ప్రాజెక్టుకు తగినన్ని నిధులు కేటాయించి పూర్తి చేస్తామని కూటమి తరఫున కమలాపురం అసెంబ్లీకి పోటీ చేస్తున్న సీపీఐ అభ్యర్థి గాలి చంద్ర అన్నారు. శుక్రవారం పెండ్లిమర్రి రైల్వే స్టేషన్‌ను పరిశీలించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ కడప-బెంగళూరు రైల్వే లైన్ నిర్మాణం ద్వారా జిల్లా నుంచి రాక పోకలు మరింత సులభమవుతాయన్నారు. ముఖ్యంగా కమలాపురం నియోజకవర్గం నుంచి ఉద్యాన పంటల రవాణా, ఐటీ ఉద్యోగుల, ఆస్పత్రులకు వెళ్లే రోగుల ప్రయాణానికి ఉపయుక్తంగా ఉంటుందన్న ఆలోచనతో 2007లో అన్ని అనుమతులతో దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి కేంద్రంలో యూపీఏ ప్రభుత్వాన్ని ఒప్పించి చేపట్టిన పనులు వైయస్సార్ మరణానంతరం ఆగిపోయాయన్నారు. తాను అధికారంలోకి వస్తే జిల్లాలో తన తండ్రి చేపట్టిన పనులు పూర్తి చేస్తారని నమ్మబలికిన వైఎస్ జగన్... ఐదేళ్లయినా ఒక్క పైసా కూడా రైల్వే మార్గానికి నిధులు కేటాయించకుండా తీవ్రంగా నిర్లక్ష్యం చేశారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి ప్రాజెక్టు అయిన కడప-బెంగళూరు రైల్వే మార్గానికి భూ సేకరణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదయితే... రైల్వే ట్రాక్ నిర్మాణం కేంద్ర ప్రభుత్వం చేపట్టాల్సి ఉండగా... ఈ దిశగా నిధులు ఘోరంగా విఫలమయ్యారన్నారు. పైగా పెండ్లిమర్రి మీదుగా లక్కిరెడ్డిపల్లి, మదనపల్లి కోలార్ రైల్వే మార్గాన్ని రద్దుచేసి ముద్దనూరు పులివెందుల మీదుగా కొత్త ప్రతిపాదన చేస్తూ కేంద్రానికి లేఖ రాయడంతో కడప -బెంగుళూరు రైల్వే మార్గం జిల్లా ప్రజల నెరవేరని కలగా మారిందన్నారు. కడప నుండి పెండ్లిమర్రి వరకు నడిచే డెమో రైలు కూడా రద్దు చేయడంతో నిర్వహణ లేక రైల్వే ట్రాక్ వెంబడి కంపచెట్లు పెరిగిపోయాయని, రైల్వే పట్టాలు తుప్పు పట్టిపోతున్నాయని తెలిపారు. కోట్ల రూపాయల ప్రజాధనం నిరుపయోగంగా మిగిలిందన్నారు. రానున్న ఎన్నికల్లో కడప పార్లమెంటు నుండి పోటీ చేస్తున్న ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డినీ, కమలాపురం అసెంబ్లీకి పోటీ తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పీ చంద్రశేఖర్, కేసి బాదుల్లా, బ్రహ్మం, వెంకట్ రాముడు, వలరాజు, ఇమ్మానుయేల్, శివశంకర్, ఆకిరా తదితరులు పాల్గొన్నారు.

కార్మిక పోరాటయోధుడు మురళిని గెలిపించుకుందాం

విశాలాంధ్ర-తిరుపతి: ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతిలో పీడిత వర్గాల అభ్యున్నతికి పనిచేసే ఇండియా కూటమి అభ్యర్థి పి.మురళిని గెలిపించుకుందామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ రామానాయుడు విజ్ఞప్తి చేశారు. నగరంలోని చెన్నారెడ్డి కాలనీ తదితర ప్రాంతాల్లో శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మురళిని గెలిపించాలని ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మురళి పేదల పార్టీ పెన్నిధి అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్రమోదీ ప్రభుత్వం దేశాన్ని విడగొట్టడానికి కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ముస్లింలు, క్రైస్తవులు, మైనార్టీలను దేశంలో లేకుండా చేయడానికి మోదీ ప్రభుత్వం పన్నాగం పన్నుతోందన్నారు. రిజర్వేషన్లు కూడా రద్దు చేస్తామని మోదీ ప్రభుత్వం బహిరంగంగా ప్రకటిస్తోందని వారు ధ్వజమెత్తారు. హిందుత్వాన్ని రెచ్చగొడుతూ... దేశాన్ని ప్రమాదకర స్థితిలోకి నెడుతున్నారన్నారు. ప్రపంచంలోనే ప్రతిష్టాత్మకమైన భారత రాజ్యాంగాన్ని మార్చే కుట్ర బీజేపీ చేస్తోందన్నారు. పెను సవాల్‌గా మారిన ఈ ఎన్నికల వేళ ప్రజలు కీలక నిర్ణయం తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. లేదంటే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు.

లౌకికవాద పార్టీలకు ప్రజలు అండగా నిలవాలని కోరారు. ప్రమాదకర పరిస్థితుల నుంచి దేశాన్నికాపాడుకోవాలంటనే ఎన్డీయే కూటమిని ఓడించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో వైసీపీ, టీడీపీ... మోదీకి ఊడిగం చేయడానికి పోటీ పడుతున్నాయన్నారు. జగన్, చంద్రబాబును ఓడించాలని అన్నారు. జగన్ రాష్ట్రానికి ఎలా ద్రోహం చేశాడో సొంత చెల్లెలు షర్మిల చెబుతోందని వారు గుర్తు చేశారు. తిరుపతిలో కార్మికవర్గం కోసం సుమారు మూడు దశాబ్దాల పాటు పోరాటం చేస్తున్న ఇండియా కూటమి బలపరిచిన సీపీఐ అభ్యర్థి మురళిని గెలిపించాలని వారు కోరారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు టి.జనార్దన్, నగర కార్యదర్శి విశ్వనాథ్, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, నదియా, బాలకృష్ణ, చలపతి, రవి, ప్రజా సంఘాల నాయకులు శివారెడ్డి, రవి, రాజా, శివ, శ్రీరాములు, గుర్రప్ప, కాలయ్య, మంజుల, పద్మనాభరెడ్డి, సీపీఎం నేతలు సుబ్రహ్మణ్యం, బుజ్జి, వేణు, కాంగ్రెస్ నేత గోపాల్ రెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా ఎన్నికలు

డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీశ్‌వ్యాస్ ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించాలని రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులను, ఎస్పీలను భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీశ్‌వ్యాస్ ఆదేశించారు. ఈ నెల 13న రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు జరగనుండగా... రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్‌కుమార్ మీనా, జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలు, ఎన్నికల సాధారణ, పోలీస్, వ్యయ పరిశీలకులతో న్యూఢిల్లీలోని నిర్వచన్ సదన్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. రాష్ట్రంలో చేస్తున్న ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో ఎన్నికల నిర్వహణకు సంబంధించి వివిధ అంశాల్లో చోటు చేసుకుంటున్న సంఘటనల నేపథ్యంలో ఈ రెండు రాష్ట్రాలను సునిశిత రాష్ట్రాలుగా గుర్తించడం జరిగిందన్నారు. అధికారులతా అప్రమత్తంగా ఉంటూ ఎన్నికల నిర్వహణలో ఎటువంటి హింసకు, అల్లర్లకు, పక్షపాతానికి తావులేకుండా ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఓటింగ్ చీకటి పడే వరకూ జరగడం గత ఎన్నికల్లో గుర్తించడం జరిగిందని, అందుకు అనుగుణంగా తగు లైటింగ్, బందోబస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ఓటర్లు ఎండ దెబ్బకు గురికాకుండా క్యూలైన్లన్నీ షామియానాలతో కవర్ అయ్యే విధంగా చూడాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులైన తాగు నీరు, ప్రథమ చికిత్స కేంద్రాలు, వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా తగు ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఈవీఎం నిర్వహణకు సంబంధించి ఎన్నికల సిబ్బందికి తగు ముందస్తు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని, ఎటువంటి సాంకేతిక లోపాలు తలెత్తినా వెంటనే ఆ సమస్యను సరిదిద్దుకునే కనీస పరిజ్ఞానం వారికి ఉండేలా శిక్షణను ఇవ్వాలన్నారు.

బండ్ల గణేశ్‌పై క్రిమినల్ కేసు

విశాలాంధ్ర-హైదరాబాద్: తన ఇంటిని కబ్జా చేశాడన్న బాధితుడి ఫిర్యాదు మేరకు ప్రముఖ సినీ నిర్మాత బండ్ల గణేశ్‌పై ఫిలింనగర్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వివరాలివి. ఫిలింనగర్‌లో హీరా గ్రూపు సీఈఓ నౌహీరా షేక్‌కు ఓ ఇల్లు ఉంది. రూ.75 కోట్ల విలువ చేస్తుంది. దీన్ని బండ్ల గణేశ్ కబ్జా చేశాడు. ఈ ఏడాది ఫిబ్రవరి 15న ఇంటిని ఖాళీ చేయమని నౌహీరా షేక్ వెళ్లాడు. అతడిని నిర్బంధించి బెదిరించాడు. ఈ విషయమై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదు. పైగా బాధితుడిపైనే కేసు నమోదు చేశారు. బెదిరింపులపై నౌహీరా షేక్ డీజీపీకి ఫిర్యాదు చేశారు. అలాగే మార్చి 14న ఫోక్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ వారు నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నంబరు 416/36/2/2024గా అదే నెల 26న రిజిస్టర్ అయి పెండింగ్‌లో ఉంది. ఉన్నతాధికారుల ఆదేశంతో బండ్ల గణేశ్‌పై ఐపీసీ 341, 506 సెక్షన్ల కింద ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.



భయం వీడి సరైన నిర్ణయం తీసుకోండి

ప్రభుత్వ ఉద్యోగులకు టీడీపీ అధినేత చంద్రబాబు లేఖ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు భయం వీడి ఎన్నికల్లో సరైన నిర్ణయం తీసుకోవాలని కోరుతూ టీడీపీ అధినేత చంద్రబాబు శుక్రవారం వారికి లేఖ రాశారు. ప్రభుత్వ ఉద్యోగులు అంటే ప్రభుత్వంలో భాగస్వాములు. ఎంతో శ్రమించి ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించి ప్రజల కోసం, ప్రభుత్వ ఆశయాల సాధన కోసం అంకిత భావంతో పనిచేసే మీ అందరికీ నా వందనం. వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం మళ్లీ 30 ఏళ్లు వెనక్కి వెళ్లిపోయింది. తీరని అప్పుల ఊబిలో కూరుకుపోయింది. రాబోయే తరాలకు మంచి భవిష్యత్ అందించడానికి, రాష్ట్రానికి పూర్వ వైభవం తీసుకురావడానికి కలసికట్టుగా పని చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఉద్యోగులకు మెరుగైన పీఆర్సీ అందించి, సకాలంలో జీతాలు, పెన్షన్లు, ఇతర అన్ని ఆర్థిక ప్రయోజనాలను చెల్లించే ఏర్పాటు చేస్తుందని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను వైసీపీ నాయకులు అవమాన పరుస్తున్నారని, మేము వచ్చాక వారి గౌరవాన్ని కాపాడుతామన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విభజన అనంతరం ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉన్నప్పటికీ ప్రభుత్వ ఉద్యోగులను నిరాశ పర్చకూడదని 2015 వేతన సవరణలో 43 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చామన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన అన్ని ఆర్థిక ప్రయోజనాలను సకాలంలో అందించినట్లు వివరించారు. ఒకటో తేదీన జీతాలు ఇవ్వడంలో ఏనాడూ వెనకాడలేదన్నారు. వారం రోజుల్లో సీపీఎస్‌ను రద్దు చేస్తామన్న హామీని తుంగలో తొక్కి ఉద్యోగులను మోసగించడమే కాకుండా వారి ఆత్మహత్యలకు కారణమైందన్నారు. విద్యారంగంలో జీవో నం. 117 తీసుకువచ్చి పాఠశాలల విలీనంతో ఉపాధ్యాయ పోస్టులను రద్దు చేసి, 12,600 పాఠశాలలను ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మార్చిందని తెలిపారు. పదవీ విరమణ ఉద్యోగులకు రావలసిన బకాయిలన్నింటినీ 2029లో చెల్లిస్తామని, పెన్షనర్లు ఎంతగానో వేచి చూసే గ్రాట్యూటీ అందుకోకుండా జీవో ఇచ్చిందన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.